శుక్రవారం 7-4-2023

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 15

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నా అక్కలూ.. చెల్లెళ్లు..
తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే
నా నిజమైన పుట్టిన రోజు'



శార్దూల్ ధనాధన్...

ఐపీఎల్‌లో బెంగళూరుపై 81 పరుగులతో గెలిచిన కోల్‌కతా నైట్‌రైడర్స్ -15లో



ఎక్కడి రేట్లు అక్కడే..!

ఆర్‌బీఐ అనూహ్య నిర్ణయం.. కీలక రెపో రేటు 6.5%గా కొనసాగింపు -15లో



పైలట్ సీటు కిందే పాము..

తన సీటు కింద అత్యంత ప్రమాదకర పాము కనిపిస్తున్నా గాభరా పడకుండా విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశాడో పైలట్.

వివరాలు 6లో ▸



అక్రమార్జనపై పోరు

అవినీతి, బంధుప్రీతి, శాంతిభద్రతల సవాళ్లను రూపుమాపేందుకు బీజేపీ అవిశ్రాంతంగా కృషి చేస్తోందని మోదీ పునరుద్ఘాటించారు.

వివరాలు 6లో ▸



కెనడాలో విద్వేష ఘటన

కెనడాలోని స్వామినారాయణ్ ఆలయ గోడపై 'హిందుస్తాన్ ముర్దాబాద్', 'మోదీని ఉగ్రవాదిగా ప్రకటించాలి' అని రాతలు రాశారు.

వివరాలు 6లో ▸



విపక్షాల ఐక్యతా రాగం

బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం దాడికి గురవుతోందంటూ కాంగ్రెస్ సహా 19 విపక్ష పార్టీలు 'తిరంగా మార్చ్' ర్యాలీ నిర్వహించాయి.

వివరాలు 6లో ▸

అవును..మళ్లించాం

మార్గదర్శి మదుపరుల డబ్బును సొంత పెట్టుబడిగా పెట్టాం

సీఐడీ విచారణలో మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్

- చిట్‌ఫండ్ చట్టమే తెలీదు.. అసలది మాకు వర్తించదు
- తాము కంపెనీల చట్టాన్ని అనుసరిస్తామంటూ బుకాయింపు
- లేని చెక్కులు బ్యాలన్స్‌షీట్‌లో ఎలా చూపామో నాకు తెలీదు
- అవన్నీ మీకు చెప్పం... ప్రధాన కార్యాలయం రికార్డులూ చూపించం
- ఆధారాలతో సీఐడీ ప్రశ్నించడంతో నీళ్లు నమిలిన శైలజా కిరణ్
- సోదాల్లో లభ్యమైన పత్రాలను చూపించిన అధికారులు -10లో

గురుకుల కొలువులు
9,231



వివిధ కేటగిరీల్లో పోస్టుల భర్తీకి 9 నోటిఫికేషన్లు జారీ చేసిన టీఆర్‌ఈఐఆర్‌బీ

- 17 నుంచే దరఖాస్తులు మొదలు
- పరీక్షల తేదీలు, ఇతర అంశాలపై కొన్నిరోజుల్లో స్పష్టత
- టీఎస్‌పీఎస్సీ మాదిరిగా గురుకుల బోర్డు వెబ్‌సైట్‌లో వన్‌టైమ్ రిజిస్ట్రేషన్
- ఓటీఆర్ ప్రక్రియ పూర్తి చేశాకే దరఖాస్తు చేసుకోవడానికి చాన్స్
- మరో 2 వేలకుపైగా ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్లు
- సాంకేతిక పోస్టులు కావడంతో సర్వీసు నిబంధనల ఖరారు తర్వాతే భర్తీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో ఉద్యోగాల భర్తీకి ప్రకటన వెలువడింది. వివిధ కేటగిరీల్లో ఏకంగా 9,231 ఉద్యోగాల భర్తీకోసం తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు (టీఆర్‌ఈఐఆర్‌బీ) ఏకకాలంలో తొమ్మిది నోటిఫికేషన్లను జారీచేసింది. కేటగిరీల వారీగా పోస్టుల వివరాలను టీఆర్‌ఈఐఆర్‌బీ వెబ్‌సైట్ (http://treirb.telangana.gov.in)లో అందుబాటులో ఉంచింది. ఆయా పోస్టులకు సంబంధించిన పూర్తిస్థాయి నోటిఫికేషన్లను ప్రకటనలో నిర్దేశించిన తేదీల్లో విడుదల చేస్తామని బోర్డు కన్వీనర్ మల్లయ్య భట్టు తెలిపారు. దాదాపు ఏడాదిపాటు కసరత్తు చేసిన టీఆర్‌ఈఐఆర్‌బీ.. ఎట్టకేలకు మిగతా 2వ పేజీలో ▶

	పోస్టు/కేటగిరీ	ఖాళీలు
1	లెక్చరర్/ఫిజికల్ డైరెక్టర్/ లైబ్రేరియన్ (డిగ్రీ కాలేజీ)	868
2	జూనియర్ లెక్చరర్/ఫిజికల్ డైరెక్టర్/ లైబ్రేరియన్ (జూనియర్ కాలేజీ)	2,008
3	పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ)	1,276
4	లైబ్రేరియన్ (స్కూల్)	434
5	ఫిజికల్ డైరెక్టర్ (స్కూల్)	275
6	డ్రాయింగ్ టీచర్/ఆర్ట్ టీచర్	134
7	క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్/క్రాఫ్ట్ టీచర్	92
8	మ్యూజిక్ టీచర్	124
9	ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్	4,020

సంజయ్‌కు బెయిల్

షరతులతో మంజూరు చేసిన హనుమకొండ కోర్టు

- మధ్యాహ్నం నుంచి సుదీర్ఘంగా వాదనలు
- మధ్యలో విచారణ వాయిదాలతో ఉత్కంఠ
- రాత్రి 10 గంటలకు వెలువడిన తీర్పు
- నేటి ఉదయం కరీంనగర్ జైలు నుంచి విడుదల కానున్న రాష్ట్ర బీజేపీ చీఫ్
- పోలీసుల కస్టడీ పిటిషన్ సోమవారానికి వాయిదా



సాక్షి ప్రతినిధి, వరంగల్/ వరంగల్ లీగల్: పదో తరగతి ప్రశ్నపత్రం లీక్ కేసులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కు హనుమకొండ నాలుగో మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు గురువారం రాత్రి బెయిల్ మంజూరు చేసింది. కమలాపూర్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి హిందీ పరీక్ష పత్రం లీక్, కాపీ కుట్ర కేసులో పోలీసులు బుధవారం బండి సంజయ్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే. ఈ కేసులో సంజయ్ తరఫు న్యాయవాదులు వేసిన బెయిల్ పిటిషన్‌పై గురువారం సుదీర్ఘంగా విచారణ సాగింది. పలుమార్లు వాయిదాలతో.. సుమారు 8 గంటల పాటు జరిగిన వాదోపవాదాల అనంతరం రాత్రి 10 గంటల సమయంలో జడ్జి రాపోలు అనిత తీర్పు ఇచ్చారు. రూ.20 వేల చొప్పున ఇద్దరు జమానతుదారుల పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేశారు. దేశం విడిచి వెళ్లకూడదని, కేసు విచారణ మిగతా 11వ పేజీలో ▶

ఈటలకు నోటీసులు 12లో

విద్యార్థుల జీవితాలతో సర్కారు చెలగాటం 11లో

- గతంలో ఇంటర్.. ఇప్పుడు టెన్త్ విద్యార్థుల వంతు..
- జైలు నుంచి కార్యకర్తలకు బండి బహిరంగ లేఖ
- ప్రధాని సభను విజయవంతం చేయాలని పిలుపు





అరుణ్‌పిళ్లైకి రూ. 15 కోట్లు ఇచ్చా

కేజ్రీవాల్‌కు సుఖేశ్ చంద్రశేఖర్ లేఖ



- హైదరాబాద్‌లోని బీఆర్‌ఎస్ ఆఫీస్‌లో డబ్బులు ఇచ్చా
- ఎమ్మెల్సీ స్టిక్కర్ ఉన్న కారులో నోట్ల పెట్టెలు పెట్టా
- మీ ఆదేశాల మేరకు ఇచ్చానన్న వివరాలు చాట్ రూపంలో ఉన్నాయి

సాక్షి, న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో జైల్లో ఉన్న సుఖేశ్ చంద్రశేఖర్ మరో సంచలన లేఖ విడుదల చేశారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఢిల్లీ మాజీ మంత్రి సత్యేంద్ర జైన్‌ల ఆదేశం మేరకు హైదరాబాద్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో రూ.15 కోట్లు ఇచ్చానని అందులో పేర్కొన్నారు. తాను డబ్బులు ఇచ్చింది ఏపీ అలియాస్ అరుణ్‌పిళ్లైకి అని స్పష్టం చేశారు. సొమ్ము అందినట్లుగా బీఆర్‌ఎస్ నేత చేసిన మెసేజ్‌లకు సంబంధించిన పలు స్క్రీన్ షాట్లు తన దగ్గర ఉన్నాయని పేర్కొన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాం మిగతా 11వ పేజీలో ▶

మోదీ సభలో కేసీఆర్‌కు 7 నిమిషాలు!

- రెండు గంటల్లోనే ముగియనున్న ప్రధాని రాష్ట్ర పర్యటన.. ఉదయం 11.30కి రాక.. నేరుగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు..
- అనంతరం 12.15కు పరేడ్ గ్రౌండ్స్ సభకు..
- ప్రొటోకాల్ మేరకు సీఎం కేసీఆర్‌కు ఆహ్వానం.. షెడ్యూల్‌లో చేర్పు.. కేసీఆర్ హాజరవుతారా, లేదా అనే దానిపై ఉత్కంఠ

2లో

సింగరేణి ప్రైవేటీకరణపై బీఆర్‌ఎస్ యుద్ధభేరి

- మోదీ పర్యటన నేపథ్యంలో 8న మహాధర్నాలు
- సింగరేణి పరిధిలోని పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో కేటీఆర్

పలుచోట్ల తేలికపాటి వానలు

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక పరిసర ప్రాంతాల మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనంసముద్ర మట్టం నుంచి 1.5 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. దీని ప్రభావంతో గురువారం రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి వర్షాలు, కొన్నిచోట్ల వడగండ్ల వానలు కురిశాయని వాతావరణ శాఖ వివరించింది. రాష్ట్రంలో రా నున్న రెండ్రోజులు అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. కొన్నిచోట్ల ఈదురుగాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో కూడిన వర్షాలు కురుస్తాయని వివరించింది.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	41.8	22.8
కర్నూలు	40.5	28.3
ఆదిలాబాద్	40.0	23.5
భద్రాచలం	38.0	26.5
హకీంపేట్	36.0	24.4
దుండిగల్	35.6	23.3
హనుమకొండ	35.5	24.0
హైదరాబాద్	35.5	24.2
ఖమ్మం	37.0	25.6
మహబూబ్‌నగర్	38.8	27.1
మెదక్	37.3	21.3
నల్లగొండ	38.0	21.4
నిజామాబాద్	39.6	25.5
రామగుండం	37.2	25.3
నెల్లూరు	37.0	26.5
విజయవాడ	37.0	26.0

క్లుప్తంగా...

ఏసు త్యాగాలను స్మరిస్తూ..

గవర్నర్ తమిళిసై



సాక్షి, హైదరాబాద్: ఏసుక్రీస్తుకు శిలువ వేయడాన్ని స్మరిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటారని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. ఏసుక్రీస్తు మానవులందరి పట్ల అపార ప్రేమను చూపారని, వారి సంక్షేమం కోసం ప్రాణత్యాగం చేశారని గుర్తు చేసుకున్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఏసుక్రీస్తు త్యాగాలను స్మరించుకుంటూ కృతజ్ఞతా ప్రార్థనలు చేస్తారని పేర్కొన్నారు.

కరుణామయుడు ఏసుక్రీస్తు

గుడ్‌ఫ్రైడే సందేశంలో సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: 'గుడ్ ఫ్రైడే'ను పురస్కరించుకుని ప్రజలకోసం ఏసుక్రీస్తు చేసిన త్యాగాలను సీఎం కె.చంద్రశేఖర్‌రావు స్మరించుకున్నారు. శిలువ మీద తన దేహానికి శీలలు కొడుతున్న వారిని కూడా క్షమించుమని భగవంతుడిని వేడుకున్న మహోన్నత క్షమాగుణ సంపన్నుడు ఏసుక్రీస్తు అని కొనియాడారు. గుడ్‌ఫ్రైడే క్రైస్తవులకు పరమ పవిత్రమైన రోజని అన్నారు. సమస్త మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల జాలి, శత్రువుల పట్ల క్షమాగుణం అనే గొప్ప లక్షణాలను కలిగివుండటం ఏసుక్రీస్తుకే సాధ్యమైందన్నారు.

జీసస్ మహా త్యాగమే గుడ్ ఫ్రైడే సందేశం

ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: మానవాళి కోసం జీసస్ చేసిన మహాత్యాగమే గుడ్ ఫ్రై డే సందేశం అని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 'కరుణామయుడైన ఏసు ప్రభువు జీవితమే త్యాగానికి చిహ్నం. ఆ ప్రభువును శిలువ వేసిన గుడ్ ఫ్రైడే రోజు, ఆ తర్వాత ఆయన పునరుత్థానం పొందిన ఈస్టర్ సండే రోజు... ఈ రెండూ మానవాళి చరిత్రను మలుపులు తిప్పిన ఘట్టాలు'అని అన్నారు. మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం.. ఇవన్నీ తన జీవితం, బోధనల ద్వారా జీసస్ లోకానికి ఇచ్చిన సందేశాలు అని సీఎం జగన్ తెలియజేశారు.



తొందరపడకండీ... ఈ వయస్సులో పార్టీ మారినా.. చేసేదేమీలేక అక్కడా ఇలా కూర్చోవాల్సిందే!!

పర్యావరణమే ప్రాణం!

ఉద్యోగాన్ని వదిలేసి, కుటుంబాన్ని పక్కనబెట్టి నల్లగొండ వాసి కృషి

- ఉదయం నిద్ర లేచింది మొదలు పర్యావరణ పరిరక్షణే ధ్యేయం
- భూగర్భ జలాలు పెంపొందించేందుకు ఇంకుడు గుంతల తవ్వకం
- చేనేత, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సురేశ్‌గుప్తా

పర్యావరణ పరిరక్షణ కోసం నల్లగొండ పట్టణానికి చెందిన మిట్టపల్లి సురేశ్ గుప్తా విశేష కృషి చేస్తున్నారు. ఉద్యోగాన్ని వదిలేసి, కుటుంబాన్ని పక్కన పెట్టి పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రతి క్షణం పని చేస్తున్నారు. ఉదయం 5 గంటలకు లేచి, మార్కెట్‌కు వెళ్లి, అక్కడ ప్లాస్టిక్ కవర్లతో ఎవరు ఎదురుపడినా, వారికి ఓ జూట్ బ్యాగ్/క్లాత్ సంచి ఇవ్వడంతో ఆయన దిన చర్య ప్రారంభం అవుతుంది. ఇక పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే వారిని శాలువాతో సత్కరించడం ఆయన ప్రత్యేకత. అంతేకాదు భూగర్భ జలాల పెంపునకు సొంతంగా ఇంకుడు గుంతలు తవ్వించడం, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, చేనేత వస్త్రాల వినియోగంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా గుప్తా పని చేస్తున్నారు. తాను కూడా చేనేత బనియన్, దోవతి ధరించడం ప్రారంభించారు. ఇవన్నీ చేస్తున్న ఆయనేం కోటీశ్వరుడు కాదు. ఉద్యోగాలు చేయగా వచ్చిన డబ్బునంతా లక్ష్యం కోసమే ఖర్చు చేశారు. ప్రస్తుతం కుటుంబ బాధ్యతలను భార్యకు అప్పగించి.. దాతలను వెతికి, సమయానికి దొరక్కపోతే అప్పు చేసి మరీ తన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. - సాక్షి ప్రతినిధి, నల్లగొండ

మలుపు తిప్పిన సంఘటన

2008లో ఒక ఆవు చెత్త కుప్పలో వేసిన ఆహార పదార్థాలతో పాటు ప్లాస్టిక్ కవర్లను తినడం గుప్తా చూశారు. ఆ ఆవుకు ఆపరేషన్ చేసినప్పుడు కడుపు నిండా ప్లాస్టిక్ కవర్లు ఉండటం చూసి చలించిపోయారు. ప్లాస్టిక్ వల్ల జీవరాశికి ప్రమాదం పొంచి ఉందని అప్పుడే గ్రహించారు. దాని వాడకాన్ని తాను నిషేధించలేను కాబట్టి కనీసం వినియోగాన్ని అయినా తగ్గించేందుకు తనవంతు కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. నాటి నుంచి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలంటూ ఎక్కడ ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాలు జరిగినా, పండుగలు జరిగినా అక్కడికి వెళ్లి ప్లాస్టిక్‌ను వాడొద్దని ప్రచారం చేయడం ప్రారంభించారు.



నల్లగొండలో జరిగిన పర్యావరణ ర్యాలీలో సురేష్‌గుప్తా (ఫైల్)



ప్లేటు, గ్లాసు సంచిలోనే..

ఎక్కువ ప్రాంతాల్లో తిరుగుతూ పర్యావరణంపై ప్రచారం చేసేందుకు మోటారు సైకిల్ వాడక తప్పడం లేదు. అది వెలువరించే పొగతో వాతావరణం కలుషితం అవుతోంది. అందుకే నాకు నేనే శిక్ష వేసుకున్నా. చెప్పులు లేకుండా తిరగాలని నిర్ణయించుకున్నా. ఇక నేను తినే ప్లేటు, నా గ్లాసు నా సంచిలోనే ఉంటుంది. ఎక్కడికి వెళ్లినా నా ప్లేట్‌లోనే భోజనం చేస్తా. పర్యావరణ పరిరక్షణ కోసం జీవితాంతం పని చేస్తా.

- మిట్టపల్లి సురేశ్ గుప్తా

షాక్ తగిలినా..కోలుకుని..

సురేశ్ గుప్తా తన కుటుంబ బాధ్యతను పూర్తిగా గెస్ట్ లెక్చరర్‌గా పనిచేసే తన భార్య కల్పనపైనే మోపారు. ఆ విధంగా దొరుకుతున్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. పర్యావరణ సంబంధిత కార్యక్రమాలు ఎక్కడ జరిగినా, తనకు ఆహ్వానం లేకపోయినా అక్కడికి వెళ్లిపోయేంత ప్రేమికుడిగా మారిపోయారు. అయితే 2018 మే 22వ తేదీన రోజున జరిగిన ఓ సంఘటన తన కుటుంబాన్ని విషాదంలో ముంచెత్తుతుందని ఆయన ఊహించలేదు. వార్షిక పరీక్షల చివరి రోజు కావడంతో ఇంజనీరింగ్ చదువుతున్న పెద్ద కుమారుడు ప్రణీత్‌ను తీసుకువచ్చేందుకు హైదరాబాద్‌కు బయలుదేరిన గుప్తా.. అతని వద్దకు వెళ్లకుండా స్థానికంగా వరల్డ్ ఎర్త్ డే కార్యక్రమం వద్దే ఆగిపోయారు. అదే సమయంలో కొడుక్కి యాక్సిడెంట్ అయిందని, చనిపోయాడని ఫోన్ వచ్చింది. ఆ షాక్ నుంచి కోలుకోవడానికి గుప్తాతో పాటు కుటుంబానికి చాలా రోజులు పట్టింది.

ఉద్యోగాన్ని వదిలేసి..

1999లో నల్లగొండలో ఇంటర్నెట్ సెంటర్ నడుపుతున్న సురేశ్ గుప్తా వద్దకు ఏపీఆర్ఎల్‌పీ ప్రాజెక్టు ఉద్యోగులు వస్తుండేవారు. తర్వాత తమ ప్రాజెక్టులో పని చేసేవారు కావాలని వారు గుప్తాను తీసుకున్నారు. కొన్ని రోజుల అనంతరం హైదరాబాద్‌కు రావాలని చెప్పడంతో ఆ ఉద్యోగానికి రాజీనామా చేశారు. తర్వాత నల్లగొండలోనే ఒకటి రెండు ఉద్యోగాలతో పాటు 2013 నుంచి 2017 వరకునల్లగొండ సుధా బ్యాంకు మేనేజర్‌గా పని చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం పని చేస్తూనే ఈ ఉద్యోగాలన్నీ చేశారు. అయితే తాను చేస్తున్నది సరిపోదని, ఈ దిశగా మరింత కృషి చేయాలనే ఉద్దేశంతో బ్యాంకు ఉద్యోగాన్ని వదిలేసి, పూర్తిగా పర్యావరణ పరిరక్షణకే జీవితాన్ని అంకితం చేశారు.

నీటి పరిరక్షణపైనా శ్రద్ధ

ఓసారి ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయన.. వర్షపు నీరు వృథాగా పోతుండటాన్ని గమనించి సొంత డబ్బులతో ఇంకుడు గుంతలను తవ్వించారు. భవిష్యత్ అవసరాలకు నీటిని పరిరక్షించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంతేకాదు జీవనోపాధి కరువైన చేనేత కార్మికులను ఆదుకోవాలని, చేనేత వస్త్రాల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలనే లక్ష్యంతో పని చేయడం ప్రారంభించారు. ఇందుకు తానే ఓ బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు. మరోవైపు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారు.



కేటీఆర్‌కు జ్యూట్ బ్యాగు అందజేస్తున్న సురేష్‌గుప్తా (ఫైల్)

మోదీ సభలో కేసీఆర్‌కు 7 నిమిషాలు!

- రెండు గంటల్లోనే ముగియనున్న ప్రధాని రాష్ట్ర పర్యటన
- ఉదయం 11.30కు రాక.. నేరుగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు..
- ప్రొటోకాల్ మేరకు సీఎం కేసీఆర్‌కు ఆహ్వానం.. షెడ్యూల్‌లో చేర్పు
- 12.30 నుంచి ఏడు నిమిషాల పాటు సీఎం ప్రసంగం
- కేసీఆర్ హాజరవుతారా, లేదా అనే దానిపై ఉత్కంఠ

సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు సంబంధించి సీఎం కేసీఆర్‌కు ఆహ్వానం అందింది. ప్రధాని పాల్గొననున్నవి కేంద్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు కావడంతో ప్రొటోకాల్ ప్రకారం సీఎం, ఇతర ప్రముఖులకు హోదాల ప్రకారం ఆహ్వానించారు. ఈ మేరకు షెడ్యూల్‌లోనూ చేర్చారు. ఇందులోభాగంగా సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొనే బహిరంగసభలో సీఎం కేసీఆర్ ప్రసంగం కోసం ఏడు నిమిషాలు కేటాయించారు. ఇక ప్రధాని రాష్ట్ర పర్యటన కేవలం రెండు గంటల్లోనే ముగియనుంది. శనివారం ఉదయం 11.30కు హైదరాబాద్‌కు చేరుకోనున్న మోదీ.. 1.30 గంటల సమయంలో ఢిల్లీకి తిరుగు ప్రయాణం కానున్నారు.

కేసీఆర్ హాజరవుతారా?

కొంతకాలం నుంచి ప్రధాని మోదీ పాల్గొంటున్న ఏ ప్రభుత్వ, ఇతర కార్యక్రమాల్లోనూ సీఎం కేసీఆర్ పాల్గొనలేదు. ఇంతకుముందు పలుమార్లు మోదీ హైదరాబాద్ పర్యటనకు వచ్చినా.. స్వాగతం పలకడానికి సీఎం వెళ్లలేదు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులనే పంపారు. అయితే ఈ నెల 8న పరేడ్‌గ్రౌండ్స్ సభలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, భూమిపూజ, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. దీనికి సంబంధించి అధికారికంగా షెడ్యూల్ విడుదల చేశారు. ఇందులో పరేడ్‌గ్రౌండ్స్ సభలో కేసీఆర్ ప్రసంగానికి ఏడు నిమిషాల సమయాన్ని కేటాయించారు. ఇది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రధాని కార్యక్రమంలో సీఎం కేసీఆర్ పాల్గొంటారా? లేక గతంలో లాగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఓ మంత్రిని ప్రతినిధిగా పంపుతారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

శనివారం మోదీ షెడ్యూల్ ఇదీ..

- ఉదయం 11.30 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేటకు రాక
- 11.45కు రోడ్డు మార్గాన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు ప్రధాని..
- 11.45 నుంచి 12 గంటల దాకా అక్కడే కార్యక్రమాలు. సికింద్రాబాద్–తిరుపతి మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం
- మధ్యాహ్నం 12.15 గంటలకు పరేడ్‌గ్రౌండ్స్‌కు చేరుకోనున్న మోదీ
- 12.20 నుంచి 12.30 గంటల వరకు కేంద్ర రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్, కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి ప్రసంగాలు
- 12.30 నుంచి 12.37 గంటల దాకా సీఎం కేసీఆర్ ప్రసంగం
- 12.37 నుంచి 12.50 గంటల వరకు ఎంఎంటీఎస్ ఫేజ్–2తోపాటు పలు రైల్వే, రోడ్డు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- మధ్యాహ్నం 12.50 నుంచి 1.20 వరకు ప్రధాని మోదీ ప్రసంగం
- 1.30 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని ఢిల్లీకి తిరుగుప్రయాణం కానున్న ప్రధాని.

ఎయిమ్స్ వసతులతో తెలంగాణకు లబ్ధి: ప్రధాని



సాక్షి, న్యూఢిల్లీ: బీబీనగర్‌లోని ఎయిమ్స్‌లో మౌలిక సదుపాయాలు పెంపొందించడం వల్ల తెలంగాణకు ప్రయోజనం చేకూరుతుందని, ఆరోగ్యవంతమైన భారతదేశాన్ని సృష్టించే ప్రయత్నాలకు మరింత ఊపునిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ నెల 8న బీబీనగర్ ఎయిమ్స్‌లో నూతన అత్యాధునిక సౌకర్యాలకు ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మాన్సుఖ్ మాండవీయా చేసిన ట్వీట్‌కు.. ప్రధాని మోదీ గురువారం ఈ మేరకు రీట్వీట్ చేశారు.

సింగరేణి ప్రైవేటీకరణపై బీఆర్ఎస్ యుద్ధభేరి

- ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో 8న మహాధర్నాలు
- మంచిర్యాల, భూపాలపల్లి, కొత్తగూడెం, రామగుండం కేంద్రాల్లో నిరసన
- సింగరేణి పరిధిలోని పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: సింగరేణి పరిధిలోని బొగ్గు గనులను వేలం వేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 8న 'మహాధర్నా' నిర్వహించాలని అధికార బీఆర్ఎస్ నిర్ణయించింది. మంచిర్యాల, భూపాలపల్లి, పెద్దపల్లి, రామగుండం, కొత్తగూడెం నియోజకవర్గ కేంద్రాల్లో ఈ మహధర్నాలు నిర్వహించనుంది. ప్రధాని మోదీ ఈ నెల 8న హైదరాబాద్ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో సింగరేణి కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు పిలుపునిచ్చారు. సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటీకరించబోమంటూ గతంలో ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం యూటర్న్ తీసుకోవడంపై నిరసన తెలుపుతూ ప్రజాక్షేత్రంలో బీజేపీకి గుణపాఠం చెప్పేందుకే మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మహాధర్నాకు సంబంధించి సింగరేణి పరిధిలోని జిల్లాల బీఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో గురువారం కేటీఆర్ ప్రత్యేకంగా మాట్లాడారు. 'సింగరేణిని ప్రైవేటీకరించబోమని 2022 నవంబర్ 12న రామగుండంలో ప్రకటించిన ప్రధాని మోదీ మాట తప్పారు. వేలంతో సంబంధం లేకుండా సింగరేణికి బొగ్గు గనులు కేటాయించాలని అటు కార్మికులు, ఇటు తెలంగాణ ప్రజలు ముక్తకంఠంతో కోరినా పట్టించుకోవట్లేదు. తాజాగా సత్తుపల్లి బ్లాక్ 3, శ్రావణపల్లి, పెనగడప గనుల వేలం కోసం కేంద్రం మరోమారు నోటిఫికేషన్ ఇచ్చింది. మార్చి 29 నుంచి మే 30 వరకు ఈ గనులకు వేలం ప్రక్రియ నిర్వహించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి'అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

ప్రైవేటీకరణ కుట్రలపై జంగ్ సైరన్

'తెలంగాణను దెబ్బకొట్టాలనే దురుద్దేశంతో కేంద్రం చేస్తున్న కుట్రలను వ్యతిరేకిస్తూ సింగరేణికి అవసరమైన బొగ్గు గనులను నేరుగా కేటాయించాలని సీఎం కేసీఆర్ గతంలో కేంద్రానికి లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్ స్టీల్ ప్లాంటుకు కూడా గనులు కేటాయించకుండా కేంద్రం దివాలా తీయించింది. అదే విషప్రయోగాన్ని ఇక్కడ అమలు చేయాలని చూస్తే అడ్డుకొని తీరుతాం. గుజరాత్ ఖనిజాభివృద్ధి సంస్థకు నామినేషన్ పద్ధతిలో లిగ్నైట్ గనులను కేటాయించిన రీతిలోనే సింగరేణికి గనులు కేటాయించాలి. సింగరేణి సంక్షోభంలోకి వెళ్తే దక్షిణాది థర్మల్ విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థ కుప్పకూలుతుంది. సింగరేణి ప్రైవేటీకరణ కేవలం 6 జిల్లాల సమస్య కాదు. తెలంగాణ ఆర్థిక ప్రగతిని దెబ్బతీసే కుట్రలో భాగంగానే జరుగుతోంది. సింగరేణి ప్రైవేటీకరణతో తెలంగాణలో అంధకారంతో పాటు కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతారు. వారసత్వ ఉద్యోగాలు, ఉద్యోగ భద్రత, నియామకాల్లో రిజర్వేషన్లు, ఉద్యోగుల బోనస్‌లు, అలవెన్సులు, ఇతర సంక్షేమ కార్యక్రమాలు పూర్తిగా రద్దవుతాయి. ఈ నేపథ్యంలోనే ఈ నెల 8న ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో జంగ్ సైరన్ పూరించాం'అని కేటీఆర్ తెలిపారు.



10న వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కార్మికులతో ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడు భేటీ

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపైనా పోరాటానికి బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. స్టీల్ ప్లాంటును కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందంటూ ఈ నెల 2న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాసిన నేపథ్యంలో బీఆర్ఎస్ ఏపీ శాఖ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ ఈ నెల 10న వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులతో భేటీ కానున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

గురుకుల కొలువులు 9,231

▶ మొదటి పేజీ తరువాయి

ప్రకటన జారీచేయడంతో అభ్యర్థుల్లో ఆశలు చిగురించాయి. తెలంగాణ ఏర్పాటు తర్వాత గురుకులాల్లో పెద్ద సంఖ్యలో పోస్టుల భర్తీ చేపట్టడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

నెల రోజుల గడువుతో..

గురుకుల బోర్డు జారీచేసిన నోటిఫికేషన్లు ఇప్పటికే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. పోస్టుల వారీగా దరఖాస్తుల తేదీ ప్రారంభం, ముగింపు, పూర్తిస్థాయి నోటిఫికేషన్ ఎప్పుడు పెడతారన్న వివరాలను వాటిలో వెల్లడించారు. కొన్నిరకాల పోస్టులకు ఈనెల 17వ తేదీ నుంచి దరఖాస్తులు ప్రారంభం కానుండగా.. మరికొన్నింటికి ఈ నెల 24న, 28న మొదలుకానున్నాయి. అన్ని కేటగిరీల పోస్టులకు దరఖాస్తులు మొదలైన నాటి నుంచి నెలరోజుల పాటు గడువు ఉంటుంది. దాదాపు అన్ని పోస్టులకు మే నెలలో దరఖాస్తుల ప్రక్రియ ముగియనుంది. గడువు ముగిశాక నెలన్నర నుంచి రెండు నెలల పాటు సన్నద్ధతకు అవకాశం ఉంటుందని.. తర్వాత అందుబాటులో ఉన్న తేదీల్లో పరీక్షలను నిర్వహించే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి. రాష్ట్రస్థాయిలో ఇతర నియామక బోర్డులతో సమన్వయం చేసుకోవడంతోపాటు కేంద్ర ప్రభుత్వ సంస్థలు నిర్వహించే పరీక్షల షెడ్యూల్‌లను పూర్తిగా పరిశీలించి.. ఇబ్బందిలేని రోజుల్లో పరీక్షల నిర్వహణను ఖరారు చేయనున్నట్టు వెల్లడించాయి.

సైలెంట్‌గా ప్రకటన విడుదల

గురుకుల పోస్టుల భర్తీ నోటిఫికేషన్లను టీఆర్ఈఐఆర్‌బీ గుట్టుచప్పుడు కాకుండా విడుదల చేయడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. సాధారణంగా ఉద్యోగ నియామక ప్రకటనలను సదరు నియామక సంస్థ విడుదల చేయడం, మీడియా సమావేశం పెట్టి వెల్లడించడం జరుగుతుంది. గతంలో గురుకుల నియామకాల బోర్డు ఏర్పాటు చేసిన సమయంలో అప్పటి బోర్డు చైర్మన్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి ఉద్యోగ ప్రకటనలు విడుదల చేశారు. కానీ ఇప్పుడు భారీగా గురుకుల ఉద్యోగాల భర్తీ చేపడుతున్నా.. కేవలం ఒకట్రెండు పత్రికల్లో యాడ్ (అడ్వర్టైజ్‌మెంట్) రూపంలో ఇవ్వడం గమనార్హం.

త్వరలో మరిన్ని నోటిఫికేషన్లు

గురుకుల విద్యాసంస్థల్లో దాదాపు 12వేల ఉద్యోగాలకు రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందులో 9వేల ఉద్యోగాల భర్తీకి గతేడాది జూన్‌లోనే అనుమతులు వచ్చాయి. 2022–23 విద్యా సంవత్సరంలో బీసీ గురుకుల సొసైటీ పరిధిలో మరిన్ని విద్యాసంస్థలు తెరవడంతో.. వాటిలోని పోస్టులను కూడా ఒకేదఫాలో భర్తీ చేయాలనే ఉద్దేశంతో నోటిఫికేషన్ల జారీ కోసం బోర్డు వేచిచూసింది. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రభుత్వం మరో 2,225 పోస్టుల భర్తీకి అనుమతులు ఇచ్చింది. అయితే తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్లలో 9వేలకుపైగా ఉద్యోగాలనే ప్రకటించారు. మిగతా కొలువులకు సంబంధించి త్వరలో మరిన్ని నోటిఫికేషన్లు విడుదల చేసే అవకాశం ఉందని తెలిసింది. ప్రధానంగా వ్యవసాయ డిగ్రీ కళాశాలలు, ఫ్యాషన్ టెక్నాలజీ కాలేజీలు, ఇతర సాంకేతిక కాలేజీల్లో పోస్టులు మంజూరైనా.. వాటికి సంబంధించిన సర్వీసు నిబంధనలు ఖరారు కాలేదు. దీనిపై స్పష్టత రాగానే ఉద్యోగ ప్రకటనలు రానున్నట్టు అధికార వర్గాలు చెప్తున్నాయి.

ఓటీఆర్ ఉంటేనే దరఖాస్తు

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) మాదిరిగానే గురుకుల నియామకాల బోర్డు కూడా ఓటీఆర్ (వన్‌టైమ్ రిజిస్ట్రేషన్) విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని నిర్ణయించింది. ఐదేళ్ల క్రితం కేవలం డిగ్రీ లెక్చరర్ కేటగిరీకి మాత్రమే ఓటీఆర్‌ను అనుసరించగా.. ఇప్పుడు ప్రతి దరఖాస్తుకు ఓటీఆర్ తప్పనిసరి చేసినట్టు నోటిఫికేషన్‌లో ప్రకటించింది. ఓటీఆర్ ప్రక్రియ ఈనెల 12వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. అభ్యర్థులు ముందుగా ఓటీఆర్ ప్రక్రియ పూర్తి చేసుకున్నాకే గురుకుల ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలో కొత్తగా అమల్లోకి వచ్చిన జోనల్ విధానానికి అనుగుణంగా ఓటీఆర్ ఆప్షన్లను సిద్ధం చేశారు. ప్రతి అభ్యర్థి విద్యార్హతలు, బోనఫైడ్‌లు, కుల ధ్రువీకరణ వంటి సర్టిఫికెట్లన్నీ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఓటీఆర్ ప్రక్రియతో వెబ్‌సైట్‌పై తీవ్ర ఒత్తిడి పడేఅవకాశం ఉండడంతో.. దరఖాస్తులకు ఐదు రోజుల ముందుగానే ప్రారంభించినట్టు అధికార వర్గాలు చెప్తున్నాయి. గురుకుల కొలువుల దరఖాస్తు ఫీజు గతంలో రూ.600గా ఉండేది. ఇప్పుడు కూడా అంతేస్థాయిలో ఫీజు నిర్ధారించే అవకాశం ఉందని అంటున్నారు.

గురుకుల డిగ్రీ కాలేజీల్లో సొసైటీల వారీగా పోస్టులివీ..

సబ్జెక్టు	ఎస్సీ	ఎస్టీ	బీసీ	మొత్తం
తెలుగు	7	24	24	55
ఇంగ్లిష్	18	25	26	69
మేథమెటిక్స్	11	15	36	62
స్టాటిస్టిక్స్	29	4	25	58
ఫిజిక్స్	5	21	20	46
కెమిస్ట్రీ	8	33	28	69
బోటనీ	7	18	13	38
జువాలజీ	19	23	16	58
కంప్యూటర్ సైన్స్	11	39	49	99
జియాలజీ	0	0	6	6
బయోకెమిస్ట్రీ	0	0	3	3
బయోటెక్నాలజీ	0	0	2	2
హిస్టరీ	5	9	14	28
ఎకనామిక్స్	2	7	16	25
పొలిటికల్ సైన్స్	7	6	14	27
కామర్స్	22	17	54	93
జర్నలిజం	1	1	0	2
సైకాలజీ	1	0	5	6
మైక్రోబయాలజీ	0	11	6	17
పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్	0	1	8	9
సోషియాలజీ	0	0	7	7
బిజినెస్ అడ్మినిస్ట్రేషన్	0	3	11	14
ఫిజికల్ డైరెక్టర్	12	15	12	39
లైబ్రేరియన్	09	15	12	36
మొత్తం	174	287	407	868

సొసైటీల వారీగా గురుకుల జూనియర్ కాలేజీల్లో పోస్టులివీ..

సబ్జెక్టు	ఎస్సీ	ఎస్టీ	బీసీ	మైనార్టీ	మొత్తం
తెలుగు	38	25	104	58	225
హిందీ	0	0	20	0	20
ఉర్దూ	0	0	0	50	50
ఇంగ్లిష్	40	26	111	53	230
మేథమెటిక్స్	36	28	216	44	324
ఫిజిక్స్	34	27	110	34	205
కెమిస్ట్రీ	35	28	109	35	207
బోటనీ	35	29	107	33	204
జువాలజీ	35	23	108	33	199
హిస్టరీ	0	5	2	0	7
ఎకనామిక్స్	0	12	51	19	82
కామర్స్	0	14	54	19	87
సివిక్స్	0	15	53	16	84
ఫిజికల్ డైరెక్టర్	0	11	23	0	34
లైబ్రేరియన్	0	48	02	0	50
మొత్తం	253	291	1,070	394	2,008

గురుకుల సొసైటీల వారీగా పీజీటీ ఖాళీలు

సబ్జెక్టు	ఎస్సీ	ఎస్టీ	బీసీ	మొత్తం
తెలుగు	57	20	106	183
హిందీ	0	10	158	168
ఇంగ్లిష్	66	24	99	189
మేథమెటిక్స్	99	34	98	231
ఫిజికల్ సైన్స్	19	19	104	142
బయో సైన్స్	22	21	118	161
సోషల్ స్టడీస్	80	19	103	202
మొత్తం	343	147	786	1,276

గురుకుల సొసైటీల వారీగా టీజీటీ ఖాళీలు

సబ్జెక్టు	ఎస్సీ	ఎస్టీ	బీసీ	మైనార్టీ	జనరల్	మహిళాశిశు	మొత్తం
తెలుగు	98	28	285	55	22	4	488
సంస్కృతం	0	0	0	0	25	0	25
ఉర్దూ	0	0	0	120	0	0	120
హిందీ	65	39	263	147	2	0	516
ఇంగ్లిష్	85	19	506	55	16	0	681
మేథమెటిక్స్	101	29	520	86	5	2	741
ఫిజికల్ సైన్స్	147	15	269	0	0	2	431
బయోసైన్స్	45	21	261	0	0	3	327
జనరల్ సైన్స్	0	20	0	76	2	0	98
సోషల్ స్టడీస్	187	47	275	55	15	3	579
మొత్తం	728	218	2,379	594	87	14	4,020

సొసైటీల వారీగా స్కూళ్లలో లైబ్రేరియన్ పోస్టులు

సొసైటీ	పోస్టులు
ఎస్సీ	54
బీసీ	180
మైనారిటీ	200
మొత్తం	434

సొసైటీ స్కూళ్ల వారీగా ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు

సొసైటీ	పోస్టులు
ఎస్సీ	57
ఎస్టీ	38
బీసీ	120
మైనారిటీ	60
మొత్తం	275



సొసైటీల వారీగా ఆర్ట్/డ్రాయింగ్ టీచర్ పోస్టులు

సొసైటీ	పోస్టు	ఖాళీలు
ఎస్సీ	ఆర్ట్ టీచర్	16
ఎస్టీ	ఆర్ట్ టీచర్	6
బీసీ	ఆర్ట్ టీచర్	72
మైనారిటీ	ఆర్ట్ టీచర్	38
డిజేబుల్డ్ వెల్ఫేర్	డ్రాయింగ్ టీచర్	2
మొత్తం	-	134

సొసైటీల వారీగా క్రాఫ్ట్ టీచర్ / క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు

సొసైటీ	పోస్టు	ఖాళీలు
ఎస్టీ	క్రాఫ్ట్ టీచర్	24
బీసీ	క్రాఫ్ట్ టీచర్	60
జనరల్	క్రాఫ్ట్ టీచర్	4
డిజేబుల్డ్ వెల్ఫేర్	క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్	4
మొత్తం	-	92

సొసైటీల వారీగా మ్యూజిక్ టీచర్ పోస్టులు

సొసైటీ	పోస్టులు
ఎస్సీ	46
ఎస్టీ	20
బీసీ	55
జనరల్	2
డిజేబుల్డ్ వెల్ఫేర్	1
మొత్తం	124



కోటి దాటిన కంటి పరీక్షలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కంటి పరీక్షలు కోటి దాటాయి. రెండోవిడత కంటి వెలుగు కార్యక్రమం కింద ఇప్పటివరకు 1.01 కోట్ల మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్య ఆరోగ్యశాఖ గురువారం వెల్లడించింది. ఈ ఏడాది జనవరి 18న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించడం తెలిసిందే. ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షల్లో 47.70 లక్షల మంది పురుషులు, 53.85 లక్షల మంది మహిళలు, 3,360 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. వివిధ రకాల కంటి సమస్యలున్న వారిలో 16.33 లక్షల మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. చత్వారం సమస్యలున్న 12.31 లక్షల మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసులు ఇవ్వాలని నిర్ణయించారు.



కొండంత భక్తి

ఎటుచూసినా భక్తుల కోలాహలం.. పెద్దసంఖ్యలో తరలివచ్చిన హనుమాన్ మాలధారులు.. గురువారం హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాల సందర్భంగా జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి సన్నిధిలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. హనుమాన్, రామ నామస్మరణలతో కొండంతా మార్మోగింది. వేకువజాము నుంచే మాలవిరమణ కార్యక్రమం ప్రారంభమైంది. లక్షకుపైగా దీక్షస్వాములు మాల విరమణ చేసి అంజన్నను దర్శించుకున్నారు. జయంతి సందర్భంగా స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. - కొండగట్టు (చొప్పదండి)

క్లుప్తంగా...

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు లక్షమంది

- విస్తృత ఏర్పాట్లు చేయాలి
- అధికారులకు సీఎస్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14న నిర్వహించనున్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి లక్ష మందికి పైగా ప్రజలు వచ్చే అవకాశం ఉందని, ఆ మేరకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. బీఆర్‌కేఆర్ భవన్‌లో గురువారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి దార్శనికత మేరకు ఏర్పాట్లు ఘనంగా ఉండాలన్నారు. పకడ్బందీగా ట్రాఫిక్ నిర్వహణ, నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రధాన వేదిక వద్ద బారికేడింగ్ ఏర్పాట్లు చేయాలని కోరారు. సభ వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆవరణ వద్ద సుందరీకరణ ఏర్పాట్లు చేయాలని జీహెచ్ఎంసీకి సూచించారు. అగ్నిమాపక ఏర్పాట్లు చూసుకోవాలని ఆమె పేర్కొన్నారు. వేసవికాలం దృష్ట్యా తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని ఆమె వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. పార్కింగ్, ప్రాంగణం వద్ద ఇతర ఏర్పాట్లను పటిష్టం చేయడానికి శుక్రవారం ఆ ప్రాంతాన్ని సంయుక్తంగా సందర్శించాలని ఆర్అండ్‌బీ, పోలీస్, వైద్య, సాంఘిక సంక్షేమ శాఖ, హైదరాబాద్ కలెక్టర్, ఇతర అధికారులను సీఎస్ ఆదేశించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణపై దళిత సంఘాల భేటీ

సాక్షి, హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఈ నెల 14న ఉన్న నేపథ్యంలో గురువారం శాసన మండలి ఆవరణలో ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో దళిత సంఘాల సమావేశం జరిగింది. సీఎం కేసీఆర్ నిర్ణయాలకు దళితులు రుణపడి ఉంటారని దళిత నాయకులు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళిత బంధు, అంబేడ్కర్ విదేశీ ఓవర్సీస్ పథకంతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, గురుకుల పాఠశాలలు, స్కాలర్ షిప్‌లు, కళ్యాణ్ లక్ష్మి పథకాలతో దళితులకు ఎక్కువ మేలు జరిగిందని ప్రభాకర్ రావు తెలిపారు.

దొంగలను జైల్లో పెట్టాక సజావుగా పరీక్షలు

- బీజేపీ నేతలపై మంత్రి హరీశ్ ధ్వజం
- నాలుగేళ్ల క్రితం మంజూరైన మెడికల్ కాలేజీకి పీఎం ఇప్పుడు కొబ్బరి కాయ కొడతారా అంటూ మంత్రి ఎద్దేవా

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: పరీక్ష పేపర్లు లీకు చేసిన దొంగలను అరెస్టు చేసి జైలులో పెట్టాక ఇప్పుడు పరీక్షలన్నీ సజావుగా సాగుతున్నాయని రాష్ట్ర వైద్యా రోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. సంగారెడ్డి జిల్లాలో గురువారం వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ నేతలు ఎన్నో కుట్రలు చేస్తున్నారని, హిందూ, ముస్లింల మధ్య కొట్లాట పెట్టి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేలను కొని ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూసి విఫలమయ్యారన్నారు. సీఎం కేసీఆర్ బలమైన తెలంగాణ నిర్మాణానికి పునాదులు వేస్తుంటే బీజేపీ నేతలు సమాధులు తవ్వుతామంటున్నారని ధ్వజమెత్తారు.

ఒక్క మెడికల్ కాలేజీకి ఇంత ప్రచారమా..

ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనపైనా హరీశ్ విమర్శ లు గుప్పించారు. నాలుగేళ్ల క్రితం మంజూరైన ఒక్క మెడికల్ కాలేజీ ఎయిమ్స్‌కు మోదీ ఇప్పుడు కొబ్బరికాయ కొట్టడం విడ్డురంగా ఉందని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం గత ఏడాది ఒకేసారి ఎనిమిది మెడికల్ కాలేజీలు ప్రారంభించిందని గుర్తు చేశారు. కంటి వెలుగు కార్యక్రమంలో కోటి మందికి కంటి పరీక్షలు పూర్తయిన సందర్భంగా సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు.

కాంగ్రెస్ రోజురోజుకూ బలహీనపడుతోంది

కాంగ్రెస్ పార్టీ రోజురోజుకూ బలహీనపడుతోందని హరీశ్‌రావు అన్నారు. సోనియాని విమర్శిస్తే కనీసం ఖండించలేని పరిస్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. లోక్‌సభ నుంచి రాహుల్‌గాంధీని తీసిపారేస్తే దిక్కు దివాణం లేకుండా పోయిందని వ్యాఖ్యానించారు. పదేళ్లు పాలించిన కాంగ్రెస్ రాష్ట్రానికి ఏమీ చేయలేదని, అలాంటి కాంగ్రెస్ పార్టీని నమ్మితే నష్టపోతారన్నారు. సెక్రటేరియట్‌ను కూలగొడతానని, ప్రగతిభవన్‌కు కాలబెడతానని అంటున్న రేవంత్‌రెడ్డి లాంటి నేతలు కావాలా? తెలంగాణను నిర్మించే కేసీఆర్ కావాలో ఆలోచించుకోవాలన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమాచార కమిషనర్ల నియామకం ఎప్పుడు? : హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్, కమిషనర్ల నియామకం ఎప్పుడు చేపడతారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. దాదాపు రెండు నెలలుగా ఈ పోస్టులు ఖాళీగా ఉన్నా ప్రభుత్వం నియామకాలు చేపట్టడం లేదని పేర్కొంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ప్రజల దరఖాస్తులు పెద్దఎత్తున పేరుకుపోతున్నాయని, సమస్యలు పరిష్కారం కాక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. దాదాపు 10 మంది ఉండాల్సిన ముఖ్యమైన కమిషన్‌లో ఒక్కరూ లేకపోవడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. నోటీసులు జారీచేస్తూ విచారణను జూన్ 26కు వాయిదా వేసింది.

రెండు, మూడు వారాల్లో 'ఫ్యాబ్'పై ప్రకటన

మన దేశం సెమీకండక్టర్ల రంగంలో ఎదగాల్సిన సమయమిది

- దేశీయంగా ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల డిజైన్, తయారీ అవసరం
- హెచ్‌సీఎల్ వ్యవస్థాపకుడు అజయ్ చౌదరి వెల్లడి
- ఆయన ఆత్మకథ 'జస్ట్ ఆస్పైర్' ఆవిష్కరణ



సాక్షి, హైదరాబాద్: సాఫ్ట్‌వేర్ రంగంలో అద్భుత ప్రగతి సాధించిన భారత్.. హార్డ్‌వేర్‌లో, ముఖ్యంగా సెమీకండక్టర్ల రంగంలో ఎదగాల్సిన సమయం ఆసన్నమైందని హెచ్‌సీఎల్ కంప్యూటర్స్ వ్యవస్థాపకుడు, సెమీకండక్టర్ విధానంపై కేంద్రం ఏర్పాటు చేసిన అత్యున్నత సలహామండలి సభ్యుడు అజయ్ చౌదరి పేర్కొన్నారు. దేశంలో సెమీకండక్టర్ల తయారీ కేంద్రం (ఫ్యాబ్) లేకుండా పోయిందని, త్వరలోనే ఆ కొరత తీరనుందని తెలిపారు. అన్నీ సవ్యంగా సాగితే ఇంకో రెండు, మూడు వారాల్లోనే కేంద్ర ప్రభుత్వం ఫ్యాబ్ ఏర్పాటుపై ప్రకటన చేసే అవకాశం ఉందని చెప్పారు. అజయ్ చౌదరి గురువారం 'జస్ట్ ఆస్పైర్' పేరిట తన ఆత్మకథను ఆవిష్కరించిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. మన దేశంలో సొంత ఫ్యాబ్ లేకపోవడం వల్ల ఇతర దేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పుడు కొత్తగా ఏర్పాటయ్యే ఫ్యాబ్‌లలో అత్యంత ఆధునిక చిప్‌లు కాకుండా.. మన దేశ అవసరాలకు ఉపయోగపడేవి మాత్రమే తయారవుతాయని తెలిపారు. తైవాన్ వంటి దేశాల నుంచి నాలుగైదు నానోమీటర్ల పరిమాణం ఉండే అత్యాధునిక సెమీకండక్టర్లను దిగుమతి చేసుకోవచ్చని.. 28 నానోమీటర్ల వాటిని స్థానికంగా తయారుచేసుకోవడం వల్ల చైనా వంటి దేశాల నుంచి దిగుమతులను తగ్గించుకోవచ్చని వివరించారు. దేశంలో ఎలక్ట్రానిక్స్ రంగం పునరుజ్జీవనం లక్ష్యంగా తాను ఏర్పాటు చేసిన 'ఎలక్ట్రానిక్స్ ప్రొడక్ట్స్ ఇన్నోవేషన్ కన్సార్షియం (ఎపిక్)' ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినూత్న ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను సొంతంగా డిజైన్ చేసి, తయారు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు అజయ్ చౌదరి తెలిపారు. పిల్లల చదువులకు ఉపయోగపడే ట్యాబ్.. కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు మూడింటికి ఉపయోగపడేలా త్రీఇన్ వన్ చార్జర్‌ను తయారుచేస్తున్నామని వెల్లడించారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పదో నంబర్ ప్లాట్‌ఫాంపై ఆంక్షలు

సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పదో నంబర్ ప్లాట్‌ఫామ్ మీద ప్రయాణికుల రాకపోకలపై రైల్వే అధికారులు ఆంక్షలు విధించారు. 8న ఉదయం అదే ప్లాట్‌ఫామ్ నుంచి వందే భారత్ రైలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఈ నెల 7వ తేదీ అర్ధరాత్రి 12 గంటల నుంచి మరునాడు మధ్యాహ్నం 1 గంట వరకు ప్రయాణికులు, పోర్టర్లుసహా అనుమతి లేనివారెవరినీ లోనికి అనుమతించరని స్పష్టం చేశారు.

ఓబీసీ రిజర్వేషన్లపై పోరాడతాం



మల్లికార్జున ఖర్గే, సీతారాం ఏచూరిలతో భేటీ అయిన కృష్ణయ్య

కాచిగూడ (హైదరాబాద్): చట్టసభలలో ఓబీసీ రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో పోరాటం చేస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య బృందానికి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, సీపీఎం జాతీయ నేత సీతారాం ఏచూరి హామీ ఇచ్చారు. ఢిల్లీలో ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు భూపేష్ సాగర్, కె.రాము, భూషయ్య, వేముల రామకృష్ణలతో కూడిన బృందం గురువారం మల్లిఖార్జున ఖర్గే, సీతారాం ఏచూరిలను కలిసింది. చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల సాధనకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది.

కొత్తగా 21 కరోనా కేసులు నమోదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గురువారం 5,507 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 21 మంది వైరస్ బారినపడ్డారు. దీంతో ఇప్పటి వరకు మొత్తం నమోదైన కేసుల సంఖ్య 8.42 లక్షలకు చేరింది. ప్రస్తుతం 146 మంది ఐసోలేషన్‌లో చికిత్స పొందుతుండగా..17 మంది కరోనా నుంచి కోలుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఆయన, తాను కోరిన వారిని తన కారుణ్యంలోకి తీసుకుంటాడు.
దుర్మార్గుల కొరకు ఆయన బాధాకరమైన శిక్షను సిద్ధపరచి ఉంచాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, ఏప్రిల్, 7

పుతిన్‌కు పెరిగిన తలనొప్పి

మూలిగే నక్క మీద తాటిపండు పడడమంటే ఇదే! ఉత్తర అట్లాంటిక్ సైనిక కూటమి (నాటో)లో చేరడానికి ఉక్రెయిన్ ఉత్సాహపడుతోందని కోపగించి, కదనానికి కత్తి దూసిన రష్యాకు ఆ తలనొప్పి తగ్గకపోగా, ఇప్పుడు ఫిన్లాండ్ రూపంలో కొత్త తలనొప్పి వచ్చి పడింది. అమెరికా సహా మొత్తం 30 పాశ్చాత్య దేశాల కూటమి 'నాటో'లో 31వ దేశంగా మంగళవారం ఫిన్లాండ్ అధికారికంగా చేరింది. దీంతో, రష్యాకు కంటి మీద కునుకు పట్టనివ్వకుండా ఆ దేశంతో 'నాటో' సభ్య దేశాల సరిహద్దు రెట్టింపయింది. పాశ్చాత్య ప్రపంచంతో దీర్ఘకాలంగా ఘర్షణలో ఉన్న మాస్కో విషయంలో ఇన్నేళ్ళుగా తటస్థంగా ఉన్న ఫిన్లాండ్ ఇప్పుడిలా ప్రత్యర్థితో జట్టు కట్టడం రష్యాకూ, ఆ దేశాధినేత వ్లాదిమిర్ పుతిన్‌కూ పెద్ద ఎదురుదెబ్బ. కానీ, ఉక్రెయిన్‌తో ఏడాది పైగా ఎగతెగని పోరు చేస్తూ, ముందుకు పోలేక వెనక్కి రాలేక సతమతమవుతున్న మాస్కో మేకపోతు గాంభీర్యం ప్రదర్శించింది. ఫిన్లాండ్ చేసినపనికి తగురీతిలో ప్రతిచర్యలు ఉంటాయని హూంకరించింది.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత భవిష్యత్తులో ఇతర దేశాల నుంచి తమను తాము రక్షించుకొనేందుకు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, నార్వే, నెదర్లాండ్స్, కెనడాలు స్థాపించిన సైనిక కూటమి 'నాటో'. 1949లో సంతకం చేసిన ఉత్తర అట్లాంటిక్ ఒప్పందాన్ని ఇది అమలు చేస్తుంది. 'నాటో'లోని ఏ సభ్యదేశం పైన అయినా బయట దేశాలు దాడికి దిగితే, మిగతా సభ్యదేశాలన్నీ సాయం చేయాలి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లో సోవియట్ రష్యా విస్తరణ ముప్పును అడ్డుకోవడమూ 'నాటో' లక్ష్యం. తన ప్రయోజనాలకు విరుద్ధంగా పాశ్చాత్య ప్రపంచం కూడగట్టిన ఈ కూటమి అంటే రష్యాకు అందుకే ఒళ్ళు మంట. 1990ల ద్వితీయార్ధం నుంచి తన పొరుగు దేశాలను 'నాటో'లో చేర్చుకొని, పక్కలో బల్లెంలా మార్చడాన్ని రష్యా తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తోంది. 'నాటో' విస్తరణ విషయంలో ఉక్రెయిన్‌కు సంబంధించి ఇచ్చిన మాట తప్పేందుకు పాశ్చాత్య ప్రపంచం సిద్ధపడడాన్ని మాస్కో జీర్ణించుకోలేకపోయింది. అందుకే, రష్యా అధ్యక్షుడు పుతిన్ ఏడాది క్రితం ఉక్రెయిన్‌పై పూర్తిస్థాయి యుద్ధానికి దిగారు.

సరిహద్దు వెంట 'నాటో' బెడద తగ్గించుకోవాలనీ, యూరప్‌లో మరే దేశమూ 'నాటో'లో చేరకుండా చేయాలనీ ఉక్రెయిన్‌తో పోరాటం ప్రారంభించిన పుతిన్ సఫలం కాలేదు. పైపెచ్చు, అందుకు పూర్తి విరుద్ధంగా ఆ సైనికకూటమి విస్తరణకు కారణమయ్యారు. ఇది విరోధాభాస. మాస్కో చేపట్టిన యుద్ధంతో 'నాటో' పట్ల ఆకర్షణ పెరిగింది. రష్యాతో తిప్పలు తప్పవనే అనుమానంతో, 'నాటో' సైనిక కూటమిలో సభ్యత్వానికి మరిన్ని మధ్యయూరప్ దేశాలు క్యూ కట్టాయి. ఆ క్రమంలో ఫిన్లాండ్, స్వీడన్‌లు 'నాటో' సభ్యత్వానికి దరఖాస్తు చేసుకున్నాయి. నిజానికి, ఫిన్లాండ్ దాదాపు 1,340 కిలోమీటర్ల తూర్పు సరిహద్దును రష్యాతో పంచుకుంటోంది. ఆ దేశం ఎన్నడూ రష్యా వ్యతిరేకి కాదు. పైగా, రెంటికీ మధ్య ఎన్నడూ విభేదాలు లేవు. అలాంటిది– ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణతో 'నాటో'లో చేరేందుకే ఫిన్లాండ్‌లో 80 శాతం మేర ప్రజాభిప్రాయం మొగ్గింది. చివరకు అదే జరిగింది. సభ్యత్వానికి ఫిన్లాండ్ పెట్టుకున్న దరఖాస్తు రికార్డు సమయంలో ఆమోదం పొందింది.

ఫిన్లాండ్ అధికారికంగా 'నాటో'లో చేరినా, స్వీడన్‌కు మాత్రం ఆటంకాలు ఎదురవుతూనే ఉన్నాయి. సభ్యత్వానికి స్వీడన్ అంగలారుస్తున్నా, టర్కీ, హంగరీలు అడ్డంగా నిలిచాయి. టర్కీలో మానవ హక్కుల ఉల్లంఘనలు, ప్రజాస్వామ్య ప్రమాణాల గురించి స్వీడన్ వ్యాఖ్యలు చేయడంతో ఆ దేశం కినుక వహించింది. మే 14న టర్కీలో ఎన్నికల తర్వాత కానీ ఆ దేశం స్వీడన్ దరఖాస్తుకు ఆమోదముద్ర వేయకపోవచ్చని విశ్లేషకుల అంచనా. హంగరీ విషయానికొస్తే, స్వీడన్ అనేక సంవత్సరాలుగా హంగరీ పట్ల వైరభావంతో వ్యవహరిస్తోంది. పైగా, హంగరీలో న్యాయం క్షీణించిందంటూ స్వీడన్ ప్రధాని ఆ మధ్య వ్యాఖ్యానించారు. దాంతో, హంగరీకి పుండు మీద కారం రాసినట్లయింది. టర్కీ లాగా డిమాండ్ల జాబితా లేకున్నా, తన సాధకబాధకాలను తీరిస్తే హంగరీ సైతం 'నాటో'లో స్వీడన్ ప్రవేశానికి ఓకే అంటుంది. మొత్తానికి, అమెరికా సారథ్యంలోని ద్వితీయ ప్రపంచ యుద్ధానంతర కూటమి బలోపేతమవుతోంది. బోలెడన్ని నిధులందిన ఆధునిక రక్షణ దళాలతో కూడిన ఫిన్లాండ్ 'నాటో'కు బలమైన చేర్పు.

రేపు ఉక్రెయిన్ యుద్ధం ఎటు తిరిగి ఎలా ముగిసినా, రష్యా మాత్రం బలహీనపడింది. ఏదైతే జరగరాదని పుతిన్ ఆశించారో, అదే జరిగి సరిహద్దు వెంట 'నాటో' దేశాల సంఖ్య, సత్తా ఇనుమడించాయి. ఈ పాపపుణ్యాలు పూర్తిగా పుతిన్‌వే. దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవిస్తూ, నియమానుసారం సాగే అంతర్జాతీయ క్రమాన్ని ఆయన తోసిపుచ్చారు. పాశ్చాత్య ప్రపంచం ఉలిక్కిపడి, కార్యాచరణకు ఉద్యుక్తమయ్యేలా చేశారు. ఇకపై రష్యా – యూరప్‌ల మధ్య బంధం మునుపటిలా ఉండబోదు. మరోపక్క చైనా సైతం నిత్యం ఎవరో ఒకరితో కయ్యానికి కాలుదువ్వుతోంది. వీటన్నిటి దృష్ట్యా 'నాటో' లాంటి సైనిక కూటములు మరింత విస్తరించడం ఖాయం. ఇప్పటికే ప్రచ్ఛన్న యుద్ధ కాలం నుంచి తటస్థంగా ఉన్న ఫిన్లాండ్, స్వీడన్‌లు పాశ్చాత్య ప్రపంచ మిత్రపక్షాలుగా మారాయి. రష్యాతో చేతులు కలిపి ఆర్కిటిక్‌లో చైనా తన ప్రాబల్యం పెంచుకుంది. ఈ పరిస్థితుల్లో ధ్రువవృత్తం దాటి, ఆర్కిటిక్ ప్రాంతమంతటా సైనికీకరణ తప్పకపోవచ్చు. భారత్ సైతం ఆర్కిటిక్‌లో తలెత్తే పరిణామాలనూ, ప్రభావాన్నీ జాగ్రత్తగా గమనించక తప్పదు. వెరసి, ఆర్కిటిక్ ప్రాంతం మరింత సమస్యాత్మకం కానుంది. పుతిన్‌తో పాటు ప్రపంచానికీ తలనొప్పి పెరగనుంది!


గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.పాడ్యమి ఉ.10.11 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** చిత్త ప.1.32 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** రా.7.14 నుండి 8.51 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.20 నుండి 9.11 వరకు తదుపరి ప.12.25 నుండి 1.16 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.10 నుండి 9.50 వరకు.

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

ఊగిసలాడే ఓటర్లే కీలకం

విశ్లేషణ



సందీప్ శాస్త్రి

224 మంది సభ్యుల కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల పోరు మొదలైంది. మే 10న ఎన్నికలు జరిగి, 13న ఫలితాలు వెలువడుతాయి. నాలుగు దశాబ్దాల రాష్ట్ర చరిత్రలో అధికారంలో ఉన్న పార్టీ తిరిగి గెలుపొందలేదు. దీన్ని తిరగరాయాలని బీజేపీ అనుకుంటోంది. సంప్రదాయ ధోరణి మీద నమ్మకం పెట్టుకున్న కాంగ్రెస్ అదే తనను మెజారిటీ మార్కు దాటిస్తుందని ఆశిస్తోంది. మూడవ స్థానంలో ఉన్న జేడీఎస్, మళ్లీ కింగ్ మేకర్‌గా ఆవిర్భవించే, వీలైతే కింగ్ అయ్యే అవకాశం కోసం ఎదురుచూస్తోంది. చాలామంది ఓటర్లు ఎన్నికల ప్రకటనకు చాలాముందుగానే తాము ఎవరికి ఓటు వేయాలనుకుంటున్నది నిర్ణయించుకుంటున్నట్లు గత సర్వేలు సూచిస్తున్నాయి. అందువల్ల ఊగిసలాడే ఓటర్లకు ప్రాధాన్యం పెరుగుతుంది.

అధికారికంగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల సమరం ప్రారంభమైంది. సుమారు నెల రోజుల్లో రాష్ట్ర రాజకీయ సంక్లిష్టత విషయంలో ఒక స్పష్టత వస్తుంది. కర్ణాటక ఓటర్లు కొత్త ఎన్నికల ట్రెండును మొదలు పెడతారా, లేక పాత రాజకీయ సంప్రదాయాన్నే పాటిస్తారా అనేది ప్రశ్న.



'రెండో' గెలుపు ఒక్కసారే...

దాదాపు నాలుగు దశాబ్దాలుగా కర్ణాటక ఎన్నడూ అధికారంలో ఉన్న పార్టీకి తిరిగి గట్టి మెజారిటీని కట్టబెట్టలేదు. చివరిసారిగా రామకృష్ణ హెగ్డే నేతృత్వంలోని జనతా పార్టీ 1985లో రెండోసారి కూడా స్పష్టమైన మెజారిటీని సాధించింది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎన్నడూ మెజారిటీతో గెలుపొందలేదు. 2008లో, 2018లో అది మెజారిటీకి సమీపంలోకి వచ్చింది. 2008లో స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతుతో అది మెజారిటీని సాధించగలిగింది. 2018లో కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేల రాజీనామా వల్ల బీజేపీ మెజారిటీ సాధించుకుంది. ఈ రెండు ధోరణులను ఇప్పుడు అధికారంలో ఉన్న బీజేపీ తిరగరాయాలని ఆశ పడుతోంది.

సంప్రదాయ ధోరణి మీద నమ్మకం పెట్టుకున్న కాంగ్రెస్ అదే తనను మెజారిటీ మార్కు దాటిస్తుందని అనుకుంటోంది. మూడవ స్థానంలో దూరంగా ఉన్న జేడీఎస్, ఏ పార్టీ కూడా మెజారిటీ సాధించని స్థితిలో అసెంబ్లీలో అధికారంపై ఆశలు పెట్టుకుంటోంది. మళ్లీ ఒకసారి కింగ్ మేకర్‌గా ఆవిర్భవించే అవకాశం కోసం, వీలైతే మరోసారి కింగ్ అయ్యే అవకాశం కోసం ఎదురుచూస్తోంది.

మరోవైపున కర్ణాటకలో నాలుగు సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీ మరోసారి రాష్ట్రాన్ని నిలుపుకొనేందుకు సకల ప్రయత్నాలూ చేస్తోంది. చతుర్ముఖ వ్యూహంతో అది పనిచేస్తోంది.

ముఖ్యమంత్రి అభ్యర్థి ప్రకటించకుండానే...

మొదటిది: కేంద్రప్రభుత్వం, దాని నాయకత్వానికి స్పష్టంగా ప్రాధాన్యత ఇస్తున్నారు. గత మూడు నెలలుగా జరుగుతున్నది ఒక సూచిక అనుకుంటే, కేంద్ర నాయకత్వమే నేరుగా ఈ ప్రచారానికి నాయకత్వం వహిస్తుంది. కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రదర్శించుకోవడంపై దృష్టి పెడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం గురించి ఏదైనా ప్రస్తావించడం, కొంత ఆలస్యమైన రెండో ఆలోచనగానే కనబడుతోంది.

రెండు: తమ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి అధికారంలో ఉంటున్నప్పటికీ వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండానే బీజేపీ అసెంబ్లీ ఎన్నికలకు వెళుతోంది. రాష్ట్ర నాయకులలో మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడ్యూరప్ప స్పష్టంగానే పార్టీ తరఫున స్టార్ క్యాంపెయినర్‌గా ఉంటారు. రాష్ట్రంలో పార్టీని నిర్మించి ఘనత ఆయనదే. ఆయన కరిష్మా ఆధారంగానే నిలబడాలని బీజేపీ ఆశలు పెట్టుకుంటోంది. అయితే ఈసారి కాస్త తేడా ఉంది. తాను ఈ దఫా ఎన్నికల్లో పోటీ చేయనని యడ్యూరప్ప ప్రకటించారు. ఇంతకుముందటి ఎన్నికల్లో పార్టీ తరపున ఆయన ముఖ్యమంత్రి అభ్యర్థిగా ముందుకొచ్చారు. ఇదేమైనా వ్యత్యాసం తేగలదేమో చూడటం ఆసక్తికరం.

మూడు: ఉత్తర, కోస్తా కర్ణాటకలో తనకున్న సాంప్రదాయిక మద్దతును నిలబెట్టుకోవలసిన అవసరం బీజేపీకి ఉంది. అలాగే పాత మైసూర్ ప్రాంతంలోకి చొచ్చుకు పోవాల్సిన అవసరం కూడా ఉంది. ఈ మైసూరు ప్రాంతంలో ఎక్కువగా కాంగ్రెస్, జేడీఎస్ మధ్యే పోటీ ఉంటోంది. అవసరమైన మెజారిటీని సాధించాలంటే ఉత్తర కర్ణాటకలో తన బలమైన ఉనికిని నిలబెట్టుకుంటూనే, పాత మైసూరులో బీజేపీ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని ఆ ప్రాంతంలో బీజేపీ జాతీయ నాయకులు పదేపదే పర్యటనలు చేస్తుండటం దీన్నే తేటతెల్లం చేస్తోంది.

చివరగా, కర్ణాటకలో విస్తృతమైన సామాజిక ఏకీభావాన్ని నిర్మించడానికి బీజేపీ ప్రయత్నం చేస్తోంది. పార్టీకి లింగాయతులు తమ మద్దతును ఎప్పటిలా కొనసాగిస్తారని నమ్ముతూనే వక్కళిగలు, ఓబీసీలు, దళితుల మద్దతును కూడగట్టుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. రిజర్వేషన్ కోటాను తిరగరాయడం ఈ కులాల్లోకి వ్యాప్తి చెందే లక్ష్యంలో భాగమేనని చెప్పాలి.

ఐక్యత లేమి పార్టీకి నష్టం

కర్ణాటకలో కాంగ్రెస్ ఎల్లప్పుడూ ప్రధాన పక్షంగానే ఉంటూ వచ్చింది. కానీ ముఠాతత్వం, కీలక సమయాల్లో ఐక్యతా లేమి కారణంగా పార్టీ మట్టికొట్టుకుపోతోంది. అయితే, ఐక్యత లేకుండా ఈ దఫా ఎన్నికల్లో మెజారిటీ వచ్చే అవకాశం కలగానే మిగిలిపోతుందని పార్టీ, ప్రత్యేకించి దాని రాష్ట్ర నాయకత్వం గుర్తిస్తోంది. ఇద్దరు కీలక నేతలు సిద్ధరామయ్య, శివకుమార్ ముఖ్యమంత్రి పదవిపై తమ ఆకాంక్షలను ఇప్పటికే ప్రకటించారు. అయితే తమ లక్ష్మణ రేఖను మాత్రం వారు దాటలేదు. ఎన్నికల అనంతరమే ముఖ్యమంత్రి అభ్యర్థి నిర్ణయం జరుగుతుందని వీరు ప్రకటించారు. పార్టీలో ఐక్యత కొన సాగుతుందో లేదో తేల్చడానికి అభ్యర్థులకు టికెట్ల పంపిణీ సమయమే లిట్మస్ పరీక్ష అవుతుంది (అయితే ఇప్పటికి రెండు జాబితాలను కాంగ్రెస్ వెలువరించింది). ఇంతవరకు పార్టీ స్థానిక సమస్యలపై, బీజేపీ పాలనపై దృష్టి పెట్టింది. అయితే, లోక్‌సభ నుంచి రాహుల్ గాంధీ బహిష్కరణను కూడా తమ ప్రచారంలో అదనపు అంశంగా జోడించింది. సాంప్రదాయకంగా మద్దతు పొందుతున్న పలు వర్గాల పొత్తును కాంగ్రెస్ పట్టుదలతో సాధించిందని గుర్తుంచుకోవాలి.

స్పష్టమైన ఫలితమే...

జేడీఎస్ పార్టీ సుదూరంలోని మూడవ శక్తిగా కొనసాగుతోంది. కాంగ్రెస్‌తో పొత్తు కారణంగా 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ రాజకీయంగా పెను నష్టాన్ని చవిచూసింది. దాంతో పాత మైసూరు రీజియన్లోని జేడీఎస్ సాంప్రదాయిక పునాదిలోకి బీజేపీ చొచ్చుకు వెళ్లడానికి ఇది అనుమతించింది. అయితే కాంగ్రెస్, బీజేపీ రెండూ తమ పార్టీతో టచ్‌లో ఉంటున్నాయని చెప్పడం ద్వారా జేడీఎస్ నేత కుమారస్వామి రాజకీయంగా సంచలనం సృష్టించారు.

చాలామంది ఓటర్లు ఎన్నికల ప్రకటనకు చాలాముందుగానే తాము ఎవరికి ఓటు వేయాలనుకుంటున్నది నిర్ణయించుకుంటున్నట్లు గత కొన్నేళ్లలో లోక్‌నీతి–సీఎస్‌డీఎస్ జరిపిన పోల్ అనంతర సర్వేలు సూచిస్తున్నాయి. క్రితంసారి కర్ణాటక ఎన్నికల విషయంలో ఇదే నిజమైంది. కొంతమేరకు ఇది రాజకీయ పోలరైజేషన్‌ను ప్రతిఫలించింది. ఈ పార్టీలకు ఉన్న నిబద్ధ ఓటర్ల రీత్యా, ఇది అంత ఆశ్చర్యం కలిగించదు. అందువల్ల ఊగిసలాడే ఓటర్లకు ప్రాధాన్యత పెరుగుతుంది. కాబట్టి రాబోయే రోజుల్లో ఈ ఓటర్లను తమవైపు తిప్పుకొనే ప్రయత్నాలు తీవ్రమవుతాయి. చాలామంది ఎన్నికల వ్యాఖ్యాతలు ఈసారి హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందని ఊహిస్తున్నారు. కానీ ఈ అసెంబ్లీ ఫలితాలు మరింత స్పష్టతతో వెలువడతాయి.

వ్యాసకర్త రాజకీయ విశ్లేషకులు;
జాతీయ సమన్వయకర్త, లోక్‌నీతి నెట్‌వర్క్
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

పనికిరానివి



రేపు (7 ఏప్రిల్) నా హేపీ బర్త్ డే. దయ చేసి నాకు విషెస్ చెప్పొద్దు. ఎందుకంటే, శుభాకాంక్షలు అనేవి ఉచితం, నిరుపయోగం. చవక బహుమతులైనా ఫర్లేదు. ఉచితం కంటే చవక మెరుగు.
– రామ్ గోపాల్ వర్మ, దర్శకుడు

సత్యం చెబితే...



యూఎస్ బలగాలు ఇరాకీ పౌరుల మీద కాల్పులు జరిపే వీడియోను జూలియన్ అసాంజే పదమూడేళ్ల క్రితం ఈరోజు (6 ఏప్రిల్) విడుదల చేశారు. అందుకు 175 ఏళ్ల కారాగార శిక్షను ఎదుర్కోనున్నారు.
– సారా, లెబనీస్ కామెంటేటర్

స్థానిక సాధికారత



మొత్తం పైనుంచి కిందికి వచ్చే 'కేంద్ర ప్రణాళిక' విధానంలో చైనా పనిచేస్తుందని చాలామంది భావిస్తారు. కానీ దేశ వ్యయంలో స్థానిక ప్రభుత్వాలు (ప్రావిన్సులు, నగరాలు, గ్రామాలు మొదలైనవి) ఊహించలేనంతగా 85 శాతం ఖర్చు పెడతాయి. ఇంకోలా చెప్పాలంటే, ఇతర దేశాలు సగటున కేంద్రంలో 66 శాతం ఖర్చుపెడితే, చైనా కేంద్ర ప్రభుత్వం కేవలం 15 శాతం మాత్రమే ఖర్చు చేస్తుంది.
– అర్నాడ్ బెర్ట్రాండ్, ఆంట్రప్రెన్యూర్

ఎవరో ఏమో!



కొన్నేళ్ల తర్వాత– పిల్లాడు (తాజ్‌మహల్‌ను చూస్తూ): దీన్ని ఎవరు నిర్మించారు? అమ్మ: ఎవరో ఏమో. పిల్లాడు (ఎర్రకోటను చూస్తూ): దీన్ని ఎవరు నిర్మించారు? అమ్మ: ఎవరో ఏమో. పిల్లాడు తన స్నేహితులతో తాజ్‌మహల్, ఎర్రకోటను చూశానంటూ వాటిని ఎవరో ఏమో నిర్మించారని చెబుతాడు.
– సయేమా, రేడియో జాకీ

ప్రశ్నలకు సిద్ధమా?



సుదీప్! ఒక మేటి కళాకారుడిగా మీరు సమాజంలోని అన్ని వర్గాల ప్రేమతో పెరిగారు. మీరు సామాన్య జనం గొంతుక అవుతారని ఆశించాను. కానీ ఒక రాజకీయ పార్టీ రంగు పూసుకుంటారని ఊహించలేదు. ఇక నుంచి మిమ్మల్నీ, మీ పార్టీనీ ప్రజలు ప్రశ్నిస్తారు. సిద్ధంగా ఉండండి.
– ప్రకాశ్ రాజ్, నటుడు

మర్యాద



సుధామూర్తికి పద్మభూషణ్ ఇచ్చారు. రాష్ట్రపతి భవన్‌లో పురస్కారాల ప్రదాన వేడుక జరిగినప్పుడు ఒక ఆసక్తికర విషయం చోటు చేసుకుంది. ఆమె కూతురు అక్షతా మూర్తి (యూకే ప్రధాని రిషి సునాక్ భార్య) మొదట కుటుంబంతో కలిసి మధ్య వరుసల్లో కూర్చున్నారు. కానీ ప్రభుత్వ అధికారులు ఆమెను ముందు వరుసకు మార్చారు.
– చంద్ర ఆర్. శ్రీకాంత్, సంపాదకురాలు

జై హనుమాన్



చిన్నప్పుడు మా అమ్మ, హనుమంతుడి అంత బలం కావాలంటే మొత్తం అన్నం తినమని చెప్పేది. తర్వాత, నేను జిమ్‌కు పోవడం మొదలుపెట్టాక, అక్కడ కండలు పెంచడానికి స్ఫూర్తి కలిగించేలా హనుమంతుడి పోస్టర్లు ఉండేవి. చాలా కాలం తర్వాత ఆయన అసలైన 'కండలు' వివేకం, ధైర్యం, శ్రద్ధ, స్వీయ క్రమశిక్షణ అని తెలుసుకో గలిగాను. హనుమాన్ జయంతి (ఏప్రిల్ 6) హార్దిక శుభాకాంక్షలు.
– ఆనంద్ మహీంద్రా, పారిశ్రామికవేత్త

ఇన్‌బాక్స్

ఆటిజం పెద్ద సమస్య కాదు

ఇవ్వాళ ప్రపంచంలో ప్రతి 125 మంది పిల్లలలో ఒకరు ఆటిజంతో బాధపడుతున్నారు. ఈ వ్యాధికి కారణం తెలియదు కానీ జన్యుపరమైన మార్పుల వల్ల ఇది సంభవిస్తుందని పరిశోధనలు తెలుపుతున్నాయి. చిన్నపిల్లల్లో వచ్చే ఆటిజం సమస్యను భూతద్దంలో చూడకుండా దాన్ని పరిష్కరించుకునే దిశలో పనిచేయటం ముఖ్యం. ఆటిజం పైకి కనిపించే సమస్య కాకపోవడంతో తల్లిదండ్రులు దీనిని గుర్తించడంలో ఆలస్యం చేస్తున్నారు. దానితో సమస్య పెరిగిపోతోంది.

పసిపిల్లలు అకారణంగా ఏడ్వటం, గంటల తరబడి స్తబ్ధుగా ఉండడం, తల్లిదండ్రులు పిలిచినా ముభావంగా ఉండడం, తెలిసిన వారిని చూసినా నవ్వకపోవడం, బడి వయసు పిల్లలైతే పక్క పిల్లలతో కలవకపోవడం, ఎప్పుడూ ఒంటరిగా ఉండడం; మనుషుల కంటే బొమ్మలు, వస్తువుల పట్ల ఆసక్తి చూపడం, అడిగిన వెంటనే జవాబు ఇవ్వలేకపోవడం, సూటిగా చూడలేకపోవడం, స్పష్టమైన భావోద్వేగాలేవీ వ్యక్తం చేయలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆటిజం వచ్చినట్లు గుర్తించాలి. ఈ వ్యాధి ఉన్న పిల్లలకు మాటలు సరిగా రాకపోవడం, తాము లేదా ఎదుటి వారు గాయపడినా పట్టనట్టు ఉండడం, నడిచేటప్పుడు మునివేళ్ల మీద నడవడం, అసందర్భంగా మాట్లాడడం వంటివీ వీరిలో కనిపిస్తాయి. ఏదైనా ఒక వస్తువు లేదా బొమ్మ పట్ల విపరీతమైన వ్యామోహం పెంచుకుంటారు. దాన్ని తీసేస్తే విపరీతంగా కోపం వస్తుంది. చేతులు, కాళ్లు లేదా వేళ్లు కాస్త అసహజంగా ఒకే తీరులో కదలిస్తుండడం కనిపిస్తుంది. తాము అడిగినవి ఇవ్వకపోతే అరవడం, కొంత మందిలో ప్రతి దానికీ భయ పడడం, చిన్న చిన్న శబ్దాలకూ గట్టిగా చెవులు మూసుకోవడం, శబ్దాలు భరించలేకపోవడం వంటి భావోద్వేగపరమైన అంశాలూ ఉంటాయి.

ఆటిజంతో బాధపడుతున్న వారు చిన్న వయసు నుండి కూడా తమ పనులు తాము చేసుకోలేని స్థితిలో ఉంటారు. వారికి సరైన వైద్య సేవలు అందిస్తూ, కాసింత ఎక్కువ శ్రద్ధ చూపించడం ద్వారా సాధారణ జీవితాన్ని అందించవచ్చు. తగిన మందులు వాడటం, కౌన్సెలింగ్, శిక్షణ ద్వారా మానసిక పరిపక్వతను పెంచటం, తగు ఆహారాన్ని ఇవ్వటం ద్వారా ఆటిజాన్ని అదుపు చేయవచ్చు. తల్లిదండ్రులు ఆటిజం పిల్లల పెంపకంపై శిక్షణ తీసుకున్నట్లయితే మంచి ఫలితం ఉంటుంది. ఇతర పిల్ల లతో గొడవలు పడటం వంటివి చేస్తుంటే సైకో థెరపీ ద్వారా అదుపు చేయవచ్చు. మొత్తం మీద ఈ రోజుల్లో ఆటిజం పెద్ద సమస్యేమీ కాదని తల్లి దండ్రులు గ్రహించాలి.

– డా॥ అట్ల శ్రీనివాస్ రెడ్డి, రిహాబిలిటేషన్ సైకాలజిస్ట్

బౌద్ధ సంప్రదాయంలో ఆవిష్కరణ జరగాలి!

సందర్భం



ఆర్. రాజేశమ్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాదులోని కొత్త సెక్రటేరియట్ దగ్గరలో 125 అడుగుల ఎత్తుగల అంబేడ్కర్ విగ్రహం రూపు దిద్దుకుంటున్నది. ఏప్రిల్ 14 అంబేడ్కర్ జయంతి రోజున ఆ విగ్రహాన్ని ఆవిష్కరించడానికి సన్నాహాలు సాగుతున్నాయి. ఇంత ఎత్తులో అంబేడ్కర్ విగ్రహం దేశంలో ఎక్కడా లేదనీ, బాబాసాహెబ్ పట్ల కేసీఆర్ ప్రభుత్వానికి గల చిత్తశుద్ధికి ఇది నిదర్శనమంటూ ప్రభుత్వ పెద్దలు అంటున్నారు.

అంబేడ్కర్ స్వయంగా విగ్రహారాధనకూ, వ్యక్తి పూజకూ వ్యతిరేకం. 'నేను విగ్రహ ఆరాధకుణ్ణి కాదు. నిజానికి నేను విగ్రహ విధ్వంసకుడిని' అని ఏనాడో తేల్చి చెప్పారాయన. 1949 నవంబర్ 25న రాజ్యాంగ సభ చర్చలలో భాగంగా... రాజకీయ ప్రజాస్వామ్యం అనేది సామాజిక ప్రజాస్వామ్యానికి దారి తీయాలనీ, అది జరగాలంటే... కుల వ్యవస్థ, విగ్రహారాధన, మతపరమైన తంతులను సమాజం వదిలించుకోవాలనీ తేల్చి చెప్పారు అంబేడ్కర్. విగ్రహ సంస్కృతిని వ్యతిరేకించిన ఆయన పేరిట పొడవైన విగ్రహాలు నిలిపినంత మాత్రాన అంబేడ్కర్ వారసులు సంబరపడాల్సిందేమీ లేదు. ఎగ్జిబిషనిస్టు సంస్కృతి వ్యాపించిన ఈ కాలంలో విగ్రహాలు కడతామంటే అడ్డుకునేదీ లేదు.

అయితే... అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ప్రభుత్వ పెద్దలు ఏ పద్ధతిలో చేయబోతున్నారనేదే నేడు తేలాల్సి ఉంది. అంబేడ్కర్ అవలంబించిన బహుజన సంస్కృతికి అనుగుణంగానే ఆయన విగ్రహ ఆవిష్కరణ కచ్చితంగా జరగాలని అంబేడ్కరిస్టులంతా కోరుతున్నారు. మనువాదాన్ని, బ్రాహ్మణీయ సంస్కృతినీ, వైదిక తంతులనూ జీవితాంతం నిరసించిన వ్యక్తి అంబేడ్కర్. హిందూ మతాన్ని వదిలి బౌద్ధ మతాన్ని స్వీకరించే ముందు సైతం బ్రాహ్మణీయ పెత్తందారీ పోకడలు వదిలించుకుంటే హిందూమతం బాగుపడుతుందని మత పెద్దలకు ఆయన హితవు పలికారు. 1956 అక్టోబర్ 14న నాగపూర్‌లో 'బౌద్ధ దమ్మ' దీక్ష తీసుకుంటున్న సందర్భంలో అంబేడ్కర్ 22 ప్రమాణాలను తాను స్వయంగా స్వీకరించి, తనతో పాటు బౌద్ధ మతంలో చేరుతున్న తన సహచరులతోనూ పలికించారు. అందులోని 8వ ప్రమాణం 'బ్రాహ్మణీకపు తంతులను నేను అనుసరించను' అనేది.



ప్రజల్లో క్రమక్రమంగా హేతువాద ధోరణిని పెంపొందించాలని రాజ్యాంగం ఆర్టికల్ 51(ఏ) ద్వారా ప్రబోధిస్తుంటే.. మన పాలకులు మాత్రం మతమౌఢ్యాన్ని అడుగడుగునా ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలన్నీ బ్రాహ్మణీయ తంతులతోనే మొదలవుతున్నాయి. మన తెలంగాణ ప్రభుత్వ పెద్దలదయితే మరీ విపరీతపు ధోరణి. అయ్యగార్ల కాళ్లకు సాష్టాంగ దండాలు పెడుతూ సమస్త ప్రభుత్వ యంత్రాంగాన్ని సైతం వాళ్ళ ముందు మోకరిల్లేలా చేస్తున్నారు. మత మౌఢ్యాన్ని జీవితాంతం వ్యతిరేకించిన అంబేడ్కర్ స్మృతిలో జరిగే కార్యక్రమంలో బ్రాహ్మణీయ వైదిక తంతులేవి ఉండడానికి వీల్లేదు. ఆ తంతులనే కొనసాగిస్తే అంబేడ్కర్‌ను అవమానించినట్టే అవుతుంది. అంబేడ్కర్ స్వయంగా బౌద్ధమతావలంబి కాబట్టి బౌద్ధం పద్ధతిలో పంచశీల జెండా ఆవిష్కరించి, బుద్ధ వందనం చేస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు.

ఏప్రిల్ 14న విగ్రహావిష్కరణ సమయంలో ఆ వేదికపై ఎలాంటి వైదిక తంతులు నిర్వహించకూడదనీ, అంబేడ్కర్ ఆదర్శాలను గౌరవించాలనీ అంబేడ్కరిస్టులు, బహుజనవాద సంఘాల తరఫున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని మేము డిమాండ్ చేస్తున్నాం. అంబేడ్కర్ అందించిన ప్రత్యామ్నాయ పంథాను గౌరవించే రాజకీయ పార్టీలు సైతం ఈ డిమాండుకు మద్దతుగా నిలవాలని కోరుతున్నాం.

వ్యాసకర్త సామాజిక న్యాయ వేదిక కన్వీనర్
మొబైల్: 94404 43183

నరుల పాపపరిహారార్థం...

యేసుక్రీస్తు జననం ప్రజలందరికీ కలిగిన శుభ వర్తమానం. ఆయన మరణం ప్రజలందరికీ కలిగిన ముక్తి మార్గం. మన వంటి నరుడు మనలను ప్రేమించిన ఎడల మన వలన ఏదో ఒక లాభం కోరుతారు. కానీ మనలాంటి నరుల పాపపరిహారార్థం యేసుక్రీస్తు ప్రాణం పెట్టాడు. ఆయన లాంటి పుణ్యుడు కేవలం మానవాతీతుడు కాబట్టి ఆ పుణ్యుడు ప్రాణం పెట్టినరోజు అయిన శుక్రవారం 'మంచి శుక్రవారం' (గుడ్ ఫ్రైడే)గా క్రైస్తవులు జరుపుకొంటున్నారు.

యేసుక్రీస్తు తన 30వ యేట నుంచి దైవ కార్యం నిమిత్తం, శారీరక బాధలతో నలిగిపోతున్న అనారోగ్యవంతులను స్వస్థపరిచాడు. చరిత్రలో కనీ వినీ ఎరుగని రీతిలో చనిపోయిన మనుషులను బ్రతికించాడు. ఆ విధంగా దైవ కుమారునిగా ప్రత్యక్షపరుచుకున్నాడు.

కానీ ఓర్వలేని మత ఛాందసవాద మత పెద్దలు 'దైవ కుమారుడు అంట, యూదుల రాజు అంటున్నాడు' అని, ఆయన 12 మంది శిష్యులలో ఒక్కడైన యూదా ఇస్కరియోతుకు 30 వెండి నాణాలు ఇచ్చి ఆయన జాడ తెలుసుకుని, రోమా అధికారులకు అప్పగించి, తప్పుడు నేరాలు మోపి నేరస్థులకు విధించు 'సిలువ' అనే శిక్షను విధించేలా చేశారు. యేసుక్రీస్తుకు మోయలేని మ్రానుభుజము మీద పెట్టి, ముళ్ల కిరీటం తలపై పెట్టారు. రక్తం ఓ ప్రక్క కారుతున్న తరుణంలో చిరక అను చేదును దాహమునకు ఇవ్వగా యేసుక్రీస్తు త్రాగలేదు. చివరకు పాప పరిహారార్థం దేవునికి తన ఆత్మను (ప్రాణాన్ని) సిలువపై అప్పగించి ఆరోహణమయ్యాడు. దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడయ్యాడని బైబిల్ చెప్తుంది.

యేసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను క్రీస్తు చనిపోయిన శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు చర్చిలలో విశ్వాసులు (శిష్యులు, క్రైస్తవులు) ధ్యానిస్తారు. 'ప్రభువా! మమ్మును కనికరించి నీ రాజ్యములో చేర్చుకో' అంటూ 40 దినముల ఉపవాసంతో (శ్రమ దినాలు) ప్రార్థనలు చేస్తారు.

– బి.బి. చంద్రపాల్ కోట
(నేడు గుడ్ ఫ్రైడే)

ఆరోగ్య తెలంగాణగా అవతరించాం: కేసీఆర్

- ప్రజలంతా ఆయురారోగ్యాలతో జీవించాలి
- ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సీఎం ఆకాంక్ష



సాక్షి, హైదరాబాద్: ప్రజారోగ్య పరిరక్షణ, వైద్యారోగ్య రంగం అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపట్టిన పటిష్టమైన చర్యలతో రాష్ట్రం 'ఆరోగ్య తెలంగాణ'గా అవతరించిందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం 'ప్రపంచ ఆరోగ్య దినోత్సవం'నేపథ్యంలో రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే కరువైన ఉమ్మడి పాలన నాటి గడ్డు పరిస్థితుల నుంచి నేడు జిల్లాకో వైద్యవిద్య, పారా మెడికల్, నర్సింగ్ కాలేజీలను స్థాపించుకునే దశకు చేరుకున్నామని పేర్కొన్నారు.

దేశానికే స్ఫూర్తిగా నిలిచాం

తెలంగాణ వైద్యారోగ్య రంగంలో సాధించిన ప్రగతి దేశంలోని ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని.. మెడికల్ సీట్ల పెంపు, ప్రభుత్వ దవాఖానాలు, మెడికల్, నర్సింగ్ కాలేజీల్లో సిబ్బంది నియామకం ద్వారా వైద్యం సామాన్యుడికి చేరువైందని కేసీఆర్ వివరించారు. హైదరాబాద్, వరంగల్ సహా ముఖ్య పట్టణాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణంతో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందబోతోందని తెలిపారు. కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు, ఆరోగ్యలక్ష్మి, అమ్మఒడి, ఆరోగ్య మహిళ (ప్రత్యేక మహిళా క్లినిక్‌లు), బస్తీ/పల్లె దవాఖానాలు, తెలంగాణ డయాగ్నస్టిక్స్, ఆరోగ్యశ్రీ, ఉచిత డయాలసిస్, కంటి వెలుగు వంటి సంక్షేమ పథకాలు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్రం ప్రకటించిన అన్ని ఆరోగ్య సూచికల్లో తెలంగాణ జాతీయస్థాయి కంటే మెరుగ్గా ఉండటం స్వరాష్ట్ర ఘనతను చాటుతున్నాయన్నారు. రానున్న రోజుల్లోనూ ఇదే ఒరవడి కొనసాగిస్తామన్నారు.

కరెంటోళ్ల సమ్మెపై జోక్యం చేసుకోండి

- మధ్యవర్తిత్వం వహించి రాజీ కుదర్చండి
- సంఘాలతో ఉమ్మడి సమావేశానికి ఏర్పాట్లు చేయండి
- ఆర్థిక పరిస్థితికి లోబడి డిమాండ్లను పరిష్కరిస్తాం
- కార్మిక శాఖ కమిషనర్‌కు తెలంగాణ ట్రాన్స్‌కో లేఖ



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగుల సమ్మె నోటీసుపై జోక్యం చేసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖను తెలంగాణ ట్రాన్స్‌కో కోరింది. ఈ మేరకు పరస్పర ఆమోదయోగ్య పరిష్కారం కోసం విద్యుత్ సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగ సంఘాలతో చర్చలకు సంయుక్త సమావేశానికి ఏర్పాట్లు చేయాలని తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్‌కు గురువారం లేఖ రాశారు. వేతన సవరణ, ఇతర డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఈ నెల 17న ఉదయం 8 గంటల నుంచి సమ్మెకు దిగుతామని హెచ్చరిస్తూ తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఇటీవల యాజమాన్యాలకు నోటీసులు అందజేసిన విషయం తెలిసిందే. విద్యుత్ ఉద్యోగులు సమ్మెకు దిగితే ప్రజలు తీవ్ర అసౌకర్యాలకి గురి అవుతారని, సమ్మెకు వెళ్లకుండా వారితో రాజీ కుదర్చాలని కార్మిక శాఖ కమిషనర్‌ను తాజా లేఖలో ట్రాన్స్‌కో సీఎండీ కోరారు.

మళ్లీ చర్చలకు సిద్ధం..

విద్యుత్ ఉద్యోగుల జేఏసీలతో ఇప్పటికే ఐదు దఫాలుగా చర్చలు జరిపి 6శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ అమలుకు హామీ ఇచ్చామని ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు తెలిపారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత 2014, 2018లో వరుసగా 30శాతం, 35శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయడం, సర్వీసు వెయిటేజీ, ఇతర ప్రయోజనాలను కల్పించడంతో ఉద్యోగుల వ్యయం గణనీయంగా పెరిగిందన్న అంశాన్ని సైతం జేఏసీలకు తెలియజేశామన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ఇతర రాష్ట్రాల్లోని విద్యుత్ సంస్థలతో పోల్చితే రాష్ట్ర విద్యుత్ సంస్థల ఉద్యోగుల జీతాలు, ఇతర ప్రయోజనాలు అధికంగా ఉన్నట్టు జేఏసీలకు వివరించినట్టు పేర్కొన్నారు. యాసంగి పంటల సాగు, పదో తరగతి వార్షిక పరీక్షలు, టీఎస్‌పీఎస్సీ పోటీ పరీక్షల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ప్రజలను తీవ్ర అసౌకర్యానికి గురి చేస్తాయని జేఏసీలకు వివరించామన్నారు. తదుపరి చర్చలకు యాజమాన్యాలు సిద్ధంగా ఉన్నాయని, సమ్మె పిలుపును ఉపసంహరించుకోవాలని కోరుతూ ఇటీవల తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీకి లేఖ సైతం రాసినట్టు ప్రభాకర్‌రావు వెల్లడించారు. విద్యుత్ సంస్థల ఆర్థిక పరిస్థితికి లోబడి డిమాండ్ల పరిష్కారానికి మళ్లీ చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నామని, మధ్యవర్తిత్వం వహించి చర్చలకు ఏర్పాట్లు చేయాలని కార్మికశాఖ కమిషనర్‌ను కోరారు.

విద్యుత్ సమ్మె తథ్యం

- తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగులు ఆత్మస్థైర్యంతో ఈ నెల 17 నుంచి సమ్మెకు సిద్ధం కావాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, కన్వీనర్లు సాయిబాబు, రత్నాకర్‌రావు పిలుపునిచ్చారు. సమ్మెలపై నిషేధాలు, చట్టాల పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తూ విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ఎదురుదాడికి దిగాయని దుయ్యబట్టారు. సమ్మె తథ్యమని, వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. సమ్మెలపై నిషేధం అమల్లో ఉందని హెచ్చరిస్తూ జేఏసీకి ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు లేఖ రాయడాన్ని ఖండిస్తూ గురువారం ఒక ప్రకటనను విడుదల చేశారు. అత్యవసర సేవలైనందున విద్యుత్ సంస్థల్లో ప్రతి 6 నెలలకోసారి సమ్మెలపై నిషేధాన్ని పొడిగించడం ఆనవాయితీ అని, ఏ రోజూ ఈ ఉత్తర్వులను ఉద్యోగులు అతిక్రమించలేదని గుర్తుచేశారు. పీఆర్సీ అమలుపై ఏడాదిగా కాలయాపన చేస్తూ ఇప్పుడు పరీక్షా సమయం, యాసంగి కాలం అని పేర్కొనడం సరికాదన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ విద్యుత్ ఉద్యోగులకు జీతాలు ఎక్కువ అని యాజమాన్యాలు పేర్కొనడం అన్యాయమన్నారు. గుజరాత్‌లో ఉద్యోగుల జీతాలు ఇక్కడి కంటే అధికమని పేర్కొన్నారు. 23 వేల మంది ఆర్టిజన్లు తక్కువ వేతనాలతో శ్రమ దోపిడీకి గురవుతున్నారని, వారికికూడా న్యాయం చేయాలన్నారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు మెరుగైన పీఆర్సీ వర్తింపజేయాలని, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ సదుపాయం, ఆర్టిజన్ల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో 17 నుంచి సమ్మె తథ్యమన్నారు. సమ్మెతో వినియోగదారులు, రైతులు, పరిశ్రమలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు.

25 నుంచి ఆర్టిజన్ల సమ్మె

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్లుగా విలీనమైన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 25వ తేదీ ఉదయం 8 గంటల నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నామని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రకటించింది. ఈ మేరకు విద్యుత్ సంస్థల యాజమాన్యాలకు గురువారం సమ్మె నోటీసులు జారీ చేసింది. ఆర్టిజన్ల సమస్యల పరిష్కారానికి దీర్ఘకాలంగా పోరాడుతున్నా ఫలితం లేకపోవడంతో సమ్మె బాట పట్టాలని నిర్ణయించినట్టు యూనియన్ అధ్యక్షుడు కె.మధుకుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్.సాయిలు తెలిపారు.

10, 11 తేదీల్లో ఆసుపత్రుల్లో మాక్ డ్రిల్

- కరోనా కేసులు పెరుగుతుండటంతో సర్కార్ అప్రమత్తం
- అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిర్వహణ



శ్రీనివాసరావు

సాక్షి, హైదరాబాద్: దేశ విదేశాల్లో కరోనా కేసులు పెరుగుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది. కేంద్ర ప్రభుత్వం సూచన మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో కోవిడ్ మాక్ డ్రిల్ నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ నెల 10, 11 తేదీల్లో కోవిడ్ నియంత్రణ ఏర్పాట్లపై పరిశీలన చేసే నిమిత్తం మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు గురువారం ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. వార్డుల్లో పడకలు, ఆక్సిజన్ వసతి, ఐసీయూలు, టెస్టింగ్ కిట్ల నిల్వ, మందులు వంటి వాటిపై ఈ డ్రిల్ ఉంటుంది. అన్ని రకాల వసతులు ఉన్నాయో లేదో మాక్ డ్రిల్‌లో పరిశీలించి, ఎక్కడైనా లోటుపాట్లు ఉన్నట్లు గుర్తిస్తే వాటిని సరిదిద్దుతారు. కావాల్సిన సదుపాయాలు సమకూర్చుతారు. మిషన్లు, పరికరాలు, వెంటిలేటర్లు, ఆక్సిజన్‌ప్లాంట్లు తదితర వాటి పనితీరును పరిశీలిస్తారు. మాక్ డ్రిల్ కోసం ప్రతి జిల్లాకు ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమిస్తారు.

మాక్ డ్రిల్‌లో ఏం చేస్తారంటే..

అన్ని ఆసుపత్రుల్లో ఐసోలేషన్, ఆక్సిజన్, ఐసీయూ బెడ్లతో పాటు వెంటిలేటర్లు ఎన్ని ఉన్నాయి అనేది తనిఖీ చేస్తారు. దీంతో పాటు ఆయా ఆసుపత్రులు, అనుబంధ కేంద్రాల్లో డాక్టర్లు, నర్సులు, పారా మెడికల్, ఆశాలు, అంగన్‌వాడీలు ఎంత మంది ఉన్నారు? అనే వివరాలు సేకరిస్తారు. కరోనా నియంత్రణకు శిక్షణ కలిగిన సిబ్బంది ఉన్నారా? లేదా? అనే వివరాలను కూడా సంబంధిత అధికారుల నుంచి అడిగి తెలుసుకుంటారు. దీంతోపాటు అంబులెన్స్‌లు ఎన్ని ఉన్నాయి? వాటి పరిస్థితిఎలా ఉంది? అనే అంశాలను తనిఖీ చేస్తారు. కాగా, మాక్‌డ్రిల్ నివేదికను జిల్లా వైద్యాధికారులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని శ్రీనివాసరావు ఆదేశించారు.

ఎస్సై దంపతుల ఆత్మహత్య

- ఉరి వేసుకుని భార్య.. సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని భర్త మృతి
- కుటుంబ కలహాలే కారణమంటున్న పోలీసులు
- జనగామలో ఘటన



ఎస్సై శ్రీనివాస్ దంపతులు (ఫైల్)

జనగామ రూరల్: ఆయన ఎస్‌ఐ. ఆమె గృహిణి. కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన భార్య బాత్రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు ఒకవైపు విచారణ చేస్తుండగానే బాత్రూమ్‌కు వెళ్లొస్తానని వెళ్లిన ఎస్‌ఐ తన సర్వీస్ రివాల్వర్‌తో పాయింట్ బ్లాంక్‌లో కాల్చుకున్నాడు. ఇలా గంటల వ్యవధిలోనే ఇద్దరు దంపతులు చనిపోయిన ఘటన గురువారం జనగామలో కలకలం రేపిన ఘటన పూర్వాపరాలిలా.. స్టేషన్ ఘన్‌పూర్ ఎస్సైగా పనిచేస్తున్న కాసర్ల శ్రీనివాస్(53) కొంతకాలంగా ఘన్‌పూర్‌కు అటాచ్‌గా జనగామలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. భార్య స్వరూప(50)తో జనగామలో ఉంటున్న శ్రీనివాస్ బుధవారం రాత్రి విధులు ముగించుకుని వచ్చి పడుకున్నారు. రోజూ మాదిరిగా గురువారం ఉదయం 7 గంటలకు బండారి లక్ష్మణ్ అనే పాలు పోసే వ్యక్తి డోర్ కొట్టగా ఎంతకూ తెరవకపోవడంతో పక్కింటి వారితో కలిసి ఇంటి వెనకవైపు డోర్ వద్దకు వెళ్లేసరికి బయట ఉన్న బాత్రూంలో స్వరూప చీరతో ఉరివేసుకుని కనిపించింది. వెంటనే నిద్రపోతున్న ఆమె భర్త ఎస్‌ఐ శ్రీనివాస్‌ను లేపి విషయం చెప్పారు. ఈలోగా డీసీపీ సీతారాం, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు.

బాత్రూమ్‌కు వెళ్లొస్తానని వెళ్లి..

విచారణలో భాగంగా ఎస్‌ఐ శ్రీనివాస్ సెల్‌ఫోన్‌ను, ఇతర వస్తువులను ఏసీపీ దేవేందర్‌రెడ్డి.. స్వాధీనం చేసుకున్నారు. ఎలా చనిపోయిందని విచారిస్తున్న క్రమంలో శ్రీనివాస్ వాష్ రూమ్‌కు వెళ్లొస్తానని చెప్పి బెడ్‌రూంలోని అటాచ్డ్ బాత్రూంలోనికి వెళ్లాడు. తన సర్వీస్ రివాల్వర్‌తో తల కణతపై పాయింట్ బ్లాంక్‌లో కాల్చుకున్నాడు. ఒక్కసారిగా శబ్దం రావడంతో ఏసీపీ వెళ్లి చూడగా బాత్రూంలో శ్రీనివాస్ రక్తపు మడుగులో కుప్పకూలి ఉన్నాడు. రివాల్వర్ పక్కన పడి ఉంది. ఒకటే రౌండ్ కాల్చుకున్నట్లు గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో రూ.6లక్షలు చెల్లింపు

మూడు నెలల క్రితం జమ్మికుంటకు కారులో వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. కేసు కావడంతో రూ.6లక్షల వరకు పరిహారం చెల్లించారు. ఈ విషయంలో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతోపాటు మరికొన్ని కుటుంబ కలహాలు జరుగుతున్నట్లు తెలిపారు. కుమారులు, తండ్రి మధ్య భేదాభిప్రాయాలుకూడా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. కాగా, పోలీసులు వచ్చిన గంట తరువాత రివాల్వర్‌ను ఎందుకు స్వాధీనం చేసుకోలేదన్న వాదన వినిపిస్తోంది. రివాల్వర్‌ను వెంటనే తీసుకుంటే ఎస్‌ఐ కాల్చుకునే అవకాశం ఉండకపోయేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాత్రి ఇద్దరికీ గొడవ జరిగింది: డీసీపీ సీతారాం

డీసీపీ సీతారాం మీడియాతో మాట్లాడుతూ బుధవారం రాత్రి కుటుంబ వ్యవహారాలు, కొంత ఆర్థిక కారణాలతో గొడవ జరిగిన విషయం వాస్తవమేన్నారు. పూర్తి విచారణ జరిగాక విషయలు వెల్లడిస్తామని తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్, పోలీస్ అధికారులు శ్రీనివాస్ భౌతికకాయానికి నివాళులర్పించారు.

ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి



ఖమ్మం వ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ మిర్చి యార్డు గురువారం మిర్చి బస్తాలతో నిండిపోయిది. ధర ఆశాజనకంగా ఉండడం, శుక్రవారం నుంచి వరుసగా మూడు రోజుల సెలవులు రానుండడంతో రైతులు మిర్చి అమ్మకానికి మొగ్గు చూపారు. దీంతో గురువారం మార్కెట్‌కు 53,284 బస్తాల మిర్చి విక్రయానికి రాగా.. క్వింటాకు గరిష్టంగా రూ.23,800 ధర నమోదైంది. ఇక మోడల్ ధర రూ.21 వేలు, కనిష్ట ధర రూ.17వేలుగా పలికింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, నల్లగొండ, హన్మకొండ జిల్లాలే కాక పొరుగున ఉన్న ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాల రైతులు కూడా మిర్చి అమ్మకానికి తీసుకొచ్చారు.

మొదటి తూటాకైనా.. మొదటి లాఠీ దెబ్బకైనా రెడీ

- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులు, నిరుద్యోగుల కోసం దేనికైనా సిద్ధంగా ఉంటామని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి తెలిపారు. విద్యార్థుల కోసం మొదటి తూటాకైనా..మొదటి లాఠీ దెబ్బకైనా రెడీ అంటూ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వార్థ రాజకీయాల కోసం బీజేపీ-బీఆర్ఎస్ విద్యార్థు ల జీవితాలతో చెలగాటమాడుతున్నా యని మం డిపడ్డారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని తెలిపారు. కాగా, టెన్త్ పేపర్ల లీకేజీపై ఎస్సెస్సీ బోర్డు వద్ద నిరసన ప్రదర్శన చేపట్టిన సందర్భంగా అరెస్టయిన శివసేనారెడ్డి, ఇతర నేతలు గురువారం బెయిలుపై విడుదలయ్యారు.



జైలు నుంచి విడుదలైన తర్వాత ర్యాలీగా వస్తున్న శివసేనారెడ్డి, ఇతర నేతలు

నిఖత్ జరీన్‌కు డీజీపీ అభినందన



నిఖత్‌ను సత్కరిస్తున్న డీజీపీ అంజనీకుమార్

సాక్షి, హైదరాబాద్/ నాగారం: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ 50 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని గెలిచిన నిఖత్ జరీన్‌ను డీజీపీ అంజనీకుమార్ అభినందించారు. గురువారం బీఆర్‌కేఆర్‌భవన్‌లో నిఖత్ జరీన్ సీఎస్ శాంతి కుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఒక సమావేశంలో పాల్గొనడానికి అక్కడకు వచ్చిన డీజీపీ అంజనీకుమార్ ఈ సందర్భంగా నిఖత్ జరీన్‌ను అభినందించి శాలువా కప్పి సత్కరించారు. యువ క్రీడాకారులకు జరీన్ ఆదర్శంగా నిలిచారని డీజీపీ పేర్కొన్నారు.

26న కృష్ణా బోర్డు సమావేశం

సాక్షి, హైదరాబాద్: కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశం ఈ నెల 26న ఉదయం 11 గంటలకు జలసౌధలో జరగనుంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. శ్రీశైలం, సాగర్ జలాశయాల నిర్వహణకు సంబంధించిన విధివిధానాల ఖరారు, రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల తాత్కాలిక పంపకాలు, వినియోగం తదితర అంశాలపై ఈ భేటీలో చర్చించనున్నారు.

ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ఫలితాలు విడుదల

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం పరీక్షల ఫలితాలను కాళోజీ ఆరోగ్య వైద్య విశ్వవిద్యాలయం గురువారం విడుదల చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు నిర్వహించగా.. రెగ్యులర్ పరీక్షల్లో మొత్తం 77.00% ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 127 మందికి డిస్టింక్షన్ రాగా.. 2240 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో నిలిచారు. మిగిలిన 1767 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 5369 మంది విద్యార్థులు హాజరు కాగా 4134 మంది ఉత్తీర్ణత సాధించారని విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ వై.మల్లేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో www.knruhs.telangana.gov.inలో చూడాలని సూచించారు.

క్లుప్తంగా...

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు..

కాంగ్రెస్ రెండో జాబితా విడుదల

బనశంకరి: కర్ణాటక అసెంబ్లీకి మే 10వ తేదీన జరగనున్న ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ మరో 42 మంది అభ్యర్థులతో గురువారం రెండో జాబితా విడుదల చేసింది. పార్టీ సీనియర్ నేత, మాజీ సీఎం సిద్దరామయ్య వరుణ సీటుతో పాటు మరో చోటు నుంచి పోటీకి దిగుతారని భావిస్తున్న కోలారు స్థానం ఇందులో లేవు! ముగ్గురు సిట్టింగ్‌లకు టికెట్లు దక్కలేదు. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురికీ చోటు దక్కింది. 124 మందితో కాంగ్రెస్ ఇప్పటికే తొలి జాబితా విడుదల చేయడం తెలిసిందే.

జైన్‌కు దొరకని బెయిల్

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టేసింది. ఆయనకు బెయిలిస్తే సాక్ష్యాధారాలను తారుమారు చేసే ఆస్కారముందని న్యాయమూర్తి జస్టిస్ దినేశ్ కుమార్ శర్మ అభిప్రాయపడ్డారు. ఆయన సహ నిందితులు వైభవ్ జైన్, అన్కుష్ జైన్ బెయిల్ పిటిషన్లనూ కొట్టేశారు. జైన్‌ను ఈడీ 2022 మే 3న అరెస్ట్ చేయడం తెల్సిందే.

కాంగ్రెస్ సీనియర్ నేత ఆంటోనీ కొడుకు బీజేపీలోకి

న్యూఢిల్లీ: సీనియర్ కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ రక్షణ మంత్రి ఏకే ఆంటోనీ కుమారుడు అనిల్ ఆంటోనీ కాషాయ కండువా కప్పుకున్నారు. కేరళ కాంగ్రెస్ డిజిటల్ మీడియా హెడ్‌గా చేసిన ఆయన, ప్రధాని మోదీపై బీబీసీ డాక్యుమెంటరీ విషయంలో పార్టీ వైఖరిని విమర్శిస్తూ జనవరిలో రాజీనామా చేశారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయెల్, వి.మురళీధరన్ సమక్షంలో బీజేపీలో చేరారు. కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియాగాంధీకి అతి సన్నిహితుడిగా పేరున్న ఆయన తండ్రి ఏకే ఆంటోనీ ఈ పరిణామంపై విచారం వెలిబుచ్చారు. అనిల్ చేరికతో కేరళలో క్రైస్తవుల్లో పట్టు పెరుగుతుందని బీజేపీ భావిస్తోంది.

స్పేస్ పాలసీకి ఆమోదం

న్యూఢిల్లీ: ఇండియన్ స్పేస్ పాలసీ–2023కు కేంద్ర మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. ఇస్రో, న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్‌తో పాటు ఈ రంగంలోని ప్రైవేట్ సంస్థల పోషించాల్సిన పాత్ర, నెరవేర్చాల్సిన బాధ్యతలను ఈ పాలసీ కింద రూపొందించారు. సహజ వాయువు, సీఎన్‌జీ, పైప్డ్ కుకింగ్ గ్యాస్ ధరలపై నియంత్రణకు నూతన ప్రైసింగ్ ఫార్ములానూ కేబినెట్ ఆమోదించింది. దీనిప్రకారం దేశంలో పాత క్షేత్రాల నుంచి వెలికితీసే సహజ వాయువు (ఏపీఎం గ్యాస్) ధరలే ఇకపై ముడిచమురు ధరలకు సూచికగా ఉంటాయి. ఇప్పటిదాకా అమెరికా, రష్యా చమురు ధరల ఆధారంగా మన దేశంలో ధరలను నిర్ణయిస్తున్నారు.



అవినీతి అక్రమాలకు పాల్పడి, న్యాయస్థానంలో నేర విచారణను ఎదుర్కొంటున్న మొట్టమొదటి అమెరికా మాజీ అధ్యక్షుడిగా అపకీర్తిని మూటగట్టుకున్న డొనాల్డ్ ట్రంప్ మళ్లీ దేశాధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టాలని ఉవ్విళ్లూరుతున్నారు. 2024లో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున తానే బరిలో ఉంటానని సంకేతాలిస్తున్నారు. అసలు అది సాధ్యమేనా అన్న చర్చ ప్రపంచమంతటా సాగుతోంది. ట్రంప్‌పై నమోదైన హష్ మనీ చెల్లింపుల కేసులో ఇకపై ఏం జరగవచ్చన్న దానిపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ట్రంప్‌పై కోర్టులో విచారణ ప్రారంభం కావడానికి చాలా సమయం పడుతుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. అంతకంటే ముందే కేసులను కొట్టివేయించేందుకు ట్రంప్ న్యాయబృందం ప్రయత్నాలకు పదును పెడుతోంది. ఈ నేపథ్యంలో ఈ కేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉండొచ్చన్నది ఆసక్తికరంగా మారింది...

సాక్షి, నేషనల్ డెస్క్

ట్రంప్ కేసు దారెటు!?

గాగ్ ఆర్డర్ ఇస్తారా?

- డొనాల్డ్ ట్రంప్‌పై తీవ్రమైన అభియోగాలు వచ్చాయని, అవి నిరూపితమైతే ఆయనకు గరిష్ట స్థాయిలో జైలుశిక్ష పడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు.
- న్యాయమూర్తులపై ట్రంప్ అవాకులు చెవాకులు పేలుతున్నారు. న్యూయార్క్ సుప్రీంకోర్టు జడ్జి జువాన్ మెర్చాన్, మన్‌హట్టన్ జిల్లా అటార్నీ అల్విన్ బ్రాగ్‌పై విరుచుకుపడ్డారు.
- ట్రంప్ మంగళవారం మన్‌హట్టన్ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అనుచరులు హంగామా సృష్టించారు. ఇదంతా న్యాయస్థానానికి చికాకు తెప్పించింది.
- సమాజంలో హింసను ప్రేరేపించే, అశాంతిని సృష్టించే, ప్రజల భద్రతకు భంగం కలిగించే వ్యాఖ్యలకు, ప్రవర్తనకు దూరంగా ఉండాలని ట్రంప్‌కు సుప్రీం కోర్టు న్యాయమూర్తి మెర్చాన్ హితవు పలికారు.
- ఇది జరిగిన ఐదు గంటల తర్వాత ట్రంప్ నోరు పారేసుకున్నారు. జువాన్ మెర్చాన్, అల్విన్ బ్రాగ్‌పై విమర్శలు ఎక్కుపెట్టారు.
- మెర్చాన్, ఆయన భార్య, ఆయన కుటుంబం తనను ద్వేషిస్తోందని ఆరోపించారు. ఇక అల్విన్ బ్రాగ్ ఒక విఫలమైన జిల్లా అటార్నీ అని ఆక్షేపించారు. ఆయనపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అల్విన్ బ్రాగ్ ఒక జంతువు, మానసిక రోగి అని ట్రంప్ మండిపడ్డారు.
- ట్రంప్ నోటికి తాళం వేసేందుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జువాన్ మెర్చాన్ గాగ్ ఆర్డర్ జారీ చేసే అవకాశం కనిపిస్తోంది.
- గాగ్ ఆర్డర్ జారీ చేస్తే కేసుల గురించి ట్రంప్ గానీ, ఆయన న్యాయబృందం గానీ ఎక్కడా బహిరంగంగా చర్చించకూడదు.
- గాగ్ ఆర్డర్‌ను ఉల్లంఘిస్తే కోర్టు ధిక్కరణగా పరిగణించి కేసు నమోదు చేస్తారు. ట్రంప్‌కు 1,000 డాలర్ల జరిమానా లేదా 30 రోజుల జైలు శిక్ష.. లేదా రెండు శిక్షలూ విధించే అవకాశం ఉంటుంది.

సాక్ష్యాలు అందాక ఏం చేస్తారో?

- ట్రంప్ హష్ మనీ చెల్లించిన కేసులో మన్‌హట్టన్ జిల్లా అటార్నీ కార్యాలయం గత ఐదేళ్లుగా విచారణ కొనసాగిస్తోంది.
- చెల్లింపుల వ్యవహారాన్ని ట్రంప్ ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారని, 2016లో జరిగిన అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారని, ఇది ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందని అల్విన్‌బ్రాగ్ చెబుతున్నారు.
- దర్యాప్తులో భాగంగా తాము సేకరించిన సాక్ష్యాధారాలను ప్రాసిక్యూటర్లు ట్రంప్ న్యాయ బృందానికి అప్పగించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను 'డిస్కవరీ' అంటారు.
- ఇది 35 రోజుల్లోగా పూర్తికావాలి. కానీ, అల్విన్ బ్రాగ్ నేతృత్వంలోని ప్రాసిక్యూటర్ల బృందానికి 65 రోజుల సమయం.. అంటే జూన్ 8 దాకా గడువు ఇచ్చారు. సాక్ష్యాలు చేతికి అందాక ట్రంప్ న్యాయవాదులు ఎలాంటి ఎత్తుగడ వేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

ఇకనైనా నోరు మూసుకోకపోతే గాగ్ ఆర్డర్ తప్పదు

కేసులన్నీ కొట్టివేయించేందుకు ట్రంప్ లాయర్ల యత్నాలు

కోర్టులో తీర్మానాలు ప్రవేశపెట్టాలని నిర్ణయం

తుది తీర్పు వచ్చే నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తి

అధ్యక్ష ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసేందుకు ట్రంప్ ఏర్పాట్లు

ట్రంప్ పోటీ ఖాయమేనా?

- ట్రంప్ లాయర్ల తీర్మానాలపై డిసెంబర్ 4న కోర్టు తీర్పు వెలువడనుంది.
- తీర్మానాలకు వ్యతిరేకంగా తీర్పు వస్తే ట్రంప్‌పై అసలైన విచారణ ప్రారంభమవుతుంది.
- వచ్చే ఏడాది జనవరి నుంచి విచారణ చేపట్టాలని తాము కోర్టును కోరుతామని ప్రాసిక్యూటర్లు చెప్పారు.
- మార్చి నుంచి జూన్ వరకూ అమెరికాలో వసంత కాలం. అప్పుడైతే బాగుంటుందని ట్రంప్ లాయర్లు అభిప్రాయపడుతున్నారు.
- విచారణ మొదలయ్యే నాటికి అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ప్రైమరీ ఎన్నికల్లో ప్రజలు పార్టీల తరఫున పోటీ చేసే నామినీలకు ఓటు వేస్తారు.
- ట్రంప్‌పై విచారణ పూర్తయ్యి, తుది తీర్పు రావడానికి చాలా సమయం పడుతుంది. అప్పటికే ఎన్నికల ప్రక్రియ మొత్తం పూర్తవుతుంది. కొత్త అధ్యక్షుడు కొలువుతీరుతాడు.
- 2024లో జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ నిక్షేపంగా పోటీ చేయొచ్చు. ఏ చట్టమూ ఆయనను అడ్డుకోలేదు.
- రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా వరుసగా మూడోసారి పోటీ చేయడానికి ట్రంప్ ఇప్పటికే ఏర్పాట్లలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.
- ఒకవేళ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక ట్రంప్‌ను కోర్టు దోషిగా తేల్చి, శిక్ష ఖరారు చేస్తే పదవి నుంచి దిగిపోవడమో లేక కోర్టు తీర్పుపై ఉన్నత న్యాయస్థానాల్లో పోరాడడమో చేయాల్సి ఉంటుంది.



కోర్టులో న్యాయవాదులతో ట్రంప్ (ఫైల్)

తీర్మానం ప్రవేశపెడతారా?

- ట్రంప్‌ను అన్ని కేసుల నుంచి నిర్దోషిగా బయటకు తీసుకువస్తామని ఆయన తరఫు లాయర్లు ఇప్పటికే తేల్చిచెప్పారు. అందుకోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు.
- చట్టప్రకారం చూస్తే విచారణ ప్రారంభం కావడానికి ముందు కేసులన్నింటినీ పునఃపరిశీలించి, ఒక నిర్ణయం తీసుకోవాలని కోర్టును అభ్యర్థించే వెసులుబాటు ఉంది. ఈ మేరకు కోర్టులో తీర్మానాన్ని ప్రవేశపెట్టవచ్చు.
- కేసులను పూర్తిగా కొట్టివేయాలని కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టాలని ట్రంప్ బృందం నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ న్యాయస్థానం సానుకూలంగా స్పందిస్తే ట్రంప్‌కు విముక్తి లభించినట్లే. అయితే, ఇదంతా ఆయన లాయర్ల శక్తిసామర్థ్యాలపై ఆధారపడి ఉంటుంది.
- ట్రంప్ కేసులను విచారిస్తున్న జడ్జిని విధుల నుంచి తొలగించాలని, విచారణ వేదికను మన్‌హట్టన్ నుంచి సమీపంలోని స్టాటెన్ ఐలాండ్‌కు మార్చాలని కోరుతూ కూడా తీర్మానాలు ప్రవేశపెట్టేందుకు వీలుంది. మన్‌హట్టన్‌లో ట్రంప్ అభిమానులు పెద్దగా లేరు. అక్కడ విచారణ జరపడం సమంజసం కాదని ఆయన వాదిస్తున్నారు.
- మామూలుగా అయితే 45 రోజుల్లోగా తీర్మానం ప్రవేశపెట్టాలి. ట్రంప్ బృందానికి జడ్జి మెర్చాన్ ఆగస్టు 8 దాకా గడువు ఇచ్చారు. అంటే నాలుగు నెలలు. ట్రంప్ లాయర్ల తీర్మానంపై ప్రాసిక్యూటర్లు స్పందించడానికి సెప్టెంబర్ 19వ తేదీని డెడ్‌లైన్‌గా నిర్దేశించారు.
- తమకు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలూ కచ్చితంగా వాడుకుంటామని, ప్రతి చిన్న అంశాన్ని కూడా సూక్ష్మస్థాయిలో పరిశీలిస్తున్నామని ట్రంప్ న్యాయవాది జోయ్ టాకోపినా చెప్పారు.

బడ్జెట్ సమావేశాలకు తెర

పార్లమెంటు నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలకు గురువారంతో తెర పడింది. అధికార, విపక్షాల పరస్పర డిమాండ్లు, నిరసనలు, గొడవల మధ్య ఏ అంశంపైనా సజావుగా చర్చ జరగకుండానే సమావేశాలు ముగిశాయి. జనవరి 31న మొదలైన బడ్జెట్ సమావేశాల్లో ఆసాంతం అదానీ, రాహుల్ అంశాలే చర్చలో నిలిచాయి. ముఖ్యంగా మార్చి 13న మొదలైన 25 రోజుల రెండో విడత పూర్తిగా వాయిదాలమయంగా సాగింది. అదానీ అవకతవకలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ విచారణకు విపక్షాలు, భారత్‌లో ప్రజాస్వామ్యంపై వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ క్షమాపణకు బీజేపీ పట్టుతో ఉభయ సభలు రోజూ వాయిదా పడుతూ రావడం తెలిసిందే. దాంతో పలు ముఖ్యమైన బిల్లులను చర్చే లేకుండా ఉభయ సభలూ ఆమోదించాల్సి వచ్చింది.

ఎప్పట్లాగే అధికార, విపక్ష సభ్యుల ఆందోళనల కారణంగా గురువారం రాజ్యసభ ఉదయం సమావేశమైన కాసేపటికే మధ్యాహ్నానికి వాయిదా పడింది. తిరిగి సమావేశమయ్యాక, సభా కార్యకలాపాలను వీడియో తీసినందుకు కాంగ్రెస్ ఎంపీ రజనీ అశోక్‌రావ్ పాటిల్‌పై విధించిన సస్పెన్షన్ వర్షాకాల సమావేశాల తొలి వారం దాకా కొనసాగుతుందని చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రకటించారు. అప్పట్లోగా ప్రివిలేజెస్ కమిటీ దీనిపై దర్యాప్తు పూర్తి చేసి తదుపరి తీసుకోవాల్సిన చర్యలను సిఫార్సు చేస్తుందని చెప్పారు. దీన్ని విపక్షాలు తీవ్రంగా నిరసించాయి. బుధవారం విపక్ష నేత మల్లికార్జున ఖర్గే లేవనెత్తిన పాయింటాఫ్ ఆర్డర్‌ను తోసిపుచ్చడాన్ని ఖండించాయి. రానురాను సభలో చర్చకు తావు లేకుండా పోతుండటం ఆందోళనకరమని చైర్మన్ ఆవేదన వెలిబుచ్చారు. ''మనల్ని చూసి ప్రజలు నవ్వుతున్నారు. సభలో మన ప్రవర్తనపై ఆత్మవిమర్శ చేసుకోవాలి. ప్రజల ఆకాంక్షలను ఏ మేరకు నెరవేరుస్తున్నామో ఆలోచించాలి'' అని సూచించారు. అయినా సభ్యుల నిరసనలు నెమ్మదించకపోవడంతో సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. లోక్‌సభ ఉదయం సమావేశమవుతూనే అదానీపై జేపీసీ డిమాండ్‌తో విపక్ష సభ్యులు హోరెత్తించారు. సభ గౌరవాన్ని మంటగలుపుతున్నారంటూ స్పీకర్ ఓం బిర్లా మండిపడ్డారు. సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

- రాజ్యసభ 130 గంటలకు గాను కేవలం 31 గంటలే పని చేసింది.
- తొలి దశ సమావేశాల ఉత్పాదకత 56.3 శాతం కాగా రెండో దశలో ఏకంగా 6.4 శాతానికి పడిపోయింది.
- లోక్‌సభ 133 గంటలకు గాను 45 గంటలే పని చేసింది.
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపైనే 13 గంటలకు పైగా చర్చ సాగింది. బడ్జెట్‌పై చర్చించింది 14.45 గంటలే.
- తొలి దశ సమావేశాలు ఉత్పాదకత 83.8 శాతం కాగా రెండో దశలో కేవలం 5.29 శాతమే.
- ఆర్థిక బిల్లు, కాంపిటీషన్ (సవరణ) బిల్లులను చర్చ లేకుండానే ఉభయసభలూ ఆమోదించాయి.

విపక్షాల ఐక్యతా రాగం

చేతులు కలిపిన 19 పార్టీలు • విజయ్‌చౌక్ దాకా తిరంగా మార్చ్ • బీజేపీతో ప్రజాస్వామ్యానికి ముప్పు

నినాదాలతో హోరెత్తించిన ఎంపీలు	సంయుక్తంగా మీడియా ముందుకు	కలసికట్టుగా లోక్‌సభ ఎన్నికలకు: ఖర్గే	ఐక్యతను ముందుకు తీసుకెళ్తాం: నేతలు	ప్రజాస్వామ్యంపై నిరంతరం పెను దాడి	మోదీ సర్కారుపై నేతల విమర్శల వర్షం

న్యూఢిల్లీ: బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం నిరంతర దాడికి గురవుతోందంటూ కాంగ్రెస్‌తో పాటు 19 విపక్ష పార్టీలు మండిపడ్డాయి. గురువారం బడ్జెట్ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డ అనంతరం పార్లమెంటు ప్రాంగణం నుంచి విజయ్ చౌక్ దాకా 'తిరంగా మార్చ్' పేరిట నిరసన ర్యాలీ జరిపాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్‌ఎస్, డీఎంకే, సమాజ్‌వాదీ, ఆర్జేడీ, ఆప్, ఎన్సీపీ, శివసేన (యూబీటీ), వామపక్షాలు, ఐయూఎంఎల్, ఆరెస్పీ తదితర పార్టీలు ఇందులో పాల్గొన్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సారథ్యంలో సోనియాగాంధీతో పాటు ఎంపీలంతా త్రివర్ణ పతాకం చేబూని నినాదాలు చేస్తూ సాగారు. తమ ఐక్యతను పటిష్టపరుచుకుంటూ మోదీ సర్కారుపై పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని వారంతా ప్రకటించడం విశేషం! విపక్షాల ఐక్యతను మరింత ముందుకు తీసుకెళ్లడమే గాక వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ ఉమ్మడిగా పోరాడతామని ఖర్గే ఈ సందర్భంగా ప్రకటించారు. అదానీ ఉదంతం, కులగణన ఎన్నికల్లో విపక్షాలకు ప్రధానాంశాలుగా మారతాయా అని ప్రశ్నించగా అన్ని పార్టీల అధ్యక్షులూ చర్చించుకుని వాటిపై నిర్ణయానికి వస్తారని బదులిచ్చారు. కులగణన తమ ఎజెండాలో అతి ముఖ్యమైన అంశమన్నారు. లోక్‌సభ స్పీకర్ ఇచ్చిన మర్యాదపూర్వక విందును విపక్ష నేతలు సంయుక్తంగా బహిష్కరించారు. తర్వాత కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో 19 పార్టీల నేతలూ సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు! మోదీ సర్కారుది అహంభావపూరిత వైఖరి అంటూ దుయ్యబట్టారు. అదిలాగే కొనసాగితే దేశం పూర్తిస్థాయి నియంతృత్వంలో మగ్గిపోతుందన్నారు. కొంతకాలంగా కాంగ్రెస్‌తో వేదిక పంచుకోవడానికి ఇష్టపడని తృణమూల్, బీఆర్‌ఎస్, ఆప్, సమాజ్‌వాదీ పార్టీ కూడా ర్యాలీలోనూ, మీడియా సమావేశంలోనూ కలిసి పాల్గొనడం విశేషం! బడ్జెట్ సమావేశాలు ఆసాంతం ప్రభుత్వంపై విపక్షాలు సమైక్యంగా పోరాడుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా మార్చి 13న రెండో విడత సమావేశాలు మొదలైనప్పటి నుంచీ సంయుక్తంగా నిరసనలు, ర్యాలీలతో హోరెత్తిస్తున్నాయి.

మాటల్లోనే ప్రజాస్వామ్యం: ఖర్గే

రాజ్యాంగం, న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే తామంతా పోరాడుతున్నామని ఖర్గే ప్రకటించారు. మోదీ సర్కారు ప్రవచిస్తున్న ప్రజాస్వామ్య స్ఫూర్తి మాటలకే పరిమితమవుతోందని మండిపడ్డారు. ''అదానీ అవినీతిపై బదులివ్వాల్సి వస్తుందనే భయంతో బడ్జెట్ సమావేశాలు తుడిచిపెట్టుకుపోవాలని బీజేపీ ఆశించింది. అందుకు విపక్షాలను బాధ్యులను చేయజూడటం దారుణం. రూ.50 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌ను కేవలం 12 నిమిషాల చర్చతో ఆమోదించడమా? సభల్లో ఎన్నిసార్లు నోటీసులిచ్చినా విపక్షాలకు మాట్లాడే అవకాశమే ఇవ్వలేదు. ఇలా జరగడం నా 52 ఏళ్ల ప్రజా జీవితంలో తొలిసారి. 19 విపక్షాల్లో 18 పార్టీలు అదానీ అంశంపై కేంద్రాన్ని నిలదీశాయి. ఆయన సంపద కేవలం రెండున్నరేళ్లలో రూ.12 లక్షల కోట్లకు ఎలా పెరిగిందో చెప్పాలని పట్టుబట్టాయి. సభలో బీజేపీదే పూర్తి మెజారిటీ. జేపీసీ వేసినా ఎక్కువ మంది వాళ్లే ఉంటారు. అయినా విచారణకు వెనకాడుతున్నారంటే దాల్ మే కుఛ్ కాలా హై'' అన్నారు. అదానీతో మోదీకి, బీజేపీకి అక్రమ బంధం ఉందని ఆరోపించారు. ''రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష పడగానే వాయువేగంతో ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేశారు. కానీ బీజేపీ అమ్రేలీ ఎంపీకి మూడేళ్ల జైలు శిక్ష పడి 16 రోజులైనా ఆయనపై వేటు వేయలేదు'' అని మండిపడ్డారు.



పార్లమెంట్ నుంచి విజయ్‌చౌక్ దాకా విపక్ష ఎంపీల ర్యాలీ. (ఇన్‌సెట్లో) విపక్ష నేతల ప్రెస్‌మీట్

> విపక్షాలన్నీ విభేదాలను పక్కన పెట్టి ఒక్కతాటిపైకి వస్తున్నాయి. మా ఐక్యతను ఇప్పుడు దేశమంతా చూస్తోంది. మేం నానాటికీ బలపడుతున్నాం. మమ్మల్ని విడదీసేందుకు బీజేపీ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీన్నెలా ముందుకు తీసుకెళ్లాలో అంతా కలిసి నిర్ణయించుకుంటాం. విపక్ష కూటమికి ఎవరు నాయకత్వం వహించాలన్నది ప్రశ్న కాదు - కె.కేశవరావు, బీఆర్‌ఎస్

> కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించినా ఊరుకుంటామేమో గానీ అదానీపై నిలదీస్తే మాత్రం సహించబోమని బీజేపీ తన ప్రవర్తనతో రుజువు చేసింది. - సంజయ్‌సింగ్, ఆప్

> భారత్ జోడో యాత్ర విజయవంతం కావడంతో రాహుల్‌గాంధీని చూసి బీజేపీ భయపడుతోంది. అధికార పక్ష సభ్యులు సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించడాన్ని తొలిసారిగా చూశాం - టి.ఆర్.బాలు, డీఎంకే

కెనడాలో ఆలయం వద్ద విద్వేష ఘటన

టొరొంటో: హిందూ వ్యతిరేక శక్తులు కెనడాలో మరోసారి దుశ్చర్యకు పాల్పడ్డాయి. ఒంటారియో ప్రావిన్స్‌లోని విండ్సర్ నగరంలోని బాప్స్ స్వామినారాయణ ఆలయ గోడపై భారత్‌కు, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా రాతలు రాశారు. ఇందుకు పాల్పడ్డవారి కోసం గాలిస్తున్నట్టు పోలీసులు చెప్పారు. దీన్ని ఒట్టావాలోని భారత హైకమిషన్ తీవ్రంగా ఖండించింది. జనవరిలో సైతం కెనడాలో ఇలాంటి ఘటనే జరిగింది. ఒంటారియో ప్రావిన్స్‌లోని బ్రాంప్టన్ నగరంలోని గౌరీశంకర్ ఆలయంపై భారత వ్యతిరేక రాతలు రాశారు. గతేడాది సైతం కెనడాలో ఇలాంటి మూడు ఘటనలు జరిగాయి. కెనడా గణాంకాల ప్రకారం 2019–2021 మధ్య మత, లింగ, జాతివిద్వేష నేరాలు 72 శాతం పెరిగాయి. కెనడా జనాభాలో 4 శాతమున్న భారతీయుల్లో ఇవి అభద్రతను పెంచుతున్నాయి. ఈ శక్తులకు అడ్డుకట్టవేయాలని కెనడా సర్కార్‌ను భారత్ కోరింది.

ఐరాస స్టాటిస్టికల్ కమిషన్‌కు భారత్ ఎన్నిక

ఐక్యరాజ్యసమితి: ఐక్యరాజ్యసమితి అత్యున్నత గణాంకాల విభాగం యూఎన్ స్టాటిస్టికల్ కమిషన్‌కు రెండు దశాబ్దాల తర్వాత భారత్ ఎన్నికైంది. రహస్య బ్యాలెట్ ఓటింగ్‌లో జరిగిన హోరాహోరీ పోరులో నెగ్గింది. యూఎన్ ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్ భారత్ యూఎన్ స్టాటిస్టికల్ కమిషన్ మెంబర్‌గా, నార్కోటిక్ డ్రగ్స్ కమిషన్‌గా, ప్రోగ్రామ్ కో ఆర్డినేటింగ్ బోర్డ్ ఆఫ్ జాయింట్ యూఎన్ ప్రోగ్రామ్ ఆన్ ఎయిడ్స్‌గా ఎన్నికైంది.

'ఆక్స్‌ఫాం'పై దర్యాప్తుకు కేంద్రం సిఫార్సు

న్యూఢిల్లీ: విదేశీ విరాళాల నియంత్రణ (ఎఫ్‌సీఆర్‌ఏ) చట్ట ఉల్లంఘన ఆరోపణలపై ఆక్స్‌ఫాం ఇండియా సంస్థపై సీబీఐ దర్యాప్తుకు కేంద్ర హోం శాఖ సిఫార్సు చేసినట్టు సమాచారం. ఈ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు ఎదుర్కోనున్న రెండో స్వచ్ఛంద సంస్థ ఆక్స్‌ఫాం. అమన్ బిరదారీ అనే సంస్థపైనా సీబీఐ దర్యాప్తుకు హోం శాఖ గత నెల సిఫార్సు చేయడం తెలిసిందే. పలు సంస్థలు, ఇతర ఎన్జీవోలకు విదేశీ 'సాయాన్ని' ఆక్స్‌ఫాం బదిలీ చేసినట్టు హోం శాఖ గుర్తించింది. అమన్ బిరదారీకీ కొంత మొత్తం పంపిందని సమాచారం.ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ ఉన్న సంస్థలకు నిధుల బదిలీ, కన్సల్టెన్సీ మార్గంలో తరలింపుకు పాల్పడిందని ఐటీ సర్వేలో తేలింది.

సీటు కిందే నాగుపాము..
పైలట్ ఏం చేశాడంటే..!

జొహన్నెస్‌బర్గ్: 11 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న విమానంలో పైలట్‌కు తన సీటు కింద అతి విష పూరితమైన కేప్ కోబ్రా కనిపిస్తే? దక్షిణాఫ్రికాకు చెందిన రుడాల్ఫ్ ఎరాస్మస్ అనే పైలట్‌కు ఇదే అనుభవం ఎదురైంది! అయినా సరే, అంతటి ప్రతికూల పరిస్థితిలోనూ తాను ఏమాత్రం గాభరా చెందకుండా, ప్రయాణికులనూ కంగారు పెట్టకుండా విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశాడు!! దాంతో అనుభవశాలులైన పైలట్లు సైతం ఆయనను హీరో అంటూ ఆకాశానికెత్తేస్తున్నారు. ఒళ్లు గగుర్పొడిచే ఈ ఘటన సోమవారం జరిగింది. నలుగురు ప్రయాణికులతో కూడిన చిన్న విమానం దక్షిణాఫ్రికాలో వోర్సెస్టర్ నుంచి నెల్స్‌ప్రూయిట్‌కు బయల్దేరింది. కాసేపటికే తనకెదురైన భయానక అనుభవాన్ని ఓ వెబ్‌సైట్‌తో ఇరాస్మస్ పంచుకున్నారు. ''నా సీటు దగ్గరే కాలి వెనుక ఎప్పుడూ వాటర్ బాటిల్ పెట్టుకుంటా. అప్పుడప్పుడూ అది నా కాలికి చల్లగా తాకుతూ ఉంటుంది. బయల్దేరిన కాసేపటికి సీటు కింద చూస్తే బాటిల్ వెనుకే నాగుపాము కనిపించడంతో షాకయ్యా'' అన్నారు. నిజానికి ఆ పాము ముందు రోజు సాయంత్రమే సిబ్బందికి విమానం రెక్క కింద కన్పించిందట. పట్టుకునేందుకు ప్రయత్నిస్తే ఇంజన్లోకి దూరింది. ఎంత వెదికినా కనిపించకపోవడంతో వెళ్లిపోయి ఉంటుందని భావించారట. ''నా సీటు కింద పాముందని ప్రయాణికులకు చెప్పాలా వద్దా అని ఒక్క క్షణం ఆలోచించా. వాళ్లను గాభరా పెట్టకుండా మెల్లిగా విషయం వివరించా. వెంటనే కంట్రోల్ టవర్‌కు సమాచారమిచ్చా. అత్యవసరంగా విమానాన్ని లాండ్ చేశా. నలుగురు ప్రయాణికులూ దిగాకే నా సీటును వదిలిపెట్టా. అప్పటికి పాము నా సీటు కిందిభాగాన్ని చుట్టేసుకుని ఉంది'' అని ఇరాస్మస్ వివరించారు. అయితే ఆ తర్వాత ఎంత వెదికినా పాము దొరక్కపోవడం విశేషం!



అక్రమార్జనపై పోరు

బంధుప్రీతిరహిత భారత్‌ను సాధిస్తాం • బీజేపీ వ్యవస్థాపక దినోత్సవంలో ప్రధాని

న్యూఢిల్లీ: అవినీతి, బంధుప్రీతి, శాంతిభద్రతల సవాళ్లను రూపుమాపేందుకు బీజేపీ కంకణబద్ధమై అవిశ్రాంతంగా కృషిచేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. గురువారం బీజేపీ 44వ వ్యవస్థాపక దినోత్సవం(స్థాపనా దివస్) సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలనుద్దేశిస్తూ ఆయన ప్రసంగించారు. ' ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ అవతరించినప్పటికీ మూడోసారీ మనదే విజయం అనే సంతృప్తి భావన మీలో రానివ్వకండి. మనం గెలవాల్సింది 2024 సార్వత్రిక ఎన్నికలను మాత్రమే కాదు. ప్రతి ఒక్క భారతీయుడి హృదయాన్ని గెల్చుకోవాలి' అని పార్టీ నేతలు, కార్యకర్తలను సున్నితంగా హెచ్చరించారు. ' బంధుప్రీతి, వంశపాలన, కుల, ప్రాంతీయతత్వంతో కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీలు మునిగిపోయాయి. ఇప్పుడు వాటి అవినీతి బయటపడుతుండటంతో రాజకీయ అస్తిత్వం కోసం తిప్పలుపడుతున్నాయి. అందుకే బీజేపీపై ఎన్నో అపవాదులు మోపాయి. ఇంకెన్నో కుట్రలు పన్నాయి. కుతంత్రాలను తట్టుకుని బీజేపీ సమున్నతంగా నిల్చుంది. అందుకే బీజేపీ పేరు ఎత్తితేనే ఆ పార్టీలు అసహనంతో, విద్వేషంతో రగిలిపోతున్నాయి' అని విపక్ష పార్టీలను విమర్శించారు. ప్రధాని ప్రసంగాన్ని బీజేపీ దాదాపు 10 లక్షల ప్రాంతాల్లో ప్రత్యక్ష ప్రసారంచేసింది. మోదీ ఏమన్నారంటే...

- 'మోదీ సమాధికి గొయ్యి తీస్తాం' అని మాట్లాడుతున్నారు. కానీ పేదలు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, దళితులు, మహిళలు కమలానికి రక్షణగా నిల్చున్నారు. అందుకే కమలం (బీజేపీ పార్టీ) మరింత వికసిస్తోంది.
- రాజరిక మనస్తత్వంతో ఉన్న కొందరు.. పేదలను ఇన్నాళ్లూ తమ బానిసలుగా భావించారు. కానీ 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చాక పేదలకు సాధికారత కల్పించింది. అందరినీ కలుపుకుని ముందుకుపోదాం అనే సంస్కృతిని బీజేపీనే తెచ్చింది.
- ఎన్నికల్లో గెలుపుతోనే మనం ఆగిపోకూడదు. కోట్లాది మంది ప్రజల మనసుల్ని గెలవాలి. ప్రతి ఎన్నికను మనం చెమటోడ్చి గెల్చుకుందాం. జనసంఘ్ కాలం నాటి మన శ్రమస్ఫూర్తిని నిరంతరం కొనసాగిద్దాం
- నిస్వార్థ సేవకు హనుమానే బీజేపీకి ఆదర్శం. అవినీతి, బంధుప్రీతిని ఆత్మబలంతో పారదోలుదాం.
- విపక్షాలు చిన్న లక్ష్యాలతోనే సరిపెట్టుకుంటున్నాయి. బీజేపీ పెద్ద లక్ష్యాలను సంకల్పించి అతిపెద్ద విజయాలను సాధిస్తోంది
- జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 అనేది చరిత్రలో కలిసిపోతుందని విపక్షాలు ఏనాడూ ఊహించి ఉండవు. కశ్మీర్‌లో ఇటు శాంతి స్థాపన, అటు అభివృద్ధిని బీజేపీ సుసాధ్యం చేయడాన్ని విపక్ష పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయి.



బీజేపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జెండా ఎగరేస్తున్న అధ్యక్షుడు నడ్డా. (ఇన్‌సెట్లో) ప్రసంగిస్తున్న మోదీ

2 నుంచి 303 దాకా..
43 ఏళ్ల బీజేపీ ప్రస్థానం

సరిగ్గా 43 ఏళ్ల క్రితం, అంటే 1980 ఏప్రిల్ 6న పురుడు పోసుకున్న బీజేపీ 1984 సార్వత్రిక ఎన్నికల్లో కేవలం రెండు లోక్‌సభ స్థానాలతో పార్లమెంటరీ ప్రస్థానం ప్రారంభించింది. 2019 కల్లా 303 సీట్లకు ఎదగడమే గాక వరుసగా మూడోసారీ అధికార పీఠం చేజిక్కించుకునేందుకు ఉవ్విళ్లూరుతోంది. అటల్ బిహారీ వాజ్‌పేయి, తర్వాత అద్వానీ, మురళీ మనోహర్ జోషి వంటి దిగ్గజాలు పార్టీకి సారథ్యం వహించారు. 1989 ఎన్నికల్లో 2 నుంచి 85 సీట్లకు ఎగబాకింది. తర్వాత 2004, 2009 మినహా ప్రతి ఎన్నికల్లోనూ సీట్ల సంఖ్యను పెంచుకుంటూ వచ్చింది. మోదీ మ్యాజిక్‌తో 2014లో సొంత మెజారిటీతో అధికారంలోకి వచ్చింది.

సంవత్సరం	గెల్చిన సీట్లు
1984	2
1989	85
1991	120
1996	161
1998	182
1999	182
2004	138
2009	116
2014	282
2019	303

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



కలెక్టర్ తనిఖీ

రాజేంద్రనగర్: పదవ తరగతి పరీక్షలు కొనసాగుతున్న బుద్వేల్ కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ హరీష్ తనిఖీ చేసి పరీక్ష నిర్వహణ, విద్యార్థుల హాజరును పరిశీలించారు.



వీఎన్ఆర్‌లో సినీ సందడి

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో రామబాణం మూవీ హీరో హీరోయిన్లు గోపీచంద్, డింపుల్ హయత్‌లు సందడి చేశారు. మూవీలోని ఓ పాటను లాంచ్ చేశారు.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత

శంషాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో గురువారం రాత్రి రియాద్ నుంచి ఎస్‌వీ–750 విమానంలో నగరానికి వచ్చిన ప్రయాణికుడి వద్ద పోలీసులు 514 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకన్నారు. అతడు మలద్వారంలో క్యాప్సుల్స్ రూపంలో ఉంచి బంగారం తీసుకురాగా.. వైద్యుల పర్యవేక్షణలో మూడు క్యాప్సుల్స్‌ను తీశారు. బంగారం విలువ రూ. 32.8 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు.



న్యూస్‌రీల్

12న సైబర్ సెక్యూరిటీ సమ్మిట్

- ముఖ్య అతిథిగా హాజరవనున్న మంత్రి కేటీఆర్

హిమాయత్‌నగర్: సైబర్ నేరాల నియంత్రణపై 'హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్' (హెచ్‌సీఎస్సీ) ప్రత్యేక సమ్మిట్‌ను నిర్వహించనుంది. ఈ నెల 12వ తేదీన బంజారాహిల్స్‌లోని తాజ్ దక్కన్ ఇందుకు వేదిక కానుంది. సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్న విద్యార్థులు, వ్యాపారవేత్తలు, ఇతర వర్గాలకు చెందిన వారు కోట్లాది రూపాయిలు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆయా వర్గాల వారికి అవగాహన కల్పించేందుకు 'హైదరాబాద్ యాన్యువల్ సైబర్ సెక్యూరిటీ నాలెడ్జ్ సమ్మిట్'లో భాగంగా 'హ్యాక్ సమ్మిట్-2023' పేరుతో దీనిని నిర్వహిస్తున్నారు. ఈ సమ్మిట్‌కు ముఖ్యఅతిథిగా ఐటీశాఖ మంత్రి కేటీఆర్ హాజరవుతున్నట్లు హెచ్‌సీఎస్సీ అధికారికంగా సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది.

కర్మన్‌ఘాట్ ఆలయంలో ఓం రౌత్ పూజలు

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీ ధ్యానాంజనేయ స్వామివారిని గురువారం ఆదిపురుష్ సినిమా దర్శకుడు ఓం రౌత్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారుల నుంచి ఆశీర్వాదం అందుకున్నారు. 'ఆదిపురుష్' సినిమాను జూన్ 16న త్రీడీ సినిమా హాళ్లలో ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నటు ఓం రౌత్ ఈ సందర్భంగా వెల్లడించారు.

ఔటర్ రింగ్‌రోడ్ లీజుకు 4 సంస్థలు ఆసక్తి

- 30 ఏళ్ల లీజుకు హెచ్ఎండీఏ సన్నాహాలు

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు తీసుకొనేందుకు నాలుగు నిర్మాణ సంస్థలు ముందుకు వచ్చాయి. ఆసక్తి గల సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా మొదట్లో సుమారు 12 సంస్థలు స్పందించాయి. కానీ ఇటీవల దరఖాస్తు గడువు ముగిసేనాటికి 4 సంస్థలు మాత్రమే పోటీలో నిలిచాయి. ఈగిల్ ఇన్‌ఫ్రా ఇండియా లిమిటెడ్, ఐఆర్‌బి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ లిమిటెడ్, దినేష్ చంద్ర ఆర్ అగర్వాల్ ఇన్‌ఫ్రాకన్ ప్రైవేట్ లిమిటెడ్, గవార్ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ సంస్థలు మాత్రమే ప్రస్తుతం పోటీలో ఉన్నాయి. హైదరాబాద్ నగరం చుట్టూ 158 కిలోమీటర్లు ఉన్న ఔటర్ రింగ్ రోడ్డును 30 ఏళ్ల పాటు ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇచ్చేందుకు హెచ్ఎండీఏ కార్యాచరణ చేపట్టింది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.8000 కోట్ల వరకు ఆదాయం లభించగలదని అంచనా. టోలింగ్, ఆపరేషన్, మెయింటెనెన్స్ అండ్ ట్రాన్స్‌ఫర్ (టీఓటీ) పద్ధతిలో ఔటర్‌ను లీజుకు ఇవ్వనున్నారు. మొదట టెక్నికల్ కమిటీ బిడ్‌లను పరిశీలించిన అనంతరం ఫైనాన్షియల్ బిడ్‌లపైన దృష్టి సారించనున్నట్లు అధికారులు తెలిపారు.

పబ్లిక్ టాయిలెట్లకు గ్రీన్ కర్టెన్లు



కేబీఆర్ పార్కును ఆనుకొని పచ్చదనంతో తీర్చిదిద్దిన పబ్లిక్ టాయిలెట్

బంజారాహిల్స్: మొన్నటి వరకు రోడ్ల పక్కన ఉండే పబ్లిక్ టాయ్‌లెట్లు అంటే అపరిశుభ్రతకు కేరాఫ్‌గా ఉండేవి. ఇందులోకి వెళ్లాలంటేనే జనం జడుసుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పబ్లిక్ టాయ్‌లెట్లకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని కేబీఆర్ పార్కును ఆనుకొని ఉన్న ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన శౌచాలయాలను పచ్చదనంతో తీర్చిదిద్దారు. దీనికి రెండువైపులా గ్రీన్ కర్టెన్ ఏర్పాటు చేశారు. అందమైన క్రోటన్లు పెంచుతున్నారు. పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నారు. నీటి సరఫరా కూడా ఏర్పాటు చేశారు. దీంతో ఇప్పుడివి కార్పొరేట్ తరహాలో చక్కగా రూపుదిద్దుకున్నాయి. ఇదే రోడ్డులో జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుకు ఇవతల కూడా రోడ్డుకు రెండువైపులా పబ్లిక్ టాయ్‌లెట్లను పచ్చదనం, పరిశుభ్రతతో తీర్చిదిద్దారు. గతంలో చెత్తా చెదారం, వ్యర్థాలు, నీటి సరఫరా లేక పోవడం, దుర్గంధంతో ఉన్న ఈ మరుగుదొడ్లను ఇప్పుడు అందరికీ అందుబాటులో ఉండేలా గ్రీనరీ, శుభ్రతకు పెద్దపీట వేస్తూ అందుబాటులోకి తీసుకొచ్చారు.



సుల్తాన్ బజార్‌లో..



గౌలిగూడ టు తాడ్‌బండ్





శ్రీ ఆంజనేయం

వైభవంగా హనుమాన్ విజయయాత్ర

వీర హనుమాన్ విజయయాత్ర గురువారం నగరంలో కన్నుల పండువగా జరిగింది. గౌలిగూడ నుంచి తాడ్‌బండ్ వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర చేపట్టిన ఈ యాత్రలో హనుమాన్ భక్తులతో పాటు భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ ఈదురు గాలులతో కూడిన వడ గళ్లవానను సైతం లెక్క చేయకుండా భక్తులు 'సామూహిక హనుమాన్ చాలీసా' నిర్వహించారు. కాషాయ దుస్తులు ధరించి, బైక్‌లపై జెండాలు పెట్టుకుని ముందుకు కదిలారు. దారి పొడవునా 'రామ లక్ష్మణ్ జానకీ..జై బోలో హనుమాన్‌కీ..' 'జై శ్రీరాం' వంటి నినాదాలతో హోరెత్తించారు. ఉదయం తొమ్మిది గంటలకు గౌలిగూడ రామమందిరంలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ యాత్రను ప్రారంభించారు. రాత్రి 9.30 గంటల ప్రాంతంలో సికింద్రాబాద్‌లోని తాడ్‌బండ్ హనుమాన్ ఆలయానికి చేరుకుంది.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు



అబిడ్స్ రూట్‌లో..



నారాయణగూడలో..

ఏళ్ల గుర్తు.. ఏమయ్యేనో?



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నమూనా చిత్రం ఏరియల్ వ్యూ

సుమారు ఒకటిన్నర శతాబ్ద కాలం పాటు ప్రయాణికులకు సేవలందజేసిన చారిత్రాత్మక సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అత్యాధునిక సదుపాయాలతో సరికొత్తగా అవతరించనుంది. విమానాశ్రయం తరహాలో చేపట్టనున్న రైల్వేస్టేషన్ పునరభివృద్ధి పనులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 8వ తేదీన ప్రారంభించనున్నారు. ప్రధాని రాక కోసం సికింద్రాబాద్ స్టేషన్ ముస్తాబవుతోంది. పదో నెంబర్ ప్లాట్‌ఫామ్‌ను ఇప్పటికే అందంగా అలంకరించారు. నిజాం పరిపాలనకు ప్రతీకగా నిలిచిన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఒక చారిత్రక వారసత్వ కట్టడం. ఇప్పుడు ఈ భవనం అస్తిత్వం ప్రశ్నార్థకంగా మారింది. రైల్వేస్టేషన్ పునరభివృద్ధి వల్ల ఈ చారిత్రక అస్తిత్వం కనుమరుగవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. హైదరాబాద్ చారిత్రక ప్రియులు, వారసత్వ కట్టడాల పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్న ఇంటాక్ వంటి సంస్థలు ఈ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. నిజాం కాలం నాటి చారిత్రక నమూనాకు ఏ మాత్రం విఘాతం కలగకుండా ఆధునీకరించాలని ఇంటాక్ సంస్థ ప్రతినిధి అనురాధారెడ్డి కోరారు. సింగపూర్‌లోని ఓ చారిత్రక హోటల్‌ను అదేవిధంగా అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

సికింద్రాబాద్ స్టేషన్ ఆధునీకరణపై చర్చలు

- చారిత్రక వారసత్వ సంపద పరిరక్షణపై ప్రశ్నలు
- ఆ అస్తిత్వానికి విఘాతం కలగకుండా పునరభివృద్ధి చేయాలి
- స్టేషన్ వారసత్వ నమూనాను పరిరక్షించాలంటున్న ఇంటాక్
- రేపు ప్రధాని చేతుల మీదుగా పునరభివృద్ధి పనులు ప్రారంభం



భాగ్యనగర ప్రజల జీవనంతో మమేకమైన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఒక చారిత్రక గుర్తింపు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఈ స్టేషన్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. ఈ నేపథ్యంలో స్టేషన్ వారసత్వ గుర్తింపును కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరో నిజాం కాలంలోనే...





ఆధునీకరించనున్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నమూనా చిత్రాలు

- ఆరో నిజాం నవాబు మీర్ మహ్మద్ అలీఖాన్ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నిర్మాణానికి 1870లోనే సన్నాహాలు చేపట్టారు. సికింద్రాబాద్-వాడి నగరాల మధ్య మొట్టమొదటి రైల్వేలైన్ అందుబాటులోకి రావడంతో రైల్వేస్టేషన్ తప్పనిసరిగా మారింది. రైల్వేసేవల విస్తరణలో భాగంగా ఏర్పాటైన నిజామ్స్ గ్యారెంటీడ్ స్టేట్ రైల్వేస్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ నిర్మాణం చేపట్టారు.
- నిజాం పరిపాలనకు ప్రతీకగా చక్కటి నమూనాలో రూపొందించిన పోర్టికోతో అందమైన రైల్వేస్టేషన్ భవనం 1874 అక్టోబర్ 9వ తేదీన ప్రారంభమైంది. మొదట రెండు ప్లాట్‌ఫామ్‌లతో రైల్వేసేవలను అందుబాటులోకి తెచ్చారు.
- సుమారు 1889 నాటికి వాడి నుంచి సికింద్రాబాద్ వరకు ఉన్న రైల్వేలైన్‌లను విజయవాడ వరకు విస్తరించారు. హైదరాబాద్ నుంచి దశలవారీగా అన్ని ప్రాంతాలకు రైల్వే సేవలను విస్తరించేందుకు నిజామ్స్ స్టేట్ గ్యారెంటీడ్ స్టేట్ రైల్వేస్ సంస్థ సికింద్రాబాద్ స్టేషన్ విస్తరణకు సైతం చర్యలు చేపట్టింది. 4 ప్లాట్‌ఫామ్‌ల వరకు అభివృద్ధి చేసింది.
- హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన తరువాత నిజాం రైల్వేస్ కూడా భారత రైల్వేల్లో భాగమైంది. 1966 అక్టోబర్‌లో దక్షిణమధ్య రైల్వేజోన్ ప్రత్యేకంగా ఏర్పాటు కావడంతో అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో సికింద్రాబాద్ ప్రధాన రైల్వేస్టేషన్‌గా మారింది. అంచెలంచెలుగా 10 ప్లాట్‌ఫామ్‌ల వరకు అభివృద్ధి చేశారు.

కొత్త భవనం ఇలా...

- కొత్త స్టేషన్ భవనంలో ఉత్తరం వైపు జీ ప్లస్ 3 అంతస్తులు, దక్షిణం వైపు జీ ప్లస్ 3 అంతస్తుల భవనాలను నిర్మిస్తారు. లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తారు. ఉత్తరం వైపు మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయం ఉంటుంది. దక్షిణం వైపు అండర్ గ్రౌండ్ పార్కింగ్ ఏర్పాటు చేస్తారు.
- రెండు వైపులా రాకపోకలు సాగించేవిధంగా 7.5 మీటర్ల వెడల్పుతో 2 నడక దారులను ఏర్పాటు చేస్తారు. అలాగే సికింద్రాబాద్ ఈస్ట్, సికింద్రాబాద్ వెస్ట్ మెట్రో స్టేషన్‌లకు చేరుకొనేందుకు స్కైవేలను అందుబాటులోకి తెస్తారు.
- ప్రస్తుతం స్టేషన్‌లో ఉన్న 10 ప్లాట్‌ఫామ్‌లకు పూర్తిగా పై కప్పులు వేస్తారు. స్టేషన్‌కు చేరుకొనేందుకు, తిరిగి వెళ్లేందుకు వేర్వేరు ప్లాట్‌ఫామ్‌లు ఉంటాయి. స్టేషన్ నుంచే నేరుగా మెట్రోస్టేషన్‌కు, రైతిఫైల్ బస్‌స్టేషన్‌కు వెళ్లవచ్చు.
- మరోవైపు స్టేషన్‌లో సుమారు 5000 కిలో వాట్స్ పవర్ సామర్థ్యం కలిగిన సోలార్ పవర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు.

- ప్రయాణికుల అవసరాల కోసం రైల్వేస్టేషన్‌ను దశలవారీగా అభివృద్ధి చేసినప్పటికీ ఇప్పటి వరకు నిజాం కాలం నాటి నమూనాకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అదనపు హంగులను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ప్రతి రోజు సుమారు 1.8 లక్షల మంది ప్రయాణికులకు సేవలను అందజేస్తున్న సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ఇంచుమించు 200 రైళ్లు రాకపోకలు సాగిస్తాయి.

ఆధునీకరణకు అడుగులు...

- సికింద్రాబాద్‌ను వరల్డ్‌క్లాస్ స్టేషన్‌గా అభివృద్ధి చేయాలని 2008లోనే ప్రతిపాదించారు. ప్రపంచవ్యాప్తంగా పలు మెట్రో నగరాల్లో ఉన్న రైల్వే స్టేషన్‌లను అధ్యయనం చేశారు. కానీ అప్పట్లో నిర్మాణ సంస్థల నుంచి పెద్దగా ఆసక్తి కనిపించ పోవడంతో ఈ ప్రతిపాదన అలాగే ఉండిపోయింది.
- మూడేళ్ల క్రితం పునరభివృద్ధి కోసం ప్రణాళికలను రూపొందించి నిర్మాణ సంస్థలను ఆహ్వానించినా బిడ్డింగ్ దశను దాటి ముందుకు కదల్లేదు. దీంతో ఇప్పుడు రైల్వేశాఖ స్వయంగా పునరభివృద్ధి ప్రాజెక్టును చేపట్టింది.
- పునరభివృద్ధి ప్రాజెక్టును 2025 నాటికి పూర్తి చేసే విధంగా సుమారు రూ.715 కోట్లతో చేపట్టారు. పునరభివృద్ధి వల్ల సికింద్రాబాద్ స్టేషన్ 'విమానాశ్రయం' తరహాలో ఉంటుంది.
- ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలకు ముఖద్వారంగా ఉన్న సికింద్రాబాద్ స్టేషన్ నుంచి దక్షిణమధ్య రైల్వేకు ఏటా రూ.500 కోట్లకు పైగా ఆదాయం లభిస్తుంది.



హిమాయత్‌నగర్‌లో..

వానొచ్చె..వరదొచ్చె

నగరంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఇక ఓయూలో రాళ్ల వర్షం కురిసింది.



ఓయూలో...

ట్రాఫిక్ అలర్ట్

ప్రధాని పర్యటన నేపథ్యంలో ఆంక్షలు

- రేపు సికింద్రాబాద్, బేగంపేట ప్రాంతాల్లో
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు
- సహకరించాలని కోరిన నగర కొత్వాల్ ఆనంద్



సాక్షి, సిటీబ్యూరో: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఉత్తర మండల పరిధిలో పర్యటించనున్నారు. బేగంపేట, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, పరేడ్ గ్రౌండ్స్‌లో ఆయన పర్యటన కార్యక్రమాలు ఉన్నాయి. వీటి నేపథ్యంలో ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు విధిస్తూ కొత్వాల్ సీవీ ఆనంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నగరవాసులు వీటిని దృష్టిలో పెట్టుకుని తమకు సహకరించాలని కోరారు. ఈ సమయంలో మోనప్ప జంక్షన్, సీటీఓ జంక్షన్, సెయింట్ జాన్స్ రోటరీ, సంగీత్ ఎక్స్‌రోడ్స్, చిలకలగూడ జంక్షన్, ఎంజీ రోడ్, ఆర్పీ రోడ్, ఎస్పీ రోడ్ మార్గాల్లో ప్రయాణించవద్దని నగర పోలీసులు సూచిస్తున్నారు.

- టివోలీ జంక్షన్ నుంచి ప్లాజా జంక్షన్, ఎస్బీహెచ్ ఎక్స్‌రోడ్స్ నుంచి స్వీకార్ ఉప్‌కార్ జంక్షన్ మధ్య మార్గాన్ని పూర్తిగా మూసి ఉంచుతారు.
- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు సాధ్యమైనంత త్వరగా చేరుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.
- చిలకలగూడ జంక్షన్ వైపు నుంచి ఉన్న రైల్వేస్టేషన్ మార్గాన్ని మూసి ఉంచుతారు. ప్రయాణికులు ప్లాట్‌ఫామ్ నెం.1 వైపు ఉన్న ప్రధాన ఎంట్రీ ద్వారానే స్టేషన్‌లోకి రావాల్సి ఉంటుంది.
- ఉప్పల్ నుంచి సికింద్రాబాద్ వైపు వచ్చే వాహనచోదకులు తార్నాక మార్గంలో కాకుండా రామాంతపూర్, పంజగుట్ట మార్గంలో ప్రయాణించాలి.
- పరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభకు వచ్చే వారి వాహనాల కోసం పోలీసులు ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయించారు. దోబీఘాట్, బైసన్ పోలో గ్రౌండ్స్, ఆర్ఆర్‌సీ గ్రౌండ్స్, కంటోన్మెంట్ పార్క్ గ్రౌండ్, పికెట్ డిపో, నెక్లెస్ రోడ్‌లో ఇవి ఏర్పాటు చేశారు.
- ప్రధాని పర్యటన నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను పూర్తిగా కేంద్ర బలగాలు తమ స్వాధీనంలోకి తీసుకున్నాయి.
- రైల్వే స్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాల పైనా డేగకన్ను వేశారు. దాదాపు రెండు గంటల పాటు ప్రధాని పర్యటన సాగనుంది. ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయంలో దిగే మోదీ అక్కడ నుంచి రోడ్డు మార్గంలో రాకపోకలు సాగించనున్నారు.

సామాన్యులే నయం!

సాక్షి, సిటీబ్యూరో: ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తే..పన్ను బకాయిల చెల్లింపులైనా స్వచ్ఛందంగానే చేస్తారనేందుకు నిదర్శనం జీహెచ్ఎంసీ ఆస్తిపన్ను వసూళ్ల తీరు. ఇటీవల ముగిసిన ఆర్థిక సంవత్సరం (2022–23)లో జీహెచ్ఎంసీ ఆస్తిపన్ను చెల్లింపుదారుల్లో 13.69 లక్షల మంది తమ ఆస్తిపన్ను చెల్లించారు. వీరిలో సగానికి పైగా జీహెచ్ఎంసీ కల్పించిన ఆన్‌లైన్ సదుపాయాన్ని వినియోగించుకొని నేరుగానే చెల్లించారు. విశేషమేమిటంటే స్వచ్ఛందంగా ఆన్‌లైన్ ద్వారా కానీ, మీ సేవకేంద్రాలు, ఇతరత్రా మార్గాల ద్వారా కానీ ఆస్తిపన్ను చెల్లించిన వారిలో సామాన్యులే ఎక్కువగా ఉన్నారు.

బడాబాబులు అంతంతగానే..

పెద్దమొత్తాల్లో బకాయిలున్న వారిలో మాత్రం స్వచ్ఛందంగా చెల్లించిన వారు తక్కువమందే ఉన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు సంప్రదింపులు జరపడంతోపాటు బిల్‌కలెక్టర్లు వెంట పడితే తప్ప చెల్లించని వారు బడా బకాయిలున్నవారిలోనే ఉన్నారు. అప్పటికీ స్పందించని కొందరికి ఆస్తుల్ని సీజ్ చేస్తామని హెచ్చరికలు జారీ చేయడమే కాక కొన్ని సంస్థల్ని మూసివేయడం కూడా ఇందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో బడా బకాయిలున్న వారిలో ఎక్కువమంది బిల్‌కలెక్టర్ల ద్వారానే చెల్లించారు. అందుకే మొత్తం ఆస్తిపన్ను చెల్లించిన వారిలో ఆన్‌లైన్‌ద్వారా చెల్లించిన వారు ఎక్కువమంది ఉన్నప్పటికీ, వారు చెల్లించిన మొత్తం కంటే బిల్‌కలెక్టర్ల ద్వారా వసూలైన మొత్తమే ఎక్కువగా ఉంది.

జీహెచ్ఎంసీ ఆస్తిపన్ను వసూళ్లలో వెల్లడైన నిజం

- సగానికి పైగా ప్రజలు ఆన్‌లైన్ ద్వారానే చెల్లించారు
- బడాబాబులు మాత్రం వెంటపడితేనే..

జీహెచ్ఎంసీకి ఆస్తిపన్ను చెల్లించిన వారిలో దేని ద్వారా ఎందరు చెల్లించారో.. ఎంత మొత్తం చెల్లించారో వివరాలిలా ఉన్నాయి.

దేని ద్వారా	ఎంతమంది	ఎంత మొత్తం (రూ. కోట్లు)
సీఎస్‌సీలు	144477	168.64
బిల్‌కలెక్టర్లు	315805	860.04
మీసేవ కేంద్రాలు	132356	81.29
ఆన్‌లైన్ ద్వారా	776892	570.89

- మొత్తం 13.69 లక్షలమంది ప్రజలు తమ ఆస్తిపన్ను చెల్లించగా అందులో 7.76 లక్షల మంది ఆన్‌లైన్ ద్వారా నేరుగా చెల్లించారు. వారు చెల్లించిన మొత్తం రూ.570 కోట్లుకాగా, బిల్‌కలెక్టర్లద్వారా 3.15 లక్షల మంది రూ.860 కోట్లు చెల్లించారు.



నగరంలో మళ్లీ కుండపోత

- పలు చోట్ల వడగళ్ల బీభత్సం
- ఈదురు గాలులతో కూలిన చెట్లు
- రహదారులు జలమయం స్తంభించిన ట్రాఫిక్
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- అత్యధికంగా బన్సీలాల్‌పేటలో 4.5 సెంటీమీటర్లు నమోదు


హిమాయత్ నగర్‌లో..


బర్కత్‌పురాలో..

సాక్షి,సిటీ బ్యూరో: నగరంలో మళ్లీ వాన దంచికొట్టింది. పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో దాదాపు గంటపాటు భారీ వర్షం కురిసింది. కొన్నిచోట్ల వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించింది. వడగళ్ల వాన కారణంగా రోడ్లపై వెళ్తున్న వాహనదారులు గాయపడ్డారు. వాహనాల అద్దాలు సైతం స్వల్పంగా ధ్వంసమయ్యాయి. గురువారం మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఉపరితల ద్రోణి ప్రభావంతో ఆకాశం మేఘావృతమై నిమిషాల వ్యవధిలో వర్షం ప్రారంభమైంది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం హడలెత్తించింది. ఈ కారణంగా రహదారులు జలమయమయ్యాయి. ఈదురు గాలులతో కూడిన వర్షానికి చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ లైన్లపై పడటంతో షార్ట్ సర్క్యూట్ సమస్య కారణంగా సుమారు 150 ఫీడర్లు ట్రిప్పయ్యాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బోయగూడ వై జంక్షన్ సమీపంలో ఠాకూర్ రెసిడెన్సీ పక్కన భారీ వృక్షం నేలకూలింది. పలు చోట్ల రోడ్లపై చెట్లు విరిగిపోవడం ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సికింద్రాబాద్, ముషీరాబాద్, చిక్కడపల్లిలో వడగళ్ల వర్షం పడింది. హిమాయత్ నగర్, అంబర్ పేట, నల్లకుంట, రామంతపూర్ లో భారీ వర్షం కురిసింది. దిల్‌సుఖ్ నగర్, మలక్‌పేట్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, గచ్చిబౌలి, మణికొండ, పంజాగుట్ట, అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్ ప్రాంతాల్లో వర్షం కురిసింది. మాసబ్‌ట్యాంక్, నాంపల్లి, లక్డీకాపూల్, మాదాపూర్, హైటెక్ సిటీ, మెహిదీపట్నం, టోలీచౌకి ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. వాతావరణ శాఖ అధికారులు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. శుక్ర, శనివారాల్లో కూడా చోట్ల వడగళ్లతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

వర్షపాతం నమోదు ఇలా...

ప్రాంతం	సెంటీమీటర్లు
బన్సీలాల్‌పేట	4.5
చిలకలగూడ	3.8
మోండామార్కెట్	3.7
వెస్ట్‌మారేడ్‌పల్లి	3.2
గుడిమల్కాపూర్	3.2
ఉస్మానియా యూనివర్సిటీ	3.1
ఎల్బీ స్టేడియం	3.0


నారాయణగూడలో..


లుంబినీ పార్కు రోడ్డులో..

సార్..సెల్‌ఫోన్ ప్లీజ్

- 10 వ తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన రాచకొండ కమిషనర్
- సెల్‌ఫోన్‌తో కమిషనర్‌ను లోపలికి అనుమతించని మహిళా కానిస్టేబుల్
- కానిస్టేబుల్‌కు సీపీ అభినందన, రివార్డు


కల్పనకు రివార్డు అందజేస్తున్న సీపీ డీఎస్ చౌహాన్

లింగోజిగూడ: పదవ తరగతి పరీక్షా కేంద్రాల తనిఖీల్లో భాగంగా గురువారం ఎల్బీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసేందుకు వచ్చిన రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎల్బీనగర్ పోలీస్టేషన్ మహిళా కానిస్టేబుల్ కల్పన అడ్డుకుంది. సీపీ చేతిలో సెల్ ఫోన్ ఉండడంతో పరీక్ష కేంద్రంలోకి తీసుకెళ్లవద్దని సూచించింది. దీంతో కమిషనర్ తన ఫోన్‌ను బయటే ఉంచి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.అనంతరం ఆయన కానిస్టేబుల్ కల్పనను అభినందించడంతో పాటు రూ.500 రివార్డు అందజేశారు. ఈ విషయం తెలియడంతో పలువురు ఉన్నతాధికారులు ఆమెను అభినందించారు.

కట్టుదిట్టమైన భద్రత: సీపీ

10 వ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అన్నారు. ఎల్బీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేశామని, కేంద్రాల్లోకి ఇతరులను అనుమతించకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరీక్షకు వచ్చే వారిని క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి పంపాలని, సెల్ ఫోన్‌లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద గుమికూడడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ డీసీపీ సాయి శ్రీ, ఏసీపీ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజాసింగ్ అరెస్ట్


లాలాగూడ పోలీస్‌స్టేషన్లో ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: గోషామహాల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజాసింగ్‌ను మంగళ్‌హాట్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఉదయం ధూల్‌పేట్‌లోని రాజాసింగ్ ఇంటికి వెళ్లిన మంగళ్‌హాట్ పోలీసులు ఆయనను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. అతడిని అరెస్టు చేసి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా ముందు జాగ్రత్త చర్యగా రాజాసింగ్‌ను అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రవి తెలిపారు. సాయంత్రం బొల్లారం పోలీస్‌స్టేషన్ నుంచి లాలాగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో ఆయన అనుచరుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ..... హనుమాన్ జయంతి వేడుకల్లో తాను పాల్గొనకుండా పోలీసులు కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. మజ్లిస్ పార్టీ డైరెక్షన్‌తోనే తనను అరెస్టు చేశారని ఆయన ఆరోపించారు. గురువారం రాత్రి 7.30 గంటలకు పోలీసులు రాజాసింగ్‌ను ఆయన ఇంటి వద్దకు తీసుకువచ్చి వదిలి పెట్టారు. అనంతరం ఆయన ధూల్‌పేట్ ఆకాష్‌పురి హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు.

ఐసీసీసీలో శిశు సంరక్షణ కేంద్రం

పీఎన్‌బీ రూ.20 లక్షలు విరాళం

సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (ఐసీసీసీ) శిశు సంరక్షణా కేంద్రం (క్రైచ్) ఏర్పాటు కానుంది. ఇందుకుగాను పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రూ.20 లక్షలు విరాళం అందించింది. గురువారం బ్యాంక్ జోనల్, డిప్యూటీ జోనల్ మేనేజర్లు మక్సూద్ అలీ, రాజీవ్ సింగ్ ఝా బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లో నగర కొత్వాల్ సీవీ ఆనంద్‌కు చెక్కును అందజేశారు. నగరంలో మహిళలు, యువతుల రక్షణకు నిర్విరామంగా కృషి చేస్తున్న షీ-టీమ్స్‌తో పాటు ఐసీసీసీలో పని చేస్తున్న ఉద్యోగినులకు ఇది ఉపయుక్తం కానుంది. కార్యక్రమంలో అదనపు సీపీ ఏఆర్ శ్రీనివాస్, అదనపు డీసీపీ శిరీష రాఘవేంద్ర పాల్గొన్నారు.



ముంబై డ్రగ్స్ కేసులో హైదరాబాదీలు

- అక్కడి ఎయిర్‌పోర్ట్‌లో రూ.20 కోట్ల కొకైన్ సీజ్
- నైజీరియన్ సహా ముగ్గురిని పట్టుకున్న డీఆర్‌ఐ
- ఇద్దరు నగరానికి చెందిన వారిగా గుర్తింపు
- స్థానికంగా ఆరా తీస్తున్న రాష్ట్ర ఇంటెలిజెన్స్ వర్గాలు

సాక్షి, సిటీబ్యూరో: గోవాలోని డ్రగ్ సిండికేట్‌ను తుడిచిపెట్టేసిన హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) పోలీసులు ప్రస్తుతం ముంబైపై దృష్టి పెట్టారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న పెడ్లర్స్‌కు చెక్ పెడుతున్నారు. అక్కడి పోలీసులతో కలిసి సంయుక్త ఆపరేషన్లు చేపట్టి పలువురిని అరెస్టు చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ముంబై విమానాశ్రయంలో పట్టుకున్న రూ.20 కోట్ల విలువైన కొకైన్ కేసులో ముగ్గురు అరెస్టు కావడం, వారిలో ఇద్దరు హైదరాబాదీలు ఉండటం, ఆ సరుకు సిటీకి తీసుకురావడానికే అని తేలడం కలకలం రేపుతోంది. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర నిఘా వర్గాలు వారి వ్యవహారంపై స్థానికంగా ఆరా తీస్తున్నాయి. ఇథియోపియాలోని అడిస్ అబాబా నుంచి దేశంలోకి కొన్నాళ్లుగా మాదకద్రవ్యాల అక్రమరవాణా సాగుతోంది. వివిధ మెట్రో నగరాల్లోని విమానాశ్రయాలే అడ్డాగా కొకైన్‌ను తీసుకువస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) అధికారులు నిఘా ఏర్పాటు చేశారు. నైజీరియాకు చెందిన మోరీస్ అనే డ్రగ్ పెడ్లర్‌తో పాటు హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ ఇమ్రాన్ కొకైన్ తీసుకుని అడిస్ అబాబా నుంచి ముంబై వస్తున్నారని సమాచారం అందడంతో మంగళవారం తెల్లవారుజామున కాపు కాసిన డీఆర్‌ఐ టీమ్ ఇద్దరినీ అదుపులోకి తీసుకుంది. వీరి నుంచి 1970 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకుంది. ఇమ్రాన్‌ను విచారించిన అధికారులు కీలక సమాచారం సేకరించారు. ఇతడి సమీప బంధువైన సయ్యద్ హుస్సేన్ ఆదేశాల మేరకు తాను ఈ పని చేస్తున్నానని వెల్లడించారు. కొన్నాళ్లుగా తాము దుబాయ్, సౌదీ అరేబియా నుంచి బంగారం అక్రమ రవాణా చేస్తున్నామని బయటపెట్టాడు. అయితే తొలిసారిగా అడిస్ అబాబా నుంచి కొకైన్ తీసుకురావాల్సిందిగా హుస్సేన్ చెప్పాడని ఇమ్రాన్ వాంగ్మూలం ఇచ్చాడు. దీంతో గత నెల 23న అక్కడికి వెళ్లిన తాను మోరిస్‌ను కలిశానని, అతడు సమకూర్చిన మాదకద్రవ్యాన్ని అతడితో కలిసి తీసుకువచ్చినట్లు తెలిపాడు. అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.20 కోట్ల విలువైన ఈ సరుకును హైదరాబాద్ చేర్చాలని పథకం వేశామని, ఈ నేపథ్యంలోనే దానిని తీసుకోవడానికి హుస్సేన్ వస్తున్నాడని డీఆర్‌ఐ అధికారులకు చెప్పాడు. దీంతో కాపుకాసిన అధికారులు ఇమ్రాన్ ద్వారానే ఎర వేసి హుస్సేన్‌ను పట్టుకున్నారు. ముగ్గురినీ అరెస్టు చేసి అక్కడి కోర్టులో హాజరుపరిచిన డీఆర్‌ఐ టీమ్ తదుపరి విచారణ నిమిత్తం రెండు రోజుల కస్టడీకి తీసుకుంది. కస్టడీ పూర్తి కావడంతో గురువారం జైలుకు తరలించింది. ఇథియోపియా నుంచి వస్తున్న ఈ డ్రగ్ ముంబై కేంద్రంగా దేశంలోని వివిధ నగరాలకు వెళ్తోందని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న మోరిస్ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన హుస్సేన్, ఇమ్రాన్ అంతర్జాతీయ డ్రగ్ నెట్‌వర్క్‌లో భాగం కావడం, ఇరువురూ ముంబైలో డీఆర్‌ఐకు దొరకడంపై రాష్ట్ర నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు వీళ్లు ఎవరు? స్థానికంగా ఉన్న సంబంధాలు ఏంటి? ఆ డ్రగ్ ఇక్కడికి తీసుకువచ్చి ఎవరికి అప్పగించాలని భావించారు? తదితర వివరాలు ఆరా తీస్తున్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- డివైడర్‌ను ఢీకొన్న బైక్
- బీటెక్ విద్యార్థి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


శివకుమార్‌రెడ్డి మృతదేహం

ఇబ్రహీంపట్నం: అతి వేగం ఓ విద్యార్థి ప్రాణం తీసింది. బైక్‌ను వేగంగా నడుపుతున్న క్రమంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగల్‌పల్లి గేట్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ కథనం మేరకు.. వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రానికి చెందిన కే శివకుమార్‌రెడ్డి(22) బీ జశ్వంత్‌రెడ్డి స్నేహితులు. చింతపల్లిగూడ పరిధిలోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుకుంటూ బీఎన్‌రెడ్డి నగర్‌లోని హాస్టల్ ఉంటున్నారు. వీరు నగరం నుంచి ఇబ్రహీంపట్నం వైపు బైక్‌పై వస్తుండగా మంగల్‌పల్లి క్రాస్ వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న శివకుమార్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. జశ్వంత్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపుల కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు


నిందితుడు కొండమ్ ప్రేమ్ కుమార్

రంగారెడ్డి జిల్లా కోర్టులు: ప్రేమ పేరుతో ఓ బాలికను వెంటపడి వేధించడమేగాక దాడి చేసి గాయపరిచిన కేసులో నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష రూ. 16వేలు జరిమానా విధిస్తూ ఎల్‌బి నగర్ 9వ అదనపు జిల్లా, పోక్సో కోర్టు న్యాయమూర్తి హరీష గురువారం తీర్పు చెప్పారు. స్పెషల్ పీపీ సునీత కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొండమ్ ప్రేమ్ కుమార్ అనే యువకుడు 2017లో ప్రేమ పేరుతో మైనర్ బాలికకు మెసేజ్‌లు పంపుతూ, ఫోన్లు చేసి వేధిస్తున్నాడు. బాధితురాలు స్పందించకపోవడంతో ఆమె ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తానని బెదిరింపులకు దిగాడు. ఈ విషయం తెలియడంతో బాలిక తల్లి అతడిని మందలించింది. దీంతో కోపం పెంచుకున్న అతను బాలిక ఇంటికి వెళ్లి బాధితురాలితోపాటు ఆమె తల్లిపై దాడి చేశాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎల్‌బీనగర్ పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. సాక్ష్యులను విచారించిన న్యాయస్థానం నిందితుడికి పై విధంగా శిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది.

ఏనుగు దంతం @రూ.15 లక్షలు

- అమ్మకానికి బండ్లగూడ వాసి యత్నం
- వలపన్ని అరెస్టు చేసిన సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్


స్వాధీనం చేసుకున్న ఏనుగు దంతం


నిందితుడు దీపక్ థాపా

సాక్షి, సిటీబ్యూరో: ఏనుగు దంతంలోని ఓ భాగాన్ని రూ.15 లక్షలకు విక్రయించడానికి ప్రయత్నించిన వ్యక్తిని దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఇతడికి దీనిని ఇచ్చిన వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు డీసీపీ చక్రవర్తి గుమ్మి గురువారం వెల్లడించారు. నేపాల్‌కు చెందిన దీపక్ థాపా బతుకుదెరువు కోసం చాలా ఏళ్ల క్రితం నగరానికి వలసవచ్చాడు. బండ్లగూడ మహ్మద్‌నగర్‌లో ఉంటున్న ఇతను మతం మారడంతో పాటు తన పేరును మహ్మద్ రహాన్‌గా మార్చుకున్నాడు. మాంసం వ్యాపారం చేస్తున్న ఇతడికి కొన్నాళ్లుగా నష్టాలు ఎదురుకావడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు. దీంతో తేలిగ్గా డబ్బు సంపాదించే మార్గాలు అన్వేషిస్తున్నాడు. ఇదిలా ఉండగా... నేపాల్‌కు చెందిన మీర్జా సాఖిబ్ బేగ్‌తో అతడికి కొన్నేళ్లుగా స్నేహం ఉంది. నేపాల్ వెళ్లిన సందర్భాల్లో వీరు కలుస్తుండేవాళ్లు. ఇటీవల అక్కడికి వెళ్లిన దీపక్‌కు బేగ్ ఏనుగు దంతంలోని ఓ భాగాన్ని అందించాడు. దాన్ని హైదరాబాద్ తీసుకెళ్లి విక్రయించాలని, వచ్చిన మొత్తాన్ని ఇద్దరం పంచుకుందామని చెప్పాడు. ఈ ప్రతిపాదనకు అంగీకరించిన దీపక్ ఆ ఏనుగు దంతం ముక్కను తన బ్యాగ్‌లో పెట్టుకుని నగరానికి చేరుకున్నాడు. రూ.15 లక్షలకు విక్రయించడం ద్వారా తాను రూ.5 లక్షలు తీసుకుని బేగ్‌కు రూ.10 లక్షలు పంపాలని భావించాడు. ఖరీదు చేసే వ్యక్తుల కోసం ఆరా తీస్తున్నాడు. దీనిపై దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందడంతో ఇన్‌స్పెక్టర్ డి.అనిల్‌కుమార్ నేతృత్వంలో ఎస్సైలు షేక్ బుర్హాన్, ఎన్.శ్రీశైలం, వి.నరేందర్, కె.నర్సింహులుతో కూడిన బృందం రంగంలోకి దిగింది. గురువారం దీపక్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు అతడితో పాటు స్వాధీనం చేసుకున్న ఏనుగు దంతం ముక్కను అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. బేగ్ చిక్కితేనే ఇది అతడికి ఎక్కడి నుంచి వచ్చిందనేది తేలుతుందని, అతడి కోసం గాలిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

విద్యార్థిని హత్య కేసులో

నిందితుడికి జీవిత ఖైదు


నిందితుడు అంతటి శేఖర్

రంగారెడ్డి జిల్లాకోర్టులు: వనస్థలిపురం ఠాణా పరిధిలో 2010లో నమోదైన విద్యార్థిని హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 50వేలు జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 11వ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి వై.జయ ప్రసాద్ గురువారం తీర్పు చెప్పారు 11వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు పీపీ రవికుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అంతటి శేఖర్(24) అనే యువకుడు ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. అతడికి తన జూనియర్ దివ్య(20)తో పరిచయం ఉంది. ఆమె ఎవరితో మాట్లాడినా శేఖర్ సహించేవాడు కాదు. ఈ విషయమై పలుమార్లు దివ్యను హెచ్చరించాడు. అయినా ఆమె తన మాటలు పట్టించుకోవడం లేదని కోపం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో పథకం ప్రకారం దివ్యను తన స్నేహితుడితో కలిసి తన ఇంటికి భోజనానికి ఆహ్వానించాడు. అతడి మాటలు నమ్మిన దివ్య ఒంటరిగా శేఖర్ ఇంటికి వెళ్లింది. సాయంత్రం వరకు ఇద్దరు కాలక్షేపం చేశారు. ఆ తర్వాత శేఖర్ ఇతరులతో మాట్లాడవద్దన్నా ఎందుకు మాట్లాడుతున్నావని దివ్యను నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. పథకం ప్రకారం ముందుగానే సిద్ధం చేసుకున్న బేస్‌బాల్ బ్యాట్‌తో దివ్య తలపై కిరాతకంగా మోదడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం శేఖర్ ఈ విషయాన్ని మృతురాలి స్నేహితుడికి మెసేజ్ చేశాడు. ఇంటికి తాళం వేసి అక్కడి నుంచి పరారయ్యాడు. మృతురాలి మేనమామ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసుపై వాదోపవాదనలు విన్న న్యాయస్థానం నిందితుడికి పై విధంగా శిక్ష విధిస్తూ గురువారం తుది తీర్పు వెలువరించింది.

డేటా లీక్ కేసు దర్యాప్తు ముమ్మరం

సిట్ ఎదుట హాజరైన కంపెనీల ప్రతినిధులు

సాక్షి, సిటీబ్యూరో: దేశంలోనే అతి పెద్ద డేటా చౌర్యం వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న సైబరాబాద్ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఫరీదాబాద్‌కు చెందిన వినయ్ భరద్వాజ్ సూత్రధారిగా ఉన్న ఈ అంతర్రాష్ట్ర ముఠా 24 రాష్ట్రాలు, 8 మెట్రో నగరాల్లోని దాదాపు 70 కోట్ల మంది డేటా తస్కరించింది. వీరిలో హైదరాబాద్‌కు చెందిన 56 లక్షలు, ఏపీకి చెందిన 2.1 కోట్ల మంది సమాచారం ఉంది. ఈ కేసుకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా జాయింట్ సీపీ కల్మేశ్వర్ సింగెన్వర్ నేతృత్వంలో సిట్ ఏర్పాటైంది. ఈ డేటాను వివిధ కంపెనీల్లో ఉన్న ఇంటి దొంగలే ఈ ముఠాకు అమ్మినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే డేటా లీకైన కంపెనీలకు నోటీసులు జారీ చేసి విచారణ చేయడానికి సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా నోటీసులు అందుకున్న కంపెనీల్లో రెండు సాఫ్ట్‌వేర్ సంస్థల ప్రతినిధులు గురువారం సిట్ ఎదుట హాజరయ్యారు. వీరు పోలీసులు కోరిన సమాచారం ఇవ్వడానికి సంసిద్ధత వ్యక్తం చేస్తూ అందుకు కొంత సమయం కోరినట్లు తెలిసింది. ప్రత్యేక దర్యాప్తు బృందం నాలుగు రోజుల పాటు ఆయా కంపెనీల ప్రతినిధులను ప్రశ్నించనుంది.

వైభవంగా హనుమాన్ జయంతి



ప్రతాప్‌నగర్‌లో హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

భక్త వల్లభుడు ఆంజనేయ స్వామి జయంతి వేడుకలను ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి శుభ వేళ హనుమాన్ జయంతి రావడంతో ఈ రోజుకు ఎంతో ప్రత్యేకత ఏర్పడింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఖైరతాబాద్, ఫిలింనగర్ సోమాజిగూడ ప్రాంతాల్లోని ఆంజనేయ స్వామి ఆలయల్లో తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. – బంజారాహిల్స్



ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల



కృష్ణానగర్‌లో కార్పొరేటర్ రాజ్‌కుమార్...



గాయత్రీహిల్స్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి పక్కన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకురాలు విజయారెడ్డి



ఖైరతాబాద్‌లో యూత్ వింగ్ ఆధ్వర్యంలో...



మామిడి పండ్ల అలంకారంలో నందినగర్ శ్రీ ఆంజనేయ స్వామి



వెంగళరావునగర్ రామాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న చైర్మన్ సుజాత, భక్తులు



నందినగర్‌లో ఆకుపూజ నిర్వహిస్తున్న భక్తులు



పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్లు కంజర్ల సదాశివయాదవ్, కిలారి మనోహర్

సాఫీగా హనుమాన్ విజయయాత్ర

వర్షంతో భక్తులకు తప్పని ఇబ్బందులు



నారాయణగూడ వైఎంసీఏ వద్ద హనుమాన్ విజయయాత్ర

హిమాయత్‌నగర్: హనుమాన్ విజయ యాత్ర నారాయణగూడ పరిసర ప్రాంతాల్లో సాఫీగా సాగింది. గురువారం మధ్యాహ్నం గౌలిగూడ నుంచి నారాయణగూడ వైఎంసీఏ ప్రాంతానికి యాత్ర కొనసాగింది. ఈ నేపథ్యంలో భారీ వర్షం కురవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా యాత్రను తిలకించేందుకు వచ్చిన భక్తులు వెనుదిరిగారు. శోభా యాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయమైన ఘటనలు చోటు చేసుకోకుండా నారాయణగూడ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తప్పును కప్పిపుచ్చుకునేందుకే బీజేపీ నేతల విమర్శలు

ఎమ్మెల్యే దానం నాగేందర్



వెంకటేశ్వరకాలనీ: పదో తరగతి పరీక్షా ప్రశ్నా పత్రాల లీకేజీ వ్యవహారంలో చేసిన తప్పును కప్పిపుచ్చుకనేందుకు బీజేపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. గురువారం ప్రతాప్‌నగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే లక్ష్యంతో బండి సంజయ్ నేతృత్వంలో పదో తరగతి పరీక్షా పత్రాలు లీకేజీ అయ్యాయంటూ జనాన్ని గందరగోళ పరిచే ప్రయత్నాలు జరిగాయనే విషయాన్ని పోలీసులు దర్యాప్తు చేసిన అనంతరం తేల్చారన్నారు. బండి సంజయ్‌కి ఇతర నిందితులకు జరిగిన సంభాషణలు, సంబంధాల ఆధారంగానే పోలీసులు అతడిని ప్రధాన నిందితుడిగా చేర్చారని అన్నారు. ఇవన్నీ స్పష్టంగా ఉన్నప్పటికీ ఢిల్లీ నుంచి గల్లీదాకా బీజేపీ నేతలు అవాకులు పేలుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాములు చౌహాన్, టీఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షుడు నల్ల శివ మాదిగ, మాజీ కార్పొరేటర్ భారతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పక్షుల దాహార్తి తీర్చేందుకు తొట్టెల పంపిణీ



తొట్టెను పంపిణీ చేస్తున్న రవి

బంజారాహిల్స్: వేసవిలో పక్షులకు అందుబాటులో నీళ్ల లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుంటాయి. మూగ ప్రాణులపై జాలిచూపిన రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ప్రతినిధులు ఖర్చుకు వెనుకాడకుండా రోడ్ల పక్కన, తమ ఇంటి ముందు భాగంలో ఏర్పాటు చేసుకునేలా నీళ్ల తొట్టెలను పంపిణీ చేశారు. సుమారు వంద వరకు నీళ్ల తొట్టెలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ప్రెసిడెంట్ రవి మాడభూషి మాట్లాడుతూ... సేవాదృక్పథంతో తాము తొట్టెలను అడిగిన అందరికీ అందజేశామన్నారు.

'రానున్నది బీజేపీ ప్రభుత్వమే'



హిమాయత్‌నగర్: భారతీయ జనత పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని హిమాయత్‌నగర్ డివిజన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. హిమాయత్‌నగర్‌లో ఆ పార్టీ జెండాను రాష్ట్ర నాయకుడు రామన్‌గౌడ్, కార్పొరేటర్ మహాలక్ష్మి గౌడ్ ఆవిష్కరించారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని రామన్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

మానసిక రోగుల హక్కులకు సంరక్షణ

సీనియర్ సివిల్ జడ్జి మురళీమోహన్



శ్రీనగర్‌కాలనీ: మానసిక రోగుల హక్కులను లీగల్ ఎయిడ్ క్లినికల్ పరిరక్షిస్తుందని సిటీ సివిల్ కోర్టు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. మురళీమోహన్ అన్నారు. కోవిడ్ తదనంతరం ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో లీడల్ ఎయిడ్ క్లినిక్ సేవలను నిలిపివేశారు. గురువారం ఆయా సేవలను న్యాయమూర్తి పునఃప్రారంభించారు. మానసిక రోగుల హక్కులు, వారికి దక్కాల్సిన పరిహారాలను అందించడానికి తాము కృషి చేస్తామన్నారు. న్యాయవాదులు వేణుగోపాలరావు, మంజులగౌడ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ మనోహర్, డాక్టర్ అనిత, శిరీష పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చిన వ్యక్తిపై కేసు నమోదు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని కౌశిక్ కో ఆపరేటివ్ సొసైటీ కాలనీలో తన ప్లాట్ ప్రహరీని కూల్చివేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. వివరాలివీ... ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో నివసించే జి. శ్వేతారెడ్డికి బంజారాహిల్స్‌లోని కౌశిక్ కో ఆపరేటివ్ సొసైటీలో ప్లాట్ నెం.55 ఉంది. ఇదే ప్రాంతంలో నివసిస్తున్న జితేందర్ అగర్వాల్ అనే వ్యక్తి తన ప్లాట్‌కు తూర్పుభాగంలో ప్రహరీని కూల్చివేసి తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రశాంతంగా ఉన్న తమను ఆందోళనకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము ఈ ప్లాట్‌ను గిఫ్ట్ డీడ్ చేసుకున్నామని సంబంధిత పత్రాలను అందజేశారు. జితేందర్ అగర్వాల్ తమ ప్లాట్ ప్రహరీని అన్యాయంగా కూల్చివేసి కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 447, 427 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుర్వేదంలో మార్పులను స్వాగతించాలి

వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య



ఆస్పత్రి వార్షికోత్సవానికి హాజరైన కార్పొరేటర్ దేదీప్య తదితరులు

వెంగళరావునగర్: ఆయుర్వేదంలో చోటు చేసుకుంటున్న మార్పులను స్వాగతిస్తూ ఆ వైద్య విధానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రస్తుత వైద్య విద్యార్థులపై ఉందని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ తెలియజేశారు. ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల 83వ వార్షికోత్సవం గురువారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ దేదీప్య మాట్లాడుతూ... దేశం గర్వించదగ్గ వైద్యం ఆయుర్వేదమని పేర్కొన్నారు. ఇది చాలా దేశాల్లో సైతం విస్తరించిందని... ఈ పద్ధతుల ద్వారానే పలు దీర్ఘకాలిక వ్యాధులను నయం చేస్తున్నారని అన్నారు. మన దేశ వైద్యానికి ఇతర దేశాల్లో ఎంతో ఆదరణ ఉందని, అయితే ఇక్కడ ఆశించిన స్థాయిలో ఆదరణ లేకపోవడం దురదృష్టకరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూయ మాట్లాడుతూ... దీర్ఘకాలిక రోగాలను సైతం ఆయుర్వేదం ద్వారా నయం చేయవచ్చన్నారు. వైద్య విధానంలో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమలను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఉమాశ్రీనివాస్, డాక్టర్ రమాదేవి, స్టూడెంట్ అడ్వైజర్స్ డాక్టర్ బాబూరావు, డాక్టర్ స్వరూప, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రారెడ్డి, వైద్యులు డాక్టర్ పి.యశోద, డాక్టర్ నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

అవును.. మళ్లించాం

మదుపరుల డబ్బును సొంత పెట్టుబడిగా పెట్టాం ● సీఐడీ విచారణలో మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్

- చిట్‌ఫండ్ చట్టమే తెలీదు.. అసలది మాకు వర్తించదు
- తాము కంపెనీల చట్టాన్ని అనుసరిస్తామంటూ బుకాయింపు
- లేని చెక్కులు బ్యాలన్స్‌షీట్‌లో ఎలా చూపామో నాకు తెలీదు
- అవన్నీ మీకు చెప్పం... ప్రధాన కార్యాలయం రికార్డులూ చూపించం
- ఆధారాలతో సీఐడీ ప్రశ్నించడంతో నీళ్లు నమిలిన శైలజా కిరణ్
- దాహం వేస్తోందంటూ బయటకు వెళ్లి ఆడిటర్లతో మంతనాలు..

'అవును.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులను సొంత పెట్టుబడులుగా పెట్టాం. చందాదారుల సొమ్మును మా అనుబంధ కంపెనీలకు మళ్లించాం. అందుకు కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం -1982 అనుమతించదా? అసలు ఆ చిట్‌ఫండ్స్ చట్టం అంటేనే మాకు తెలీదు. మేం ఆ చట్టాన్ని పట్టించుకోం.. మా చట్టాలు మాకున్నాయి..!'

– ఇదీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో ఏ-2గా ఉన్న సంస్థ ఎండీ చెరుకూరి శైలజా కిరణ్ వాదన.


గురువారం హైదరాబాద్‌లో శైలజా కిరణ్‌ను విచారిస్తున్న సీఐడీ అధికారులు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా సొంత కంపెనీలకు మళ్లించినట్టు సీఐడీ విచారణలో శైలజా కిరణ్ దాదాపుగా అంగీకరించారు. ఈ కేసులో ఏ-1గా ఉన్న చెరుకూరి రామోజీరావు ఇప్పటికే నిధులు మళ్లించామని సీఐడీ విచారణలో పరోక్షంగా అంగీకరించారు. తాజాగా చెరుకూరి శైలజ కూడా నిధులు మళ్లించినట్టు సమ్మతించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే దేశంలో చట్టాలకు తాము అతీతం అన్నట్టుగా ఆమె సీఐడీ అధికారుల ఎదుటే అడ్డగోలుగా వాదించడం విస్మయపరుస్తోంది. చిట్‌ఫండ్స్ వ్యాపారం చేస్తూ కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం తమకు వర్తించదని దబాయించడం రామోజీరావు, ఆయన కుటుంబం బరితెగింపునకు నిదర్శనంగా నిలుస్తోంది. సీఐడీ అధికారులకు రికార్డులు చూపించబోమని శైలజా కిరణ్ భీష్మించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో ఏ-2గా ఉన్న చెరుకూరి శైలజను సీఐడీ అధికారులు గురువారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసంలో విచారించారు. సీఐడీ ఎస్పీ అమిత్ బర్దర్, విచారణ అధికారి రవికుమార్‌లతోపాటు 25 మంది అధికారుల బృందం గురువారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు విచారించింది. శైలజ తరఫున ఢిల్లీ నుంచి వచ్చిన ఇద్దరు సుప్రీం కోర్టు న్యాయవాదులతోపాటు తెలంగాణ హైకోర్టు న్యాయవాది కూడా విచారణ ప్రక్రియ సమయంలో ఉన్నారు. నిబంధనలకు అనుగుణంగా నిర్వహించిన విచారణను సీఐడీ అధికారులు ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు. దాదాపు 75 ప్రశ్నలకు వివరాలు రాబట్టి వాంగ్మూల పత్రంపై శైలజ సంతకం తీసుకున్నారు. గతంలో తనిఖీల్లో కనుగొన్న ఆధారాలకు మరింత బలాన్ని చేకూర్చే విధంగా శైలజ నుంచి పలు కీలక విషయాలను సీఐడీ అధికారులు రాబట్టినట్టు తెలుస్తోంది. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం విచారణలో ఆమె వెల్లడించిన విషయాలు ఇలా ఉన్నాయి...

చందాదారుల సొమ్మును మళ్లించాం

మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో తనిఖీల్లో సేకరించిన పలు కీలక ఆధారాలను ప్రదర్శిస్తూ సీఐడీ అధికారులు శైలజను విచారించారు. ప్రధానంగా చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా సొంత పెట్టుబడులుగా పెట్టడం, మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్లలో పెట్టుబడులుగా పెట్టడంపై ప్రశ్నించినట్లు సమాచారం. మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులను రామోజీ గ్రూపునకు చెందిన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌తోపాటు మార్గదర్శి చిట్‌ఫండ్స్ (కర్ణాటక)- బెంగళూరు, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్-చెన్నైలలో అక్రమ పెట్టుబడులు పెట్టినట్టు బ్యాలన్స్ షీట్ నోట్ నంబర్ 40లో పేర్కొన్న విషయాన్ని ఆమెకు చూపించారు. ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఏకంగా 88.5 శాతం వాటా మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరిటే ఉంది. ''అవును.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులను ఆ కంపెనీల్లో పెట్టుబడి పెట్టాం..'అని శైలజ అంగీకరించినట్లు సమాచారం.

కంపెనీల చట్టం అనుసరిస్తామంటూ...

సీఐడీ అధికారులు అదే విషయంపై గుచ్చిగుచ్చి ప్రశ్నించడంతో తాము కంపెనీల చట్టాన్ని అనుసరిస్తున్నామని శైలజ పేర్కొనట్టు సమాచారం. చిట్‌ఫండ్స్ వ్యాపారానికి కంపెనీల చట్టంతో నిమిత్తం లేదని, అనుసరించాల్సింది కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం -1982 కదా? అని అధికారులు ప్రశ్నించగా ఆమె సమాధానం ఇచ్చేందుకు నిరాకరించినట్టు తెలుస్తోంది. పోనీ కంపెనీల చట్టాన్ని అనుసరిస్తున్నారని భావించినా... ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 88.5 శాతం వాటాతోపాటు మరో రెండు కంపెనీల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ పెట్టుబడులు పెట్టినట్టు బ్యాలన్స్ షీట్‌లో చూపించారు కదా? అని అధికారులు ప్రశ్నించడంతో అవునని ఆమె సమాధానమిచ్చారు. కంపెనీల చట్టం ప్రకారం 50 శాతానికి మించి వాటా కలిగి ఉంటే అనుబంధ కంపెనీగానే పరిగణిస్తారు కదా? అని తిరిగి ప్రశ్నించగా అందుకు కూడా ఆమె అవుననే సమాధానమిచ్చినట్టు తెలుస్తోంది. అంటే మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిబంధనలకు విరుద్ధంగా మరో రెండు కంపెనీల్లో 88 శాతం పెట్టుబడులు పెట్టి అనుబంధ కంపెనీగా ఉన్నట్టే కదా? అని అధికారులు ప్రశ్నించగా ఆమె మౌనం వహించినట్లు సమాచారం. అటు చిట్‌ఫండ్స్ చట్టం.. ఇటు కంపెనీల చట్టాన్ని కూడా యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నట్టు ఆమె సమ్మతించినట్లైంది.

ఏటా మార్చి 31న రూ.వందల కోట్ల చెక్కులు

విచారణ సందర్భంగా సీఐడీ మరో కీలక ఆధారాన్ని సేకరించింది. చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా మళ్లిస్తున్న రామోజీరావు, శైలజ రికార్డుల్లో మాత్రం చట్టాన్ని ఏమార్చేందుకు యత్నించారని నిరూపితమైంది. 2022 మార్చి 31న రూ.255 కోట్ల విలువైన చెక్కులు వచ్చినట్లు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్యాలన్స్ షీట్‌లో చూపించారు. కానీ ఆ చెక్కులేవీ తరువాత నగదుగా మారినట్లు (ఎన్‌క్యాష్)గా రికార్డుల్లో లేవని సీఐడీ అధికారులు గుర్తించారు. గరిష్టంగా పది రోజుల్లో చెక్కులను నగదుగా జమ చేస్తామని శైలజ పేర్కొన్నారు. మరి గతేడాది మార్చి 31న వచ్చినట్లు చూపించిన రూ.255 కోట్ల చెక్కులేవీ నగదుగా మారినట్లు రికార్డుల్లో ఎందుకు లేవని సీఐడీ అధికారులు ప్రశ్నించడంతో శైలజ తెల్లమొహం వేశారని సమాచారం. కొన్ని దశాబ్దాలుగా ఏటా మార్చి 31న రూ.వందల కోట్ల విలువైన చెక్కులు వచ్చినట్లు రికార్డుల్లో చూపుతున్నా అవి నగదుగా మాత్రం మారడం లేదు. ఎందుకంటే ఏటా చందాదారులు చెల్లిస్తున్న రూ.వందల కోట్లను మార్గదర్శి యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా సొంత ప్రయోజనాలకు మళ్లిస్తోంది. ఆర్థిక సంవత్సరం చివరిలో ఆ నిధులు ఉన్నట్లుగా చూపించాల్సి రావడంతో చెక్కులు వచ్చినట్లు చూపించి కనికట్టు చేస్తోంది. ఆ నిధులను రామోజీరావు కుటుంబ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు.

ప్రధాన కార్యాలయంలో ఉన్నాయి కానీ.. చూపించను

లేని చెక్కులు ఉన్నట్టుగా చూపించి మోసానికి పాల్పడినట్టు నిరూపితం కావడంతో శైలజ షాక్‌కు గురయ్యారు. దాంతో సీఐడీ అధికారులను పక్కదారి పట్టించేందుకు యత్నించినట్టు తెలుస్తోంది. 'ఆ చెక్కుల సమాచారం అంతా ప్రధాన కార్యాలయంలో ఉంటుంది... నాకు తెలీదు'అని పేర్కొన్నారు. అక్కడకు వెళ్లి పరిశీలిద్దామని సీఐడీ అధికారులు సూచించగా ఆమె నిరాకరించారు. పోనీ మార్గదర్శి సిబ్బంది ద్వారానైనా ఆ వివరాలు అందించాలని సూచించగా అందుకు కూడా ఆమె ఒప్పుకోలేదు. వీడియో రికార్డింగ్ ద్వారా పారదర్శకంగా చెక్కుల రికార్డులు పరిశీలిస్తామని చెప్పినా ఆమె ససేమిరా అన్నారు. అంటే చెక్కుల వివరాలు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రధాన కార్యాలయంలో కూడా లేవా? అని ప్రశ్నించగా ఆమె మౌనం దాల్చినట్లు సమాచారం.

ఏపీ రికార్డులు ప్రత్యేకంగా లేవు

చిట్‌ఫండ్స్ చట్టం ప్రకారం చిట్‌ఫండ్ కంపెనీలు ఏ రాష్ట్రానికి సంబంధించిన రికార్డులు ఆ రాష్ట్రానికి ప్రత్యేకంగా నిర్వహించాలి. అక్కడి చందాదారులు చెల్లిస్తున్న మొత్తం, చిట్టీల వివరాలు, ఆదాయ-వ్యయాలు, బ్యాలన్స్‌షీట్‌ను ప్రత్యేకంగా రూపొందించాలి. ఈ నిబంధనను మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఆంధ్రప్రదేశ్ చందాదారులు చెల్లిస్తున్న మొత్తం, ఇతర వివరాలను తెలంగాణ, ఇతర రాష్ట్రాల రికార్డులతో పాటు కలిపి నిర్వహిస్తోంది. మార్గదర్శి చందాదారుల్లో సింహభాగం అంటే 60 శాతం వరకు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే ఉన్నారు. ఆ నిధులను నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. రామోజీరావు కుటుంబానికి చెందిన ఇతర కంపెనీల్లో పెట్టుబడిగా పెడుతున్నారు. ఆ విషయం బయటపడకుండా ఉండేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ రికార్డుల నిర్వహణలో అక్రమాలకు పాల్పడుతోంది. ఇదే విషయాన్ని సీఐడీ అధికారులు ప్రస్తావించగా తాము అలాగే రికార్డులు నిర్వహిస్తామని శైలజ చెప్పినట్టు సమాచారం.

నీళ్లు నమిలి... నీళ్లు తాగి

సీఐడీ అధికారులు నిబంధనలు పాటిస్తూ శైలజా కిరణ్‌ను విచారించారు. విచారణకు ఆమె ఏమాత్రం సహకరించకపోయినా సరే ఇబ్బంది పెట్టకుండా...ఒత్తిడి చేయకుండా ప్రశ్నలు సంధించారు. గురువారం రోజు మధ్యాహ్నం వరకు సాగిన మొదటి విడతలో చాలా ప్రశ్నలకు నాకు తెలియదు.. గుర్తులేదు...నాకు సంబంధం లేదు అంటూ ఆమె సమాధానాలు దాటవేసేందుకు యత్నించారు. మధ్యాహ్న భోజన విరామం తరువాత సీఐడీ అధికారులు విచారణ జోరు పెంచారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలకు సంబంధించిన ఆధారాలను ఆమె ముందు ఉంచుతూ ఒక్కొక్క అంశంపై ప్రశ్నించారు. దీంతో శైలజకు నోట మాట రాలేదు. కాదు అని చెప్పేందుకు అవకాశం లేదు. దాంతో చాలా ప్రశ్నలకు ఆమె నీళ్లు నమిలినట్లు సమాచారం. విచారణ సందర్భంగా ఆమె పలు సార్లు తనకు దాహం వేస్తోందంటూ బయటకు వెళ్లి వచ్చారు. తమ ఆడిటర్లు, ఇతరులతో సంప్రదించి వచ్చి నాకు తెలియదు.. గుర్తు లేదు అని సమాధానాలు దాటవేసేందుకు యత్నించారు.

చూపు సరిగా లేదు.. కనిపించడం లేదు

మార్గదర్శి కార్యాలయాల్లో సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలను ల్యాప్‌టాప్‌లో సీఐడీ అధికారులు శైలజకు చూపించారు. నిధులు మళ్లించినట్టు అందులో ఉన్న వివరాలను చూపిస్తూ అవి వాస్తవమేనా? అని అడిగారు. అయితే ఆ పత్రాలు తనకు కనిపించడం లేదని... అక్షరాలు చిన్నవిగా ఉన్నాయని ఆమె పేర్కొనడంతో సీఐడీ అధికారులు ల్యాప్‌టాప్‌లో ఎన్‌లార్జ్ చేసి మరీ చూపించారు. 'నాకు చూపు సరిగా లేదు... ఆ పత్రాల్లో ఏముందో కనిపించడం లేదు'అని శైలజ పేర్కొనడంతో సీఐడీ అధికారులు విచారణ ప్రక్రియలో మధ్యవర్తిగా ఉన్న వ్యక్తిని పిలిచి ఆ పత్రాలు చూపించారు. అవి తనకు కనిపిస్తున్నాయని ఆయన చెప్పడంతో పాటు అందులో ఏముందో చదివి వినిపించారు. దీంతో తనకు ఏమీ కనిపించడంలేదని తప్పించుకునేందుకు శైలజ చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది.

మాకు ఏ చట్టాలు వర్తించవు..
మా చట్టం మాకుంది

చందాదారులు చెల్లించిన నిధులను ఇతర కంపెనీలకు మళ్లించడం కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం-1982కు వ్యతిరేకం కదా...! ఆ చట్టంలోని సెక్షన్ 24 ప్రకారం అందుకు రెండేళ్ల జైలు శిక్ష పడుతుందని తెలుసు కదా..? అని సీఐడీ అధికారులు శైలజను ప్రశ్నించారు. అయితే అసలు చిట్‌ఫండ్స్ చట్టమే తనకు తెలియదని ఆమె చెప్పడంతో సీఐడీ అధికారులు విస్తుపోయారు. చిట్‌ఫండ్స్ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న మీకు అసలు చిట్‌ఫండ్స్ చట్టమే తెలియదా? అని సీఐడీ అధికారులు ప్రశ్నించినట్టు సమాచారం. చిట్‌ఫండ్స్ చట్టం- 1982ను తాము అనుసరించబోమని ఆమె సమాధానం ఇవ్వడంతో నివ్వెరపోవడం సీఐడీ అధికారుల వంతైంది. మరి చిట్‌ఫండ్స్ వ్యాపారం ఎలా చేస్తున్నారని ప్రశ్నించగా.. మా చట్టాలు మాకున్నాయి... వాటి ప్రకారం చేస్తున్నాం అని ఆమె బదులిచ్చినట్లు సమాచారం. చిట్‌ఫండ్స్ కంపెనీలు అక్రమాలకు పాల్పడకుండా కేంద్ర ప్రభుత్వం 1982లోనే చేసిన చట్టం గురించి కూడా తెలుసుకోకుండా... అసలు ఆ చట్టాన్ని పట్టించుకోకుండా చిట్‌ఫండ్స్ వ్యాపారం చేస్తున్నామని శైలజ చెప్పడం గమనార్హం.

రామోజీ, శైలజను అమరావతిలో విచారిస్తాం

'మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో ఏ-1 చెరుకూరి రామోజీరావు, ఏ-2 శైలజను త్వరలో అమరావతిలో మరోదఫా విచారిస్తాం. ఈ కేసులో ఇప్పటికే వారిద్దరినీ విచారించి వాంగ్మూలాలు నమోదు చేశాం. వాటిని విశ్లేషించిన అనంతరం మరి కొన్నిసార్లు విచారించాల్సి ఉంటుంది. ఈసారి వారిద్దరూ విచారణ కోసం అమరావతికి రావాల్సి ఉంటుంది. నిబంధనల మేరకు విచారణ కొనసాగుతోంది. శైలజ ఈ నెల 13న విచారణకు హాజరు కావాల్సి ఉంటుందని ఆమెకు ఇప్పటికే సమాచారమిచ్చాం. ఈదఫా ఆమెను అమరావతిలో విచారిస్తాం'.

– అమిత్ బర్దర్, ఎస్పీ, సీఐడీ

ఇది ప్రాణం విలువ తెలిసిన ప్రభుత్వం

'ఫ్యామిలీ డాక్టర్'ప్రారంభ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్



సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఫ్యామిలీ డాక్టర్ విధానం దేశానికే రోల్ మోడల్‌గా, వైద్య ఆరోగ్య రంగంలో నూతన అధ్యాయంగా నిలుస్తుందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ విధానం రాబోయే రోజుల్లో దేశం మొత్తం మన వద్ద కాపీ చేసుకుని, అమలు చేసే రోజు వస్తుందని ఆకాంక్షించారు. మనిషి ప్రాణం విలువ తెలిసిన ప్రభుత్వంగా ఈ కార్యక్రమం మొదలు పెడుతున్నామని చెప్పారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గం లింగంగుంట్ల గ్రామంలో గురువారం ఆయన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభించారు. అక్కడి విలేజ్ క్లినిక్‌ను సందర్శించి, అక్కడ అందుతున్న వైద్య సేవలు, చేస్తున్న పరీక్షలు, అందుబాటులో ఉన్న మందుల గురించి వైద్య సిబ్బందితో ఆరా తీశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. 'ఇక డాక్టర్ కోసం మీ గ్రామం నుంచి ఎక్కడెక్కడికో పట్టణాలకు పోవాల్సిన అవసరం లేదు. డాక్టరే మీ గ్రామానికి వస్తాడు. మీ ఇంటి చేరువకే వస్తాడు. మీ కుటుంబం కోసం, మన పేదల కోసం అక్కడికే వైద్యుడితో పాటు వైద్య సేవలు కూడా వస్తాయి. అక్కడే మీ జబ్బుల గురించి తెలుసుకుని, అక్కడే మందులు ఇచ్చే గొప్ప కార్యక్రమమే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్'అని చెప్పారు.

బాబుకు స్కామ్‌లే తప్ప.. స్కీమ్‌లు తెలియవు

'స్కామ్‌లు చేయడమే తప్ప స్కీంలు తెలియని బాబులు ఉన్నారు. వారికి అధికారంలో ఉండగా దోచుకో.. పంచుకో.. తినుకో.. మాత్రమే తెలుసు. లంచావతారాలు, గజ దొంగలు, వయసు పెరిగినా బుద్ధి పెరగని క్రిమినల్ మంచావతారాలు, సామాజిక అన్యాయం తప్ప న్యాయం తెలియని పరాన్న జీవులు.. ఇలా ఒకరు చంద్రబాబు రూపంలో, ఒకరు ఈనాడు రూపంలో, ఒకరు ఆంధ్రజ్యోతి, మరొకరు టీవీ5 రూపంలో.. వీరికి తోడుగా ఒక దత్తపుత్రుడు రూపంలో కనిపిస్తారు. ఫలానా మంచి పని చేశామని చెప్పుకోలేని వీరికి మిగిలింది జిత్తులు, ఎత్తులు, పొత్తులు, కుయుక్తులు మాత్రమే. వీటితో మాత్రమే వీరు రాజకీయాలు చేస్తున్నారు. మీ బిడ్డ నవరత్నాలతో సంక్షేమ పాలన అందిస్తుంటే, దీనికి అక్క చెల్లెమ్మల నుంచి వస్తున్న మద్దతు చూసి తట్టుకోలేక తోడేళ్లన్నీ ఒక్కటవుతున్నాయి. నాకు ఎవరితోనైనా పొత్తు ఉందంటే అది ప్రజలతో మాత్రమే. నాకు కుయుక్తులు చేత కాదు. అబద్ధాలు చెప్పలేను. మోసం చేయలేను. పన్నాగాలు, జిత్తులు చేత కాదు. నేను ఏది చెప్తానో అదే చేస్తాను. మీ ఇంట్లో మంచి జరిగిందా లేదా.. అన్నది కొలమానంగా తీసుకోండి. మీకు మంచి జరిగితే మీ బిడ్డకు తోడుగా సైనికుల్లా నిలబడండి' అని జగన్ కోరారు.

నగర వార్తలు

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు అరుదైన గౌరవం


జంధ్యాల ప్రభాకర్‌రావు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌కు అరుదైన గౌరవం లభించింది. యునెస్కో ఐఎఫ్ఏపీ డెవలప్‌మెంట్ కోసం వర్కింగ్ గ్రూప్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ చైర్మన్‌గా హెచ్‌సీయూ ప్రొఫెసర్ జంధ్యాల ప్రభాకర్‌రావు నామినేట్ అయ్యారు.ప్రొఫెసర్ జంధ్యాల ప్రభాకరావు సెంటర్ ఫర్ అప్‌లైడ్ లింగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్‌లో ప్రొఫెసర్‌గా విధులను నిర్వహిస్తున్నారు. ఆయన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల(ఎస్‌డీజీలు-2030)సాధించడానికి ప్రపంచ వ్యాప్తంగా ఇన్ఫర్మేషన్ ఫర్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి వివిధ కార్యకలాపాలను ప్లాన్ చేయడం, సమన్వయం చేయడంలో నిమగ్నమవుతారు. ప్రొ. జంధ్యాల ప్రభాకర్‌రావు గతంలో ఐఎఫ్ఏపీ బ్యూరో సభ్యునిగా భారతదేశం నుంచి యునెస్కో డిపార్ట్‌మెట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌తో భారత జాతీయ కమిషన్ ద్వారా నామినేట్ చేయబడడం విశేషం.

ఈ నెల 14 లోపు హజ్‌యాత్ర దస్తావేజులు సమర్పించాలి

రాష్ట్ర హజ్ కమిటీ ఈవో బి.షఫీవుల్లా

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రవ్యాప్తంగా హజ్ యాత్రకు ఎంపికైన యాత్రికులు ఈ నెల 12వ తేదీ వరకు యాత్రకు అయ్యే ఖర్చుల మొదటి విడుత రూ. 81,800 కేంద్ర హజ్ కమిటీ పేరుతో చలాన్ తీయాలి హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి బి.షఫీవుల్లా తెలిపారు. గురువారం యాత్రకు సంబంధించిన ఖర్చులు, దస్తావేజులు జమ చేయాల్సి విషయాలను వెల్లడించారు. ఎంపికైన యాత్రికులు తొలుత రూ. 81,800 జమచేసిన అనంతరం యాత్రకు అయ్యే మొత్తం ఖర్చు రానున్న నెల రోజుల్లో జమ చేయాల్సి ఉంటుందని, ఖర్చుల విషయంలో ఇంకా కేంద్ర హజ్ కమిటీ పూర్తి సమాచారం ఇవ్వలేదన్నారు. ఎంపికైన యాత్రికులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలోని ఏదైనా శాఖ నుంచి కేంద్ర హజ్ కమిటీ పేరుతో చలానా తీయాలని కోరారు. చలనా రాసే సమయంలో హజ్ కమిటీ కేటాయించిన నెంబర్‌తో పాటు బ్యాంక్ నిర్ధారణ నంబర్‌ను కచ్చితంగా రాయాలని సూచించారు. ఏ, బీ క్యాటగిరీ ద్వారా ఎంపికైన వారి పాస్‌పోర్టులు, ఫొటు కార్యాలయంలో ఈ నెల 14 వరకు జమ చేయాలన్నారు. రుసుం జమ చేసిన రసీదుతో పాటు జనరల్ క్యాటగిరీలో ఎంపికైన యాత్రి కులు తమ ఒరిజినల్ పాస్‌పోర్ట్, ఫొటో, మెడికల్ సర్టిఫికెట్‌తో పాటు కరోనా వ్యాక్సినేషన్ రెండు డోస్ వేసుకున్న సర్టిఫికెట్ సైతం జమచేయాల్సి ఉంటుందన్నారు. మరింత సమాచారం కోసం 040-23298793 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రజల కోసమే పనిచేస్తాం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

కాచిగూడ: దేశ ప్రజల కోసం నిరంతరంగా పని చేస్తామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.గౌతంరావు ఆధ్వర్యంలో గురువారం బర్కత్‌పురలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ ఏనాడూ అధికారం కోసం పనిచేయలేదని, ప్రజలు, సిద్ధాంతం కోసమే పని చేస్తోందన్నారు. పార్టీ సిద్ధాంతం కోసం ఎందరో కార్యకర్తలు త్యాగాలు చేశారని గుర్తు చేశారు. దేశాన్ని విశ్వగురువుగా నిలిపేందుకు ప్రధాని నరేంద్రమోదీ ముందుకు సాగుతున్నారని అధికారం కోసమే పని చేసే పార్టీలు దేశంలో మనుగడ సాగించలేవని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ఆరాచక, నియంతృత్వ, కుటుంబ పాలన కొనసాగుతోందని రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎస్.గౌతంరావు మాట్లాడుతూ... కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, అందుకే దేశ ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నె ఉమ రమేష్ యాదవ్, పద్మ వెంకటరెడ్డి, అమృత, నేతలు బి.వెంకట్ రెడ్డి, ఎ.సూర్యప్రకాష్ సింగ్, కేశబోయిన శ్రీధర్, వనం రమేష్, కృష్ణాగౌడ్, సందీప్, ప్రవీణ్, జగన్, ఎం.బి. కిషోర్ పాల్గొన్నారు.

సమాజాన్ని ప్రశ్నించేదే నాటకం

డాక్టర్ కేవీ.రమణాచారి


కళాకారులను సన్మానిస్తున్న కేవీ రమణాచారి

గన్‌ఫౌండ్రీ: సమాజాన్ని ప్రశ్నించేదే నాటకమని అలాంటి నాటక రంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో మూడ్రోజుల పాటు నిర్వహిస్తున్న యవనిక నాటకోత్సవాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ.. యువ నాటకోత్సవాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతగానో ఉందని అభిప్రాయపడ్డారు. నాటక రంగం ఎంతో గొప్పది అని తాను స్వతహాగా నాటకరంగ అభిమానినని తెలిపారు. అనంతరం డాక్టర్ కోట్ల హన్మంతరావు దర్శకత్వంలో రామప్ప, మంచాల రమేష్ దర్శకత్వంలో చీకటి పువ్వు నాటకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి, తెలుగు చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ కురుమాచలం, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

రెండో అంతస్తు నుంచి పడి చిన్నారి మృతి

బాలానగర్: ఆడుకుంటూ రెండవ అంతస్తుకు వెళ్లి ప్రమాదవశాత్తు కిందపడి ఓ బాలుడు మృతి చెందిన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం నజర్‌ఖాన్ తన కుటుంబ సభ్యులతో కలిసి కల్యాణినగర్‌లో ఉంటున్నాడు. ఈ నెల 5వ తేదీన 17 నెలలు వయస్సున్న నజర్‌ఖాన్ కుమారుడు అశ్విన్‌ఖాన్ ఆడుకుంటూ భవనం రెండవ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఊపందుకున్న ఫ్యామిలీ ట్రావెల్

టాప్-4 గమ్యస్థానంగా హైదరాబాద్



సాక్షి, సిటీబ్యూరో: సకుటుంబ సపరివార సమేతంగా చేసే ప్రయాణాలు దేశంలో మళ్లీ ఊపందుకున్నాయి. కోవిడ్ నేపథ్యంలో గణనీయంగా పడిపోయిన ఫ్యామిలీ ట్రావెల్ గతేడాది 90 శాతం పెరిగింది. పరివార్‌తో కలిసి సందర్శించేందుకు ఎంపిక చేసుకునే నగరాల్లో టాప్-4లో హైదరాబాద్ నిలిచింది. పర్యాటకులకు వసతి సౌకర్యాలకు పేరొందిన ప్రముఖ సంస్థ ఎయిర్ బీఎన్‌బీ అధ్యయనం ఈ విశేషాలను వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఎయిర్ బీఎన్‌బీ వేదికగా కుటుంబ ప్రయాణం గతేడాది 90 శాతం పెరిగిందని (ప్రపంచవ్యాప్త పెరుగుదలతో పోలిస్తే 30శాతం అధికం) దాదాపు 90,000 గమ్యస్థానాల్లో 15 మిలియన్లకు పైగా చెక్-ఇన్‌లు చోటుచేసుకున్నాయని ఈ స్టడీ తేల్చింది. గత ఏడాది కుటుంబ సమేతంగా టూర్లు వెళ్లడం పెరగడంతో పాటు తమ పెట్స్‌ను సైతం తమతో తీసుకువెళ్లడానికి పర్యాటకులు ఆసక్తి చూపించారు. అందుకు అనుగుణంగా తగిన వసతి సౌకర్యాల కోసం అన్వేషించారని అధ్యయనం వెల్లడించింది. అంతకు ముందుతో పోలిస్తే అత్యధికంగా పెంపుడు జంతువులు గతేడాది 5 మిలియన్ల పైగానే ప్రయాణాల్లో భాగం పంచుకున్నాయి.

టాప్ 10 నగరాలివే..

దేశవ్యాప్తంగా ప్రజలు కుటుంబాలతో కలిసి తమకు ఇష్టమైన పలు ప్రాంతాలకు ప్రయాణించారు. అలా చేసిన ప్రయాణాల్లో అత్యధికులు ఎంచుకున్న గమ్యస్థానాల్లో గోవా తొలి స్థానంలో నిలువగా ఆ తర్వాత స్థానంలో బెంగళూర్ పూణె, మన హైదరాబాద్, ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ వరుసగా టాప్-5లో చోటు దక్కించుకున్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో రాజస్తాన్‌లోని జైపూర్, మహారాష్ట్రలోని రాయ్‌ఘర్, కేరళలోని ఎర్నాకులం, న్యూఢిల్లీ, ఉత్తరాఖండ్ రాష్ట్రం లోని నైనిటాల్ వరుసగా ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి.

తెలంగాణను ఎలా చూడాలో నాకు తెలుసు

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్


బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో డేకేర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్

బంజారాహిల్స్: తాను గైనకాలజీ డాక్టర్‌నని, పిల్లలను ఎలా హ్యాండిల్ చేస్తానో కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని కూడా అలానే చూస్తున్నానని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో రేఖా రాజశేఖర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డే కేర్ రెండో యూనిట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ఈ రాష్ట్రానికి గవర్నర్‌గా వచ్చిన సందర్భంగా 'ఈమె ఏం చేస్తుందని?' వ్యాఖ్యానాలు చేశారని, అప్పుడే పుట్టిన బిడ్డలాంటి తెలంగాణను ఎలా చూడాలో ఎందరో చిన్నారుల ప్రసవం సందర్భంగా, తర్వాత చికిత్స అందించిన గైనకాలజిస్టుగా తనకు బాగా తెలుసన్నారు.


కేన్సర్‌పై అందరికీ అవగాహన అవసరమని మహిళల్లో రొమ్ము కేన్సర్ ఎక్కువగా వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని తాత, ముత్తాతలు తీసుకున్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల చాలా అనారోగ్య సమస్యలు దూరమవుతాయని అన్నారు. ఈ ఆస్పత్రిలో 650 బెడ్స్‌తో ఎంతో మంది పేదలకు వైద్యం అందిస్తున్నారని కొత్తగా ఏర్పాటు చేసిన డే కేర్ యూనిట్‌తో మరింత మందికి వైద్యం అందించవచ్చునని అన్నారు. కేన్సర్ రాకుండా ముందుగానే నివారించు చర్యలు చేపట్టాలని అందుకోసం ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఒక ఆస్పత్రిని నడపడం ఎంత కష్టమో వైద్యురాలిగా తనకు తెలుసన్నారు. ఈ యూనిట్‌ను ఏర్పాటు చేసిన డాక్టర్ రాజశేఖర్ కుమారులు రాజీవ్, రంజిత్, రంజన్‌లను ఆమె ప్రశంసించారు.

వ్యాయామం చేయలేని వారికి యోగా ప్రత్యామ్నాయం


ఏటికూరి కృష్ణమూర్తిని సన్మానిస్తున్న వైద్య బృందం

బంజారాహిల్స్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 102 సంవత్సరాల వయసున్న స్వాతంత్ర్య సమరయోధులు ఏటికూరి కృష్ణమూర్తిని గురువారం బంజారాహిల్స్ రోడ్ నెం 10లోని కేర్ ఆస్పత్రిలో ఘనంగా సత్కరించారు. ఈ ఏడాది ప్రజారోగ్యానికి సంబంధించిన ప్రాధాన్యత ప్రాంతాన్ని హైలెట్ చేయడానికి అందరికీ ఆరోగ్యం అనే థీమ్‌తో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సీవోవో నీలేష్ గుప్తా తెలిపారు. కృష్ణమూర్తి దినచర్యలు, ఆరోగ్య రహస్యాలు ఆస్పత్రి సిబ్బందికి తెలిసేలా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, ఆయన రాసిన ప్రజా వైద్యం అనే పుస్తకం ఎంతో మందిని ఆకట్టుకుంటుందన్నారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. మన జీవన శైలి, అలవాట్లే మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తాయన్నారు. ఆహార పదార్థాలు తీసుకునే పద్ధతులు, శరీరాన్ని అనారోగ్యానికి గురి చేస్తాయన్న విషయాన్ని గుర్తు చేశారు. ఫిట్‌నెస్, ఆరోగ్య స్పృహ పెరిగిన నేపథ్యంలో చాలా మంది జీవితాల్లో యోగా ఒక భాగమైందని దీని వల్ల శారీరకంగానే కాదు, మానసికంగా కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అజిత్ సింగ్, అగస్టిన్, సద్దాం పాల్గొన్నారు.

న్యాయవాద సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు



రంగారెడ్డి కోర్టులు: జిల్లా కోర్టులో న్యాయవాద సంఘం నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. సంఘం అధ్యక్షుడు డీకొండ రవీందర్, ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి.మాధవరెడ్డి, సంయుక్త కార్యదర్శి రామ్‌చందర్, కోశాధికారి రామకృష్ణ, లైబ్రేరియన్ యజ్ఞమూర్తి, మహిళా ప్రతినిధి జ్యోతి, సభ్యులు అనిత, దీప్తి నాగేందర్, రమకృష్ణా రెడ్డి, గోపాల్, వెంకట్ రెడ్డి, కిరణ్ కుమార్, సాయి కుమార్ రెడ్డి గత శుక్రవారం జరిగిన ఎన్నికల్లో గెలుపొందగా గురువారం బాధ్యతలు స్వీకరించారు.

‘ఫోకస్’ తప్పుతోంది

పిల్లల నుంచి పెద్దవారిదాకా తగ్గిపోతున్న ఏకాగ్రత

- స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, టీవీల వంటి డిజిటల్ పరికరాలే కారణం
- ఏ పనిపైనా ధ్యాస నిలపలేని పరిస్థితి
- ఆలస్యం, మానసిక ఒత్తిడి, అకారణంగా చిరాకు వంటి సమస్యలు
- ప్రధానంగా ఫోన్‌తో ఎక్కువ సమస్య అంటున్న నిపుణులు
- ‘మైండ్‌ఫుల్ నెస్’ను ప్రాక్టీస్ చేయాలని సూచనలు

కంచర్ల యాదగిరిరెడ్డి

అర నిమిషం తీరిక లేదు... అర్ధరూపాయి సంపాదన లేదు.. ఈ సామెత వింటుంటే ఈ తరం బడిపిల్లలు గుర్తుకు వస్తున్నారు. ఎప్పుడు చూసినా పుస్తకాల్లో తలమునకలై ఉంటారు. బాగా చదువుతున్నారే అని మురిసిపోయినా.. పరీక్షల్లో వచ్చిన మార్కులు చూస్తే అత్తెసరు. ఈ తరం పిల్లల్లో ఎక్కువ మంది ఫోకస్డ్‌గా లేకపోవడమే దీనికి కారణమని నిపుణులు చెప్తున్నారు. అసలు పెద్దవారి ఏకాగ్రత కూడా బాగా తగ్గిపోతోందని.. స్మార్ట్‌ఫోన్లు, ఇతర డిజిటల్ పరికరాలు, మాధ్యమాల వల్లే ఈ పరిస్థితి నెలకొందని స్పష్టం చేస్తున్నారు.



దృష్టి మళ్లే దారులెన్నో..

➤ మునుపటితో పోలిస్తే పిల్లల దృష్టి మళ్లేందుకు స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, టీవీలు ఇలా ఎన్నో కారణమవుతున్నాయి. నిత్యం ఎవరో ఒకరి నుంచో, ఏదో వాట్సాప్ గ్రూపులోనో మెసేజీలు రావడం, ఫేస్‌బుక్ నోటిఫికేషన్లు, స్మార్ట్ వాచ్ మెసేజ్.. ఇలా తరచూ మన దృష్టిని తప్పిస్తున్నాయని, దీనివల్ల తదేకంగా ఒక పనిని శ్రద్ధగా చేసే శక్తిని కోల్పోతున్నామని నిపుణులు చెప్తున్నారు. సెల్‌ఫోన్లు రాకముందు, సాంకేతిక విప్లవం లేనప్పుడు మనుషులు ఎలా ఉన్నారు? ఇప్పుడెలా ఉన్నారన్నదానిపై అమెరికాలోని ‘నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్, అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్’ ఇటీవల ఓ అధ్యయనం చేసింది. 1946–1975 మధ్య కాలంలో పుట్టి, రకరకాల రంగాల్లో పనిచేస్తున్న వారిని, 1976–2000 మధ్య పుట్టి పలు రంగాల్లో ఉన్న వారిని, ప్రైమరీ స్కూల్, హైస్కూల్, కాలేజీ విద్యార్థులను ప్రశ్నించి.. ఐక్యూ టెస్ట్ పెట్టింది. ఉత్తర అమెరికా, యూరప్, ఆసియా దేశాల్లో ఈ అధ్యయనం సాగింది.

ఏ పనికైనా ఫోకస్ అవసరం!

➤ మనం ఏ పనిచేయాలన్నా ఫోకస్ అనేది చాలా అవసరం. లేకుంటే ఏ పని సరిగా, త్వరగా పూర్తి చేయలేం. తరాలు మారుతున్న కొద్దీ ఫోకస్ టైం మారుతూ వస్తోందని అధ్యయనంలో తేలింది. ఉదాహరణకు బేబీ బూమర్లు అంటే 1946–1964 మధ్య పుట్టినవాళ్లకు ఫోకస్ టైం ఇరవై నిమిషాలు ఉండేది. తర్వాతి తరం జనరేషన్ ఎక్స్ అంటే 1965–1980 మధ్య పుట్టినవారి ఏకాగ్రత 12 నిమిషాలకు చేరింది. 1981, ఆ తర్వాత పుట్టినవారికి ఇది కేవలం ఎనిమిది నుంచి 12 నిమిషాలే.. ఫోకస్ పెట్టలేకపోయినప్పుడు అరగంటలో చేయాలనుకున్న పని గంట, గంటన్నర పడుతుంది. పైగా చేసే పనిలో నాణ్యత ఉండదని.. యాంగ్జైటీ, డిప్రెషన్ వంటి సమస్యలూ వస్తాయని, మానసిక ఒత్తిడి పెరుగుతుందని నిపుణులు చెప్తున్నారు. నాలుగేళ్ల కితం జరిగిన ఒక పరిశోధన ప్రకారం.. ఇంటర్నెట్ వాడకం మన మెదడులోని పలు ప్రాంతాల్లో మార్పులకు కారణమవుతుందని తేలింది. ఇలా మారిపోయే విషయాల్లో మన జ్ఞాపకాలూ ఉన్నాయని వెల్లడైంది. ‘నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్, అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్’ అధ్యయనం ప్రకారం కూడా.. నిద్రకు ఉపక్రమించే ముందు స్మార్ట్‌ఫోన్ లేదా ఇతర డిజిటల్ స్క్రీన్లను చూడటం వల్ల నిద్రకు చేటు కలుగుతుంది. అది కాస్తా వారి రోజువారీ కార్యక్రమాలపై ప్రభావం చూపుతుంది.

వాటితో కేవలం పరధ్యానమే..

కంప్యూటర్ల వాడకంతో మనుషుల మానసిక స్థితిపై కలిగే ప్రభావంపై ఇంకో అధ్యయనం కూడా జరిగింది. ఆస్ట్రేలియాకు చెందిన డాక్టర్ షరోన్ హార్‌వుడ్ నిర్వహించిన ఆ అధ్యయనం ప్రకారం.. టెక్నాలజీ అనేది మన మేధో సామర్థ్యాన్ని వెంటనే మార్చేస్తుందనడం పూర్తిగా వాస్తవమేమీ కాదు. యుగాలుగా రకరకాల పరిస్థితు లను ఎదుర్కొని పరిణామం చెందిన మెదడు పనితీరు ఒక్క తరంలో మారిపోదని ఆమె చెప్తున్నా రు. కాకపోతే డిజిటల్ పరికరాలు మన మనసును పరధ్యానంలో పడేస్తాయని స్పష్టం చేస్తున్నారు.

పక్కన ఉన్నా ప్రభావమే..

మన పరిసరాల్లో స్మార్ట్‌ఫోన్, ఇతర డిజిటల్ స్క్రీన్ డివైజ్ ఉంటే చాలు మన ఏకాగ్రత స్థాయి గణనీయంగా తగ్గిపోతుందంటున్నారు నిపుణులు. ఆలోచించడం, గుర్తుంచుకోవడం, భావోద్వేగాల నియంత్రణకు కారణమైన విషయాలపై దృష్టిపెట్టడం వంటివాటిపై స్మార్ట్‌ఫోన్, ట్యాబ్లెట్, కంప్యూటర్ల వంటివి ప్రభావం చూపగలవని ఎన్నో అధ్యయనాల్లో తేలిందని స్పష్టం చేస్తున్నారు. చేతుల్లో, లేదా జేబులో, పక్కన టేబుల్‌పైనో స్మార్ట్‌ఫోన్ ఉంటే.. మన మనసు చేసే పనిపై కాకుండా ఫోన్‌కు వచ్చే నోటిఫికేషన్లు లేదా అది చేసే శబ్దాలపై పడుతుందని వెల్లడైందని వివరిస్తున్నారు.



క్షణం విడిచి ఉండలేకుండా..

రోజులో గంటా రెండు గంటల పాటు స్మార్ట్‌ఫోన్ అందుబాటులో లేకపోయినా సరే నానా హైరానా పడే వారి సంఖ్య బాగా పెరిగిందని నిపుణులు చెప్తున్నారు. ఇప్పటికే పాశ్చాత్యదేశాల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారని.. మన దేశంలోనూ ఆ పరిస్థితి వస్తోందని హెచ్చరిస్తున్నారు. తక్షణ తృప్తి (ఇన్‌స్టంట్ గ్రాటిఫికేషన్) కారణంగానే మనుషులు డిజిటల్ పరికరాలకు బానిసలవుతున్నట్టు వివరిస్తున్నారు. చాలా దేశాల్లో పిల్లలు నిపుణులు సూచించిన దాని కంటే ఎక్కువ సమయం డిజిటల్ తెరల ముందు గడుపుతుండటం ఆందోళనకరమని స్పష్టం చేస్తున్నారు.

సమస్యను గుర్తించడం ఎలా?

➤ చేపట్టిన పనిని పూర్తి చేసేందుకు కష్టపడుతుంటే, కష్టం అనిపిస్తుంటే, అనుకున్న సమయానికి పూర్తి చేయలేకపోతుంటే ఫోకస్ కోల్పోయామని అర్థం.

➤ అకారణంగా చిరాకు అనిపిస్తున్నా, మన దృష్టి సులువుగా పక్కదారి పడుతున్నా, రెస్ట్‌లెస్‌గా అనిపిస్తున్నా.. ఫోకస్ కోల్పోయామని స్పష్టంగా తెలుస్తుంది.

➤ ముఖ్యమైన అంశాలను అప్పటికప్పుడు మర్చిపోతుంటే ఫోకస్ పోతున్నట్టే.

ఏమిటి పరిష్కారం?

➤ ఫోకస్ పెంచుకునేందుకు సులువైన మార్గాలెన్నో ఉన్నాయి. మన ఏకాగ్రతను దెబ్బతీస్తున్న మొబైల్ ఫోన్ నోటిఫికేషన్, కంప్యూటర్ నోటిఫికేషన్ వంటివి ఆఫ్ చేయాలి లేదా అత్యవసరమైనవే వచ్చేలా సెట్ చేసుకోవాలి.

➤ ఏ పని ముందు చేయాలి? ఏ పని తరువాత చేయాలి? దేనికి ప్రాధాన్యత ఎక్కువ? దేనిని నిర్ణీత సమయం (డెడ్‌లైన్)లోపు పూర్తి చేసుకోవాలన్న దానిపై కొంత వర్క్ చేసుకుని ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయడం నేర్చుకుంటే ఫోకస్ పెరుగుతుంది.

➤ ప్రతిరోజు మైండ్ ఫుల్‌నెస్ ప్రాక్టీస్ చేయాలి. అంటే పూర్తిగా చేసే పనిపైనే ధ్యాస నిలిపాలి. ఉదాహరణకు.. ఉదయం లేవగానే బ్రష్ చేసేటప్పుడు ఆ బ్రషింగ్‌పై మాత్రమే, కాఫీ తాగేటప్పుడు దానిపై మాత్రమే ధ్యాస నిలిపేందుకు ప్రయత్నించాలి. ఇలా అన్ని పనులకూ వర్తింపజేయాలి. దీనిని రోజూ ప్రాక్టీస్ చేయడం ద్వారా ఫోకస్ ఆటోమేటిగ్గా పెరుగుతుంది.


–విశేష్, సైకాలజిస్ట్

ఇంటర్నెట్‌కు బానిసవుతున్న జనం

- ప్రపంచవ్యాప్తంగా జనం ఇంటర్నెట్‌కు బానిసగా మారుతున్నారని పలు అధ్యయనాల్లో తేలింది. వాటి ప్రకారం..
- రోజులో ఒక్కొక్కరూ కనీసం 149 నిమిషాల పాటు స్మార్ట్‌ఫోన్‌ను చూస్తూ గడుపుతున్నారు.
- ప్రతి ఐదుగురిలో ఒకరు రాత్రిళ్లు నిద్రలేచి మరీ సోషల్ మీడియా పోస్టులు చూసుకుంటున్నారు.
- వీడియో గేమ్స్ ఆడే యువకులు వారంలో వాటిపై గడిపే సమయం 8 గంటలకు పైనే..
- అమెరికాలో ట్రాఫిక్ ప్రమాదాల్లో 26శాతం స్మార్ట్‌ఫోన్ చూస్తూ డ్రైవింగ్ చేయడం వల్లనే జరుగుతున్నాయి!

కౌంటర్ దాఖలు చేయండి

- బండి అరెస్టుపై సర్కార్‌కు హైకోర్టు నోటీసులు... తదుపరి విచారణ 10వ తేదీకి వాయిదా
- కిందికోర్టులో బెయిల్ పిటిషన్‌కు అనుమతి



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టు అక్రమం అని, హనుమకొండ కోర్టు ఇచ్చిన డాకెట్ ఆర్డర్‌ను కొట్టివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు గురువారం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. అయితే కింది కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు ఉన్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. అక్కడ బెయిల్ రాకుంటే హైకోర్టులో హౌస్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసుకునే వెసులుబాటు కల్పించింది. పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీ కేసులో బండి సంజయ్‌ను అరెస్టు చేసిన పోలీసులు హనుమకొండ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచిన విషయం తెలిసిందే. విచారణ తర్వాత బండికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ సంజయ్ గురువారం లంచ్‌మోషన్ రూపంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మధ్యాహ్నం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు.

సంజయ్‌కు వ్యతిరేకంగా ఆధారాల్లేవు..

‘సుప్రీంకోర్టు, హైకోర్టు పలు ఉత్తర్వుల్లో చెప్పినా.. పోలీసులు 41ఏ నోటీసులు ఇవ్వకుండానే సంజయ్‌ను రాత్రి 12 గంటల సమయంలో అరెస్టు చేశారు. కరీంనగర్‌లో అరెస్టు చేసి నేరుగా హనుమకొండకు తరలించకుండా, బొమ్మల రామారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వైద్య పరీక్షల పేరిట బొమ్మలరామారం నుంచి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మళ్లీ హనుమకొండకు తీసుకొచ్చారు. వేధింపులకు గురిచేయాలనే ఉద్దేశంతోనే దాదాపు 300 కిలోమీటర్లు ఆయన్ను తిప్పారు. ఎక్కడి తీసుకెళుతున్నారు? ఎందుకు తిప్పుతున్నారో కూడా బండికి చెప్పలేదు. మరోవైపు పేపర్ లీకేజీపై పోలీసులు నమోదు చేసిన రిమాండ్ రిపోర్టులో సంజయ్ నేరం చేసినట్లు పేర్కొనలేదు. ఆయనకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవు. మంగళవారం రాత్రి అరెస్టు చేస్తే.. బుధవారం సాయంత్రం వరకు మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టలేదు. పార్లమెంట్ సమావేశాలకు ఎంపీ బండి హాజరుకావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో హనుమకొండ మేజిస్ట్రేట్ ఇచ్చిన డాకెట్ ఆర్డర్ కొట్టివేయాలి. తక్షణమే సంజయ్‌ను విడుదల చేయాలి..’ అని రామచందర్ రావు వాదించారు.

మొబైల్ ఫోన్ ఇస్తే మరిన్ని వివరాలు

‘బండి మొబైల్ ఫోన్ నుంచి ఇతర నిందితుల ఫోన్‌కు వాట్సాప్ మెసేజ్‌ల బదిలీ జరిగింది. పేపర్ లీకేజీ జరిగేలా ఆయన ప్రోత్సహించారన్న సమాచారం ఉంది. మొబైల్ ఫోన్ ఇస్తే వివరాలన్నీ తెలుస్తాయి. ఆధారాలు లభ్యమవుతాయి. పేపర్ లీక్ అయి ఆయనకు వచ్చిన మెసేజ్‌ను ఎంపీ పలువురికి పంపించారు’ అని ఏజీ పేర్కొన్నారు. ‘ఒకసారి ప్రజా బహుళ్యంలోకి వివరాలు వచ్చాక అవి ఎవరు ఎవరికైనా పంపొచ్చు కదా..?’ అని సీజే ప్రశ్నించారు. అయితే ఎంపీగా ఉన్న సంజయ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలే గానీ, ఇతరులకు పంపడం సరికాదని ఏజీ నివేదించారు.

‘హెబియస్ కార్పస్’లోనూ నోటీసులు..

బండి సంజయ్ అరెస్టుపై బీజేపీ భాగ్యనగర్ అధ్యక్షుడు దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ పుల్లా కార్తీక్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ పేర్కొన్న అంశాలపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర సర్కార్‌కు నోటీసులు జారీచేసింది.నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

సంజయ్‌తో సతీమణి ములాఖత్

పోలీసుల తీరు బాధాకరమని వ్యాఖ్య

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ జైల్లో ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో ఆయన సతీమణి అపర్ణ గురువారం ములాఖత్ అయ్యారు. భర్త యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. 15 నిమిషాల ములాఖత్ అనంతరం జైలు బయట ఆమె మీడియాతో మాట్లాడారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, చట్టపరంగా ఎదుర్కొంటామని సంజయ్ చెప్పినట్లు ఆమె వెల్లడించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసేవరకు పోరాటం కొనసాగించాలని కోరినట్లు తెలిపారు. 8న రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కంకణబద్ధులై పనిచేయాలని చెప్పారన్నారు. తాను 30 లక్షలమంది యువత కోసం పనిచేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా జైల్లో పెట్టిందంటూ వ్యాఖ్యానించారని అపర్ణ చెప్పారు. కాగా, తన తల్లి కార్యక్రమం(కర్మ) ఉన్న సమయంలో పోలీసులు టెంట్‌ను కూల్చేసి, కుర్చీలు ధ్వంసం చేసి సంజయ్‌ను తీసుకెళ్లిన తీరు బాధాకరమని ఆమె వాపోయారు. అపర్ణ వెంట సంజయ్ సోదరుడు బండి శ్రవణ్ కుమార్, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ ఉన్నారు.


సంజయ్‌ను ములాఖత్ ద్వారా కలిసేందుకు వెళ్తున్న అపర్ణ

ఖైదీ నంబర్ 7917

సంజయ్‌కు జైలు అధికారులు 7917 ఖైదీ నంబరును కేటాయించారు. సంజయ్‌తోపాటు లీకేజీ ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రశాంత్, శివ, మహేశ్‌ను ప్రత్యేక బ్యారక్‌లో ఉంచారు. సంజయ్ బుధవారంరాత్రి భోజనం చేయలేదని, కేవలం పండ్లు తిన్నారని, గురువారం ఉదయం ఇడ్లీ అల్పాహారంగా తీసుకున్నారని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం తోటిఖైదీలతో కలిసి భోజనం చేశారని జైలు సూపరింటెండెంట్ సమ్మయ్య తెలిపారు.

సంజయ్‌కు బెయిల్


హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద సంబరాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు

▶ మొదటి పేజీ తరువాయి

నిమిత్తం ప్రాసిక్యూషన్‌కు సహకరించాలని, సాక్షులను ప్రభావితం చేయకూడదని, సాక్ష్యాలను చెరిపివేయకూడదని షరతులు విధించారు. బెయిల్ ప్రక్రియ పూర్తయ్యేసరికి గురువారం రాత్రి అవడంతో.. బండి సంజయ్ శుక్రవారం ఉదయం కరీంనగర్ జైలు నుంచి విడుదల కానున్నారు.

దురుద్దేశంతో ఇరికించారు..: సంజయ్ లాయర్లు

బండి సంజయ్ బెయిల్ విషయమై కోర్టులో గురువారం లంచ్ విరామం తర్వాత మొదలైన వాదనలు రాత్రి 8 గంటల వరకు కొనసాగాయి. రాష్ట్ర ప్రభుత్వం పార్లమెంట్ సభ్యుడైన బండి సంజయ్‌ను అప్రతిష్టపాలు చేసేందుకు దురుద్దేశపూర్వకంగా పోలీసులతో అక్రమ కేసు బనాయించిందని ఆయన తరఫు న్యాయవాదులు శ్యాంసుందర్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రామకృష్ణ, సునీల్‌లు వాదించారు. రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న ఆరోపణలు గానీ, ఫిర్యాదుదారు పిటిషన్‌లో ఆరోపించిన విషయాలుగానీ బండి సంజయ్‌కు వర్తించవని.. దురుద్దేశంతోనే కేసులో ఇరికించారని పేర్కొన్నారు. ఇప్పటికే కేసుకు సంబంధించి విచారణ పూర్తయిందని, నివేదిక మాత్రమే కోర్టులో దాఖలు చేయాల్సి ఉందని కోర్టుకు విన్నవించారు. సాక్షులను ప్రభావితం చేయడంగానీ, సాక్ష్యాధారాలను చెరిపేయడంగానీ చేసే ఆస్కారం లేనందున సంజయ్‌కు బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ తెలంగాణకు వస్తున్న సందర్భంగా ఎంపీగా, సంబంధిత పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా సంజయ్ ఆ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిన అవసరాన్ని దృష్టిలో పెట్టుకోవాలని కోరారు.

బెయిలిస్తే శాంతిభద్రతల సమస్య: పబ్లిక్ ప్రాసిక్యూటర్

మరోవైపు సంజయ్‌కు బెయిల్ ఇవ్వకూడదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేవతిదేవి కోర్టును కోరారు. ‘‘తెలంగాణ వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఇదే తీరుగా నేరాలు పునరావృతం కాకుండా జాగ్రత్తపడాల్సి ఉంది. నిందితుడు బండి సంజయ్‌కు బెయిల్ ఇస్తే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆయనపై తీవ్రమైన చర్యలకు పాల్పడే అవకాశం ఉంది. అది రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యగా మారే ప్రమాదం ఉంది. అంతేగాకుండా ఈ కేసులో మరికొందరు సాక్షులను విచారించాలి. నిందితులు ముందస్తుగా కుట్రపన్ని ప్రశ్నపత్రాల లీక్, కాపీకి పాల్పడ్డారు. వారి ఫోన్‌కాల్స్, వాట్సాప్ చాట్‌ల వివరాలను విశ్లేషించడం ద్వారా వారి పాత్ర బయటపడింది. ఇంకా సాంకేతిక ఆధారాలు లభించాల్సి ఉంది. వాస్తవాలను వెలికితీసేందుకు లోతైన దర్యాప్తు అవసరం. ఏ1 నిందితుడికి బెయిలిస్తే సాక్షులను బెదిరించి, దర్యాప్తునకు ఆటంకం కల్పించడంతోపాటు సాంకేతిక ఆధారాలను చెరిపేసే అవకాశం ఉంది. సంజయ్ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించాలి’’ అని కోరారు.

బెయిల్ మంజూరు.. కస్టడీ పిటిషన్ వాయిదా

ప్రాసిక్యూషన్, బండి సంజయ్ తరఫు న్యాయవాదుల వాదనల అనంతరం గురువారం రాత్రి 10 గంటల సమయంలో జడ్జి తీర్పు ఇచ్చారు. సంజయ్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. జమానతుదారుల పూచీకత్తు పత్రాలను సంజయ్ తరఫు న్యాయవాదులు సమర్పించగా.. కోర్టు విడుదల ఆదేశాలు (రిలీజ్ ఆర్డర్) జారీ చేసింది. మరోవైపు సంజయ్‌ను విచారణ నిమిత్తం తమ కస్టడీకి ఇవ్వాలన్న పోలీసుల పిటిషన్‌పై తీర్పును సోమవారానికి వాయిదా వేసింది.

ఉదయం విడుదల

బండి సంజయ్ బెయిల్ పేపర్లు ఇంకా మాకు అందలేదు. అందినా రాత్రి పూట విడుదల చేసే అవకాశం లేదు. శుక్రవారం ఉదయం బెయిల్ పేపర్లు అందే అవకాశాలు ఉన్నాయి. రాగానే వాటిని పరిశీలించి సంజయ్‌ను విడుదల చేస్తాం. – సమ్మయ్య, కరీంనగర్ జైలు సూపరింటెండెంట్

పోలీసు కస్టడీ నుంచి బండి విడుదల

లోక్‌సభ సచివాలయం బులెటిన్

సాక్షి, న్యూఢిల్లీ: పోలీసు కస్టడీ నుంచి బీజేపీ ఎంపీ బండి సంజయ్ విడుదలయ్యారని లోక్‌సభ సచివాలయం బుధవారం రాత్రి బులెటిన్ విడుదల చేసింది. కరీంనగర్ టూటౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌ను ఏప్రిల్ 5వ తేదీన సంప్రదించగా.. అదేరోజు సమాధానమిచ్చారని సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ బులెటిన్‌లో పేర్కొన్నారు. ‘5.4.23న శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారంటూ కరీంనగర్‌లోని నివాసంలో సంజయ్‌ను సీఆర్‌పీసీ సెక్షన్ 151 కింద అరెస్టు చేసి కరీంనగర్ నుంచి బొమ్మల రామారాం పీఎస్‌కు తరలించాం. అదేరోజు కరీంనగర్ పోలీసుల కస్టడీ నుంచి విడుదల చేశాం’.. అని పోలీసులు తెలిపినట్లు బులెటిన్‌లో లోక్‌సభ సచివాలయం పేర్కొంది.

అరుణ్‌పిళ్లైకి 15 కోట్లు ఇచ్చా

▶ మొదటి పేజీ తరువాయి

కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్‌ఎస్ నేతకు, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు సత్సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. కేజ్రీవాల్‌ను ఉద్దేశించి లేఖ రాసిన సుఖేశ్ దానిని మీడియాకు విడుదల చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.

ఇది ఆరంభమే.. అసలైంది ముందుంది

‘రూ.15 కోట్లు మీ (కేజ్రీవాల్) ఆదేశాల మేరకే అందించానన్న వివరాలు చాట్ రూపంలో స్పష్టంగా ఉన్నాయి. కేజ్రీవాల్, సత్యేంద్ర జైన్ సూచించిన టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్) నేత కూడా సొమ్ములు అందుకున్నట్లు ధ్రువీకరించారు. లిక్కర్ స్కాం కేసులో సౌత్‌గ్రూప్‌కు సంబంధించిన టీఆర్‌ఎస్ నేతతో మీ అనుబంధాన్ని చాట్ వివరిస్తోంది. రూ.15 కోట్లు అలియాస్ 15 కేజీల నెయ్యి ఎవరికి అందించాలో టీఆర్‌ఎస్ నేత నిర్దేశించిన విధానం కూడా ఇది వివరిస్తుంది. ఆ సూచనల మేరకే ఎమ్మెల్సీ స్టిక్కర్ ఉన్న బ్లాక్ రేంజ్‌రోవర్ 6060 నంబరు కారులో నగదు పెట్టెలను అరుణ్‌పిళ్లైకు అందజేశా. ఆప్, టీఆర్‌ఎస్, టీఆర్‌ఎస్ నేత ఏవిధంగా చేతులు కలిపారో, వ్యక్తిగతస్థాయిలో ఆర్థిక లావాదేవీలు, వ్యాపారాలు ఎలా చేస్తున్నారో కూడా చాట్ స్పష్టం చేస్తుంది. ఈ వాట్సాప్ చాట్ స్క్రీన్ షాట్లు ప్రారంభం మాత్రమే. అసలైంది ముందుంది. టీజర్ కోసం సహచరులతో కలిసి వేచి ఉండండి.

మీ అందరితో కలిసి నార్కో పరీక్షలకు సిద్ధం

నాపై ఏ కేసు రుజువు కాలేదు. మీ అవినీతి బృందం.. సమస్యను దారి మళ్లించడానికి నా విశ్వసనీయత గురించి మాట్లాడుతోంది. నేను నార్కో పరీక్షలకు సిద్ధంగా ఉన్నా. 2015– 2023 వరకు ప్రతి ప్రకటనకు నా దగ్గర ఆధారం ఉంది. కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. అన్నింటికీ సిద్ధంగా ఉండండి. టీజర్ స్క్రీన్ షాట్–1 విడుదలైన తర్వాత మీరు, మీ స్నేహితుల ఏడుపులు, నిందలు చూడడానికి ఉత్సుకతతో ఉన్నా. కేజ్రీవాల్ జీ మీ కోసం ప్రత్యే కంగా రూపొందించిన ఓ నినాదం నా దగ్గర ఉంది. అద్భుతమైన సంగీత బృందంతో సంగీతం కంపోజ్ చేయిస్తున్నా..’ అని పేర్కొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

- రాష్ట్ర ప్రభుత్వంపై బండి సంజయ్ ఆగ్రహం
- గతంలో ఇంటర్, ఇప్పుడు టెన్త్ విద్యార్థుల వంతు
- బీజేపీకి ఆదరణ ఓర్వలేకే కుట్రలు
- జైలు నుంచి కార్యకర్తలకు బండి సంజయ్ బహిరంగ లేఖ
- ప్రధాని సభను విజయవంతం చేయాలని పిలుపు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని, గతంలో ఇంటర్ విద్యార్థులతో, తాజాగా పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీకి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేని కొన్ని పార్టీలు కుట్రలకు తెరలేపాయని పరోక్షంగా బీఆర్‌ఎస్‌ను విమర్శించారు. తనపై మోపిన పేపర్ లీకేజీ కేసు ఆ కుట్రలో భాగమే అని విమర్శించారు. ఇది అత్యంత క్లిష్ట సమయమని, పాలకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎన్నో కుట్రలు, కుతంత్రాలకు ఒడిగడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ కుట్రలకు భయపడితే 30 లక్షల మంది నిరుద్యోగులు, వారి కుటుంబాల జీవితాలు ప్రమాదంలో పడ్డట్లేనన్నారు. టెన్త్ పేపర్ల లీకేజీకి కుట్ర కేసులో ప్రస్తుతం కరీంనగర్ జైల్లో రిమాండ్‌లో ఉన్న సంజయ్.. గురువారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని కారాగారం నుంచే పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఒక లేఖ రాశారు. తొలుత పార్టీ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన బండి.. పార్టీ నిర్మాణం కోసం శ్రమించిన వాజ్‌పేయి, డీఎస్ రెడ్డి మొదలు చలపతిరావు, రామారావు, టైగర్ నరేంద్ర, జితేందర్‌రెడ్డిల సేవలను స్మరించుకున్నారు.

నిరుద్యోగుల పక్షాన గళమెత్తినందుకే..

కేసులు, జైళ్లు కొత్తకాదని.. ప్రజల కోసం ఎన్నిసార్లయినా జైలుకు వెళ్లేందుకు, ప్రాణమైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని సంజయ్ పేర్కొన్నారు. టీఎస్పీఎస్సీ లీకేజీలో వైఫల్యాలను, ప్రభుత్వ తప్పిదాలను, ఐటీశాఖ మంత్రిగా ఉన్న కేసీఆర్ కొడుకు పాత్రను ఎత్తిచూపుతూ 30 లక్షల మంది నిరుద్యోగ కుటుంబాల పక్షాన గళమెత్తినందుకే తనను కేసులో ఇరికించారని ఆరోపించారు. నాడు తన స్వార్థం కోసం 27 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులను ప్రభుత్వం బలి తీసుకుందని మండిపడ్డారు.

ప్రధాని మోదీ నాకు స్ఫూర్తి

ప్రధాని మోదీ తనకు స్ఫూర్తి అని, ఆయన ఈనెల 8న హైదరాబాద్‌కు వస్తున్నా తాను ఆ సభకు హాజరయ్యే అవకాశం కన్పించకపోవడంతో బాధగా ఉందని సంజయ్ పేర్కొన్నారు. మోదీ సభను కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. శ్యామ్‌ప్రసాద్. దీన్ దయాళ్ సిద్ధాంతాలు, వాజ్‌పేయి త్యాగం, మోదీ ఆశలను నెరవేర్చేందుకు కృషి చేయాలని, కేసీఆర్ సర్కార్‌ను బొందపెట్టడమే లక్ష్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

బిడ్డ, కొడుకుల స్కాంలు బయటపడుతున్నాయి..

బిడ్డ, కొడుకు చేసిన స్కాంలన్నీ ఒక్కొక్కటిగా బయటపడుతుండటంతో నిస్పృహలో ఉన్న కల్వకుంట్ల కుటుంబం తనను అరెస్టు చేసి జైలుకు పంపడం ద్వారా ఉద్యమాలను అడ్డుకోవాలని చూస్తోందని సంజయ్ ఆరోపించారు. జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్ వ్యాఖ్యల నుంచి దృష్టి మళ్లించేందుకు కేసీఆర్ ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

టీఎస్‌పీఎస్సీ లీకేజీకి బాధ్యుడైన కేసీఆర్ కొడుకును కేబినెట్ నుండి బర్తరఫ్ చేసేవరకు, నిరుద్యోగులకు రూ.లక్ష పరిహారం ఇచ్చేవరకు, లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించే వరకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని బీజేపీ చీఫ్ పిలుపునిచ్చారు. నియంత పాలనకు చరమ గీతం పాడేదాకా పోరాడదామని అన్నారు. ‘గడీల్లో బందీ అయి విలపిస్తున్న తెలంగాణ తల్లిని బంధ విముక్తి చేయడమే మనందరి లక్ష్యం. అందుకోసం తెగించి కొట్లాడదాం.. రాబందుల రాజకీయ క్రీడ నుండి తెలంగాణ తల్లిని రక్షించుకుందాం. అందుకోసం మీరంతా కదిలిరండి..’ అని విజ్ఞప్తి చేశారు.

మరింత జోరుగా..!

- ప్రభుత్వ, పార్టీ కార్యకలాపాలను ముమ్మరం చేయడంపై బీఆర్‌ఎస్ ఫోకస్
- ఈ నెల 14న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ.. 40వేల మందితో సభ
- 27న ఎల్బీ స్టేడియంలో బీఆర్‌ఎస్ ప్లీనరీ, ప్రతినిధుల సభ
- 30న కొత్త సచివాలయం ప్రారంభోత్సవం
- జూన్ 2న అట్టహాసంగా అమరుల స్మారకం ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో ప్రభుత్వ, పార్టీ కార్యకలాపాలను ముమ్మరం చేయడంపై బీఆర్‌ఎస్ దృష్టి సారించింది. వరుసగా సభలు, సమావేశాలు నిర్వహించడంతోపాటు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించింది. ఈ నెల 14న జరిగే భారీ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మొదలుకుని.. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వరకు వరుసగా సభలు, సమావేశాల నిర్వహణకు షెడ్యూల్ సిద్ధం చేసింది.

అన్ని నియోజకవర్గాల నుంచి పాల్గొనేలా..

ఈ నెల 14న హుస్సేన్‌సాగర్ తీరంలో జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పార్టీలకు అతీతంగా నిర్వహించాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ అంబేడ్కర్‌ను ఆహ్వానించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా నిర్వహించే సభకు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 300 మంది చొప్పున 35,700మంది పాల్గొనేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ నెల 30న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కార్యక్రమంలో సీఎం, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్, గ్రంథాలయ సంస్థల చైర్‌పర్సన్లు, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, మేయర్లు, ఇతరులు కలుపుకొని 2,500 మంది వరకు హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

ఎల్బీ స్టేడియంలో ప్లీనరీ

గత రెండేళ్లుగా హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ ప్లీనరీని ఈ ఏడాది ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. ఈ నెల 27న జరిగే బీఆర్‌ఎస్ ప్లీనరీ సందర్భంగా ప్రతినిధుల సభ నిర్వహించనున్నారు. టీఆర్‌ఎస్ నుంచి బీఆర్‌ఎస్‌గా పేరు మారిన తర్వాత జరుగుతున్న తొలి ప్లీనరీ ఇది. ఈ క్రమంలో జాతీయ పార్టీగా అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులను ఆహ్వానించే అవకాశం ఉంది. సుమారు 8 వేల మంది ప్రతినిధులు ఈనెల 27న జరిగే బీఆర్‌ఎస్ ప్లీనరీకి హాజరవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో స్థానిక నేతలు పార్టీ జెండాలను ఆవిష్కరిస్తారు.

మరిన్ని రోజులు ఆత్మీయ సమ్మేళనాలు

ఎన్నికల సన్నద్ధతలో భాగంగా క్షేత్రస్థాయిలో చేపట్టిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలను మే నెల లోనూ కొనసాగించాలని పార్టీ అధినేత కేసీఆర్ సూచించారు. ఆత్మీయ సమ్మేళనాలకు కేడర్ నుంచి వస్తున్న స్పందనను దృష్టిలో పెట్టుకుని విస్తృతంగా నిర్వహించేందుకు మాజీ స్పీకర్ మధుసూదనాచారి నేతృత్వంలో పది మందితో కూడిన పర్యవేక్షక కమిటీని ఏర్పాటు చేశారు. అంటే మరో నెలన్నర పాటు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు కొనసాగనున్నాయి. ఇక జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సచివాలయం ఎదురుగా నిర్మించిన అమరుల స్మారకాన్ని ప్రారంభించనున్నారు.

క్లుప్తంగా...

ఈటలకు నోటీసులు



ఈటలకు నోటీసులు అందిస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, వరంగల్/మేడ్చల్ రూరల్: పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో బీజేపీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు వరంగల్ కమిషనరేట్ పోలీసులు గురువారం నోటీసులు ఇచ్చారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు సీఆర్పీసీ 160 కింద తాఖీదులు అందించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు వరంగల్ డీసీపీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఈటలతోపాటు ఆయన పీఏలు నరేందర్, రాజులకు కూడా నోటీసులను అందించినట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు ఈ వ్యవహారంలో పోలీసులకు స్టేట్‌మెంట్ ఇవ్వడానికి ఈ నెల 10న ఉదయం 11 గంటలకు విచారణకు హాజరవుతానని ఈటల పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్ కాల్ వస్తే మాట్లాడటం తప్ప తాను ఎలాంటి వాట్సాప్ సందేశాలు చూడనని చెప్పారు.

ఢిల్లీలో కదం తొక్కిన బీఆర్ఎస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందంటూ పార్లమెంట్ హౌస్ నుంచి విజయ్ చౌక్ వరకు విపక్షాలు నిర్వహించిన త్రివర్ణ పతాక మార్చ్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీలు కదంతొక్కారు. గురువారం కాంగ్రెస్ సహా ఇతర ప్రధాన విపక్ష పార్టీలన్నీ పాలుపంచుకున్న ఈ ర్యాలీలో బీఆర్ఎస్ తరఫున లోక్‌సభా పక్ష నేత నామా నాగేశ్వర్‌రావుతో పాటు కేఆర్ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, బడుగు లింగయ్యయాదవ్, పి.రాములు పాల్గొన్నారు. అదానీ కంపెనీల అంశంపై జేపీసీ వేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు పట్టుకొని నినాదాలతో హోరెత్తించారు.

బండి సంజయ్‌పై పీడీ యాక్టు పెట్టాలి: ప్రవీణ్



సాక్షి, హైదరాబాద్: పదోతరగతి పరీక్ష పత్రాల లీకేజీ కుట్రలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కీలక నిందితుడని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. బీఎస్పీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ నాయకులు చేసిన లీకేజీ కుట్రను వరంగల్ పోలీసులు ఛేదించడం అభినందనీయమని అన్నారు.

టెన్త్‌పై పెట్టిన శ్రద్ధ టీఎస్‌పీఎస్సీపై ఎందుకు లేదు?

వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల



సాక్షి, హైదరాబాద్: టెన్త్ పేపర్ లీక్ దోషులను శిక్షించాల్సిందేనని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. అయితే టెన్త్ పేపర్ లీక్ దర్యాప్తు మీద పెట్టిన శ్రద్ధ.. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రం లీక్ మీద ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పెద్ద తలకాయలు బయటపడతాయనా? అని గురువారం ఆమె ఒక ప్రకటనలో విమర్శించారు. ఆ పార్టీ నేతలకు 30 లక్షల మంది నిరుద్యోగుల కన్నీటి రోదన కనపడడం లేదా అని సూటిగా ప్రశ్నించారు. టెన్త్ పేపర్ బయటకు వచ్చేంతగా నిర్లక్ష్యం వహించారంటే ఇది దిక్కుమాలిన పాలన కాదా అని నిలదీశారు. పేపర్ బయటకు రాగానే ముగ్గురు టీచర్లను డిస్మిస్ చేసినప్పుడు టీఎస్‌పీఎస్సీ ఉద్యోగులు, బోర్డు సభ్యులు, చైర్మన్‌ను వెంటనే ఎందుకు తొలగించలేదన్నారు. ఇందులో బీఆర్ఎస్ బడా నేతల హస్తం ఉందనా అని మండిపడ్డారు.

నాది కాంగ్రెస్ రక్తం.. పార్టీ మారేది లేదు

ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టీకరణ



సాక్షి, న్యూఢిల్లీ: తాను పార్టీ మారుతున్నానని వస్తున్న వార్తలను నమ్మవద్దని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. తనది కాంగ్రెస్ రక్తం అని, పార్టీ మారే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఆయన గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నానన్న ప్రచారాన్ని ఖండించారు.

మారితే నేనే ప్రకటిస్తా

పార్టీ మారేది ఉంటే నేనే ప్రకటిస్తానంటూ ఆయన క్లారిటీ ఇచ్చారు. తాను పార్టీ మారుతానంటూ అపోహలు రావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ మారేవాడినే అయితే పీసీసీ పదవి ఇవ్వనప్పుడే మారేవాడినన్నారు. గత బుధవారం కూడా తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మాణిక్‌రావ్ థాక్రేతో రాష్ట్ర వ్యవహారాలపై చర్చించానని.. పార్టీ టికెట్లు త్వరగా ఇవ్వాలని కోరానన్నారు. అభివృద్ధి కార్యక్రమాల కోసమే ప్రధానిని, కేంద్ర మంత్రులను కలిస్తే.. పార్టీ మారతానని ప్రచారం చేయడం తగదని స్పష్టం చేశారు.

సలేశ్వరం.. జనసంద్రం

- లింగమయ్య దర్శనానికి రెండోరోజు 2 లక్షల మందికిపైగా భక్తులు
- జనసందోహంలో ఊపిరాడక ఒకరు, గుండెపోటుతో మరొకరు మృతి
- 17 కి.మీ. మేర బారులుతీరిన వాహనాలు
- రద్దీ దృష్ట్యా దాదాపు సగం మంది దర్శనం చేసుకోకుండానే వెనక్కి..
- చేతులెత్తేసిన అటవీ, పోలీసు సిబ్బంది



సలేశ్వరం లోయలో కిక్కిరిసిన భక్తులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/సాక్షి, నాగర్‌కర్నూల్/అచ్చంపేట: తెలంగాణ అమరనాథ్‌గా పేరుగాంచిన నల్లమలలోని సలేశ్వరం భక్తులతో కిక్కిరిసిపోయింది. జాతర తొలిరోజు లక్ష మంది లింగమయ్యను దర్శించుకోగా రెండో రోజైన గురువారం చైత్ర పౌర్ణమి కూడా రావడంతో ఏకంగా 2 లక్షల మందికిపైగా భక్తులు లింగమయ్య దర్శనం కోసం పోటెత్తారు. కొండలు, లోయలు ఎక్కి దిగుతూ, ఇరుకుదారుల్లో జనం కిక్కిరిసిపోయారు. దీంతో పలు అపశ్రుతులు చోటుచేసుకున్నాయి. జనసందోహంలో ఊపిరాడక రంగారెడ్డి జిల్లా ఆమనగల్‌కు చెందిన విజయ (40) అనే మహిళ మృతి చెందగా నాగర్‌కర్నూల్ మండలం వనపట్లకు చెందిన చంద్రయ్య (55) వ్యక్తి గుండెపోటుతో మృతిచెందాడు. మరో ముగ్గురు అస్వస్థతకు గురయ్యారు. అటవీశాఖ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకే అనుమతి ఇవ్వడం తొక్కిసలాటకు, భక్తుల రద్దీ పెరగడానికి కారణమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిలోని ఫర్హాబాద్ నుంచి రాంపూర్ చెంచుపెంట వరకు దాదాపు 17 కి.మీ. మేర వాహనాలు బారులుతీరాయి. పోలీసులు వాహనాలను మళ్లించే ప్రయత్నం చేసినా ట్రాఫిక్‌జామ్‌ను నిలువరించలేకపోయారు. అలాగే మరో మార్గమైన లింగాల మండలం అప్పాయిపల్లి-గిరిజన గుండాల దారి సైతం రద్దీగా మారింది. రద్దీ తీవ్రంగా ఉండటంతో దాదాపు సగం మంది దైవదర్శనం చేసుకోకుండానే వెనుతిరిగారు. అటవీశాఖ అనుమతించిన ప్రకారం లింగమయ్య దర్శనానికి శుక్రవారం చివరిరోజు కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది.

యంత్రాంగం ఫెయిల్...

సలేశ్వరం లింగమయ్య జాతర పూర్వం వారం పాటు జరిగేది. ఆ తర్వాత కాలంలో ఐదు రోజుల పాటు నిర్వహణకు అటవీశాఖ అనుమతి ఇవ్వగా కరోనా నేపథ్యంలో 2020, 2021లో ఉత్సవాలు రద్దయ్యాయి. ఆ తర్వాత పరిస్థితులు మెరుగుపడటంతో గతేడాది, ప్రస్తుతం మూడు రోజులకే ఉత్సవాలను అటవీశాఖ కుదించింది. దీంతో భక్తులు లక్షలాదిగా పోటెత్తారు. మరోవైపు టోల్‌గేట్ రుసుము కోసం నిర్దేశిత సమయం దాటినా వేల సంఖ్యలో వాహనాలను అనుమతించడంతో ఉదయం వెళ్లి తిరుగుపయనమైన వారు.. లింగమయ్యను దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తులతో దారి మొత్తం కిక్కిరిసింది. అలాగే ఆర్టీసీ బస్సుల హోల్డింగ్‌ను రాంపూర్ నుంచి పుల్లాయపల్లికి మార్చడం, మధ్యాహ్నం 3:30 గంటల తర్వాత బస్సులను నిలిపివేయడంతో భక్తులు నరకయాతన అనుభవించారు. తెలంగాణలో అతిపెద్ద సాహసయాత్రగా పేరొందిన గిరిజన జాతరకు అధికార యంత్రాంగం కనీసం ఉచిత తాగునీటి సదుపాయం కూడా కల్పించలేదని భక్తులు మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కూడా కనీస చొరవ చూపలేదంటూ దుయ్యబట్టారు.

దర్శనం కాకుండా వెనుదిరిగా..

లోయలోకి దిగకముందే భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో భయం వేసింది. ఇప్పుడు ఇబ్బంది పడేకన్నా వచ్చే ఏడాదైనా లింగమయ్యను దర్శించుకోవచ్చని.. దూరం నుంచి దండం పెట్టుకొని వెనుదిరిగాను.

– లక్ష్మి, చిన్నకొత్తపల్లి, పెద్దకొత్తపల్లి మండలం

ఒకరిద్దరే పోలీసులు

పుణ్యక్షేత్రానికి వెళ్లే మార్గం వెంట పోలీసు బందోబస్తు లేదు. లోయలోకి దిగే మార్గంలో భక్తులను అదుపు చేసే వారే కరువయ్యారు. స్నానాలు చేసే గుండం దగ్గర ఒకరిద్దరు పోలీసులే ఉన్నారు.

– శివ, జగన్నాథపురం

అధిక ధరకు విక్రయాలు

క్షేత్రంలో పలు రకాల వస్తువుల ధరలు విపరీతంగా ఉన్నాయి. లీటర్ నీళ్ల బాటిల్‌ను రూ. 70కి, టెంకాయ రూ. 50కి విక్రయిస్తున్నారు. అయినా అధికారులు ఎవరూ వారిని నియంత్రించలేదు. – రవీందర్, వనపట్ల, నాగర్‌కర్నూల్ మండలం

పరీక్ష కేంద్రాల పరిసరాల టవర్లపై నిఘా

- టెన్త్ పరీక్షల నిర్వహణపై పట్టు పెంచిన ప్రభుత్వం
- రెవెన్యూ, విద్య, పోలీసు శాఖలతో నెట్‌వర్క్
- మరిన్ని ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు
- ప్రశ్నపత్రాల చేరవేత నుంచి జవాబుపత్రాలు మూల్యాంకన కేంద్రాలకు చేరే వరకూ గట్టి నిఘా
- విద్యాశాఖకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆదేశాలు
- తాజా పరిస్థితిపై సమీక్షించిన సీఎస్



సాక్షి, హైదరాబాద్: ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం అప్రమత్తమైంది. తాజా పరిస్థితిపై ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి సమీక్షించారు. ఇప్పుడున్న భద్రతతోపాటు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. విద్య, రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో జిల్లా కలెక్టర్లకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఇక నుంచి జరిగే పరీక్షల్లో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాస్థాయిలో చురుకైన, సమర్థులైన అధికారులనే ఈ కార్యక్రమానికి ఎంపిక చేయాలని విద్యాశాఖకు ప్రభుత్వం సూచించింది. దీంతో పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయం అన్ని జిల్లాల నుంచి కొంతమంది అధికారుల పేర్లు తెప్పించింది. పరీక్ష కేంద్రాల సమగ్ర సమాచారం తెప్పించుకుని పరిశీలించింది. ఎక్కడ ఎలాంటి చర్యలు చేపట్టాలనేదానిపై కసరత్తు చేసింది. ప్రత్యేక బృందాలతో రాష్ట్రస్థాయి నెట్‌వర్క్ ఉండేలా ఏర్పాట్లు చేస్తోంది. ప్రశ్నపత్రాల చేరవేత నుంచి జవాబుపత్రాలను మూల్యాంకన కేంద్రాలకు తరలించే వరకూ గట్టి నిఘా ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. మరోవైపు, పోలీసు అధికారులు సాంకేతిక కోణంలో నిఘాను పెంచుతున్నారు. అనుమానిత కేంద్రాల వద్ద సెల్‌ఫోన్ టవర్ల ద్వారా అవసరమైన సమాచారం సేకరించే పనిలో ఉన్నారు. స్పెషల్ బ్రాంచ్‌కు అందే కీలకమైన సమాచారం విశ్లేషించి, పరీక్ష కేంద్రాల పరిసరాల్లో సెల్‌ఫోన్ టవర్స్‌పై నిఘా పెంచి కాల్స్‌ను గుర్తించాలని నిర్ణయించారు. లీకేజీ వ్యవహారం రాజకీయ రంగు పులుముకున్న నేపథ్యంలో పరీక్షలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సీఎస్ నుంచి ఆదేశాలు వచ్చినట్టు విద్యాశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ప్రతీ జిల్లాలో ప్రత్యేక బృందాలు

- టెన్త్ పరీక్షల కోసం ప్రతీ జిల్లాలో ప్రత్యేక అధికారుల బృందాన్ని గురువారం ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయిలో రెవెన్యూ ఉన్నతాధికారి దీనికి నేతృత్వం వహిస్తారు. పరీక్ష కేంద్రాలు, అందులో పనిచేస్తున్న సిబ్బంది, ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఇన్విజిలేటర్లపై వీరి ఆజమాయిషీ ఉంటుంది. జిల్లా పరిధిలో పరీక్షల కేంద్రాలకు వీరి ద్వారా అవసరమైన సమాచారం వెళ్తుంది. తనిఖీ బృందాలకు ఎప్పటికప్పుడు ఆదేశాలిచ్చే వ్యవస్థను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి అధికారుల ద్వారా తెప్పించుకునే ప్రత్యేక అధికారం వీరికి ఉంటుంది.
- తహసీల్దార్, ఎంపీడీఓలు ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తారు. జిల్లాల్లో వివిధ జోన్లుగా విభజించి వీరికి బాధ్యతలు అప్పగించారు. పరీక్ష కేంద్రం నుంచి సమాచారం తెలుసుకుని, అవసరమైన సంకేతాలివ్వడం, అనుమానం ఉంటే తక్షణమే పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం వీరి బాధ్యత.
- రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సిట్టింగ్ స్క్వాడ్స్ ఉండగా లీకేజీల నేపథ్యంలో మరికొన్ని ప్రత్యేక స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో విద్యాశాఖ జిల్లాస్థాయి అధికారులుంటారు. డివిజన్ల వారీగా వీరు విధులు నిర్వర్తిస్తారు. మరోవైపు పోలీసు శాఖ నుంచీ ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశారు. ఇవి జిల్లాస్థాయిలో బృందాలుగా వెళ్లి పనిచేస్తాయి.

సమస్యాత్మక కేంద్రాల విశ్లేషణ

రాష్ట్రంలోని 2,652 పరీక్ష కేంద్రాలను వివిధ కేటగిరీలుగా విభజించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక, సాధారణ కేంద్రాల జాబితాను తయారు చేశారు. రాజకీయంగా సమస్యలున్న ప్రాంతాల్లోని కేంద్రాల వివరాలను ప్రత్యేకంగా సేకరించారు. అక్కడ అనుమానాస్పద కార్యక్రమాలు ఏమైనా జరుగుతున్నాయా? కొత్త వ్యక్తులు వస్తున్నారా? అనే వివరాలు సేకరించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని నిఘా ఏర్పాటు చేస్తున్నట్టు విద్యాశాఖ అదనపు డైరెక్టర్ లింగయ్య తెలిపారు.

వైఫల్యాలను మళ్లించేందుకే పూటకో కుట్ర

- రాష్ట్ర ప్రభుత్వంపై కిషన్‌రెడ్డి ధ్వజం
- బండి అరెస్టు, ఈటల నోటీసులకు భయపడం
- సింగరేణిపై బీఆర్ఎస్ నేతలవి అబద్ధపు ప్రచారాలు



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ పాలనా వైఫల్యాలు, టీఎస్పీఎస్సీ పేపర్‌లీకేజీపై నిరుద్యోగుల ఆక్రోశాన్ని దృష్టి మళ్లించేందుకే కుట్రలకు తెరతీశారని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆరోపించారు. కల్వకుంట్ల కుటుంబం పూటకోమాట.. పూటకో కుట్ర చేస్తోందని మండిపడ్డారు. గురువారం రాత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుబండి సంజయ్‌అక్రమ అరెస్టుతో పాటు పార్టీ జాతీయకార్యవర్గ సభ్యుడు, సీనియర్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ''ఎవరో పంపిన వాట్సాప్ మెసేజ్‌పై దర్యాప్తు పేరిట ఈటలకు సాయంత్రం 5 గంటలకు నోటీసులు ఇచ్చి 6 గంటలకు స్టేషన్‌లో విచారణకు రావాలంటే.. మేము ఏమన్నా మీ జీతగాళ్లమనుకుంటున్నారా? కీలు బొమ్మలమనుకుంటున్నారా? తెలంగాణ సమాజం చూస్తలేదనుకుంటున్నారా? ''అని నిలదీశారు.

వాట్సాప్ మెసేజ్ లకు నోటీసులు ఇస్తే.. ఏ ఒక్కరూ మిగలరు...

వాట్సాప్ మెసేజ్‌లు వచ్చిన వారందరికీ నోటీసులు ఇస్తే.. ఏ ఒక్కరూ మిగలరనీ, ఇలాంటి విధానం ఎక్కడా లేదని కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధానిని విమర్శించే అధికారం కల్వకుంట్ల కుటుంబానికి ఎక్కడిది? దిగజారుడు మాటలు, అన్‌పార్లమెంటరీ మాటలకు బీజం వేసింది.. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రే అని నిందించారు. ''బుధవారం నాడు వరంగల్ సీపీ రంగనాథ్ మాట్లాడుతూ.. బండి సంజయ్ మీదనే కేసులు పెట్టాం.. ఈటలను పిలవడం లేదని చెప్పారు మరి ఒక్క రోజులోనే మార్పు ఎలా వచ్చింది..''అని ప్రశ్నించారు.

సింగరేణిపై సీబీఐ దర్యాప్తునకు సిద్ధమా?

సింగరేణిపై బీఆర్ఎస్‌నాయకులు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. సింగరేణి 51శాతం వాటా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న సంస్థ.. 49 శాతం వాటాకు పరిమితమైన కేంద్రం ఎలా ప్రైవేటీకరిస్తుందో బీఆర్ఎస్ నేతలు చెప్పాలని నిలదీశారు. ''సింగరేణి మైన్స్‌ను ప్రైవేటుకు ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీనే.. ఓ మైన్‌ను ఓ వ్యక్తికి అడ్డికి పావుశేరు లెక్కన ఎలా ఒప్పందం చేసుకున్నారో.. సీబీఐ దర్యాప్తునకు సిద్ధంగా ఉన్నారా?''అని ప్రశ్నించారు. సింగరేణిని ప్రైవేటీకరించబోమని ప్రధాని మోదీ రామగుండంలో స్పష్టంగా చెప్పారని, సింగరేణి ఎన్నికలు వస్తున్నందున.. ఓడిపోతామనే భయంతో బీఆర్ఎస్‌నాయకులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు.

సత్యమేవ జయతే..

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు హనుమకొండలోని కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సత్యమేవ జయతే అంటూ గురువారం అర్ధరాత్రి ట్వీట్ చేశారు. కేసీఆర్ సర్కారు అక్రమ కేసులతో బీజేపీ గొంతునొక్కాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బండికి బెయిల్ మంజూరు నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద కార్యకర్తలు, నాయకులు పటాసులు పేల్చి, మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు.

రాష్ట్రంలో బీజేపీ కీలక ఘట్టాన్ని ఎదుర్కోబోతోంది

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ కీలక ఘట్టాన్ని ఎదుర్కోబోతోందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. సంజయ్ అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్‌పై పోరాటంలో భాగస్వామ్యం అవుతామని కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ నాయకులతో కలిసి పార్టీ ఆవిర్భావ కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా చేసిన ప్రసంగం విన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను సీఎం కేసీఆర్ కాలరాస్తున్నారని మండిపడ్డారు.

చేయని తప్పుకు నన్ను బలిచేశారు

- పదో తరగతి పరీక్షలు రాసే అవకాశం ఇవ్వండి
- ప్రశ్నపత్రం బయటికి వచ్చిన ఘటనలో డీబారైన విద్యార్థి హరీశ్ వేడుకోలు
- విద్యార్థి హాల్‌టికెట్ తీసుకుని బయటికి పంపిన హనుమకొండ డీఈవో



మీడియాతో మాట్లాడుతున్న హరీశ్, అతని తల్లి లలిత

కమలాపూర్: చేయని తప్పుకు తనను బలిచేశారని పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం బయటికి వచ్చిన ఘటనలో డీబారైన విద్యార్థి దండెబోయిన హరీశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో ఈ నెల 4న హిందీ ప్రశ్నపత్రం బయటికి వచ్చిన ఘటనలో డీబారైన హరీశ్ గురువారం ఇంగ్లిష్ పరీక్ష రాసేందుకు పరీక్షకేంద్రానికి రాగా, డీఈవో ఎండీ అబ్దుల్ హై అతని హాల్‌టికెట్ తీసుకొని బయటకు పంపించారు. అనంతరం హరీశ్ తన తల్లి లలితతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆ రోజు పరీక్ష కేంద్రం కిటికీ వద్దకు ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి 'తమ్ముడు ప్రశ్నపత్రం ఇవ్వు' అని అడిగాడని, తాను ఇవ్వనని చెప్పి ఇన్విజిలేటర్‌కు చెబుదామనుకుంటున్న సమయంలో ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడని తెలిపాడు. తాను బెంచీ మధ్యలోకి జరగగానే అతను వెళ్లిపోయాడని భావించి ఆన్సర్‌షీట్ మార్జిన్ కొట్టుకుంటుండగా ప్రశ్నపత్రం లాక్కున్నాడని, ఫొటోలు తీసుకుని ఆ ప్రశ్నపత్రాన్ని తన వైపు విసిరేసి వెళ్లిపోయాడని పేర్కొన్నాడు. తనను చంపుతానని బెదిరించడంతో భయపడి ఆ విషయం ఎవరికీ చెప్పలేదని తెలిపాడు. చేయని తప్పుకు తన భవిష్యత్‌ను బలి చేయకుండా హాల్‌టికెట్ ఇచ్చి యథావిధిగా పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని కోరారు. కనీసం సప్లిమెంటరీ పరీక్షలు రాసే అవకాశమైనా ఇవ్వాలని ఉన్నతాధికారులను వేడుకున్నాడు. హరీశ్ తల్లి లలిత మాట్లాడుతూ తన కొడుకు భవిష్యత్‌ను పాడు చేయకుండా పదో తరగతి పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని రోదిస్తూ చేతులు జోడించి సంబంధిత అధికారులను వేడుకొంది.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి: కోదండరాం

అఖిలపక్ష సమావేశంలో పోరాట కమిటీ చైర్మన్ ప్రొ.కోదండరాం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం


పంజగుట్ట: టీఎస్‌పీఎస్సీని పూర్తిగా రద్దు చేసి ఉన్నత ప్రమాణాలు కలిగినవారిని చైర్మన్, సభ్యులుగా నియమించాలని, ఆ తర్వాతే ఆయా నియామక పరీక్షలు నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ పోరాట కమిటీ డిమాండ్ చేసింది. లీకేజీ వ్యవహారం చిన్న విషయం కాదని, ఘటన జరిగి ఇన్ని రోజులు అవుతున్నా ఇప్పటివరకు ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించలేదని కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన ఇందిరాపార్క్ వద్ద 'నిరుద్యోగుల గోస.. అఖిలపక్ష భరోసా'పేరుతో మహాధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత చైర్మన్, సభ్యుల నేతృత్వంలో మళ్లీ పరీక్షలు నిర్వహిస్తే నిరుద్యోగులకు న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. పేపర్ లీకేజీ ఘటనలో నిజానిజాలు నిగ్గు తేల్చకపోతే మహాధర్నా రోజే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై అలసత్వమెందుకు?

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడూతూ ఈ నెల 3న తాండూరులో 10వ తరగతి పేపర్ లీకైన ఘటనలో ముగ్గురు ఉద్యోగులను రెండురోజుల్లో సస్పెండ్ చేశారని, 4వ తేదీన కమలాపూర్‌లో హిందీ పేపర్ లీకైతే 48 గంటల్లో నిందితులు, కుట్రదారులను అరెస్టు చేశారని, మరి, టీఎస్‌పీఎస్సీ విషయంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు.

త్వరలో కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ

కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ హామీ ఇచ్చారన్న కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్



కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ ఉత్తమ్

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నాళ్లుగానో పెండింగ్‌లో ఉన్న కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ పనులను మొదలు పెడతామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. గురువారం ఉత్తమ్ పార్లమెంట్‌లో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. డోర్నకల్ – నేలకొండపల్లి – కోదాడ – హుజూర్ నగర్ – నేరేడుచర్ల – మిర్యాలగూడ కొత్త రైల్వే లైన్ మంజూరు చేసి వెంటనే పనులు మొదలు పెట్టాలని కోరారు. దీంతో పాటే మోతమర్రి–జగ్గయ్యపేట–మేళ్లచెర్వు–మఠంపల్లి–జాన్ పహాడ్–విష్ణు పురం–మిర్యాలగూడ రైల్వే లైన్‌లో ప్యాసింజర్ రైళ్లను నడపాలని, ఈ రైల్వేలైన్‌ను డబ్లింగ్ చేయాలని కోరారు.

నల్లగొండలో వందేభారత్..

మోతుమర్రి–మిర్యాలగూడ మధ్య ప్యాసెంజర్ రైళ్లను నడుపుతామని, డబ్లింగ్ పనులు మొదలుపెడతామని హామీ ఇచ్చినట్లు ఉత్తమ్‌కుమార్ రెడ్డి వివరించారు. విశాఖ– తిరుపతి వందేభారత్‌తో పాటు వివిధ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నల్లగొండలో ఆపేలా చర్యలు తీసుకుంటామని, మిర్యాలగూడలో ఆపే విషయంపై పరిశీలన చేస్తామని తెలిపినట్లు వెల్లడించారు.

సాధారణ సెకండ్ ఏసీ కంటే ఎక్కువే!

- సికింద్రాబాద్–తిరుపతి వందేభారత్ టికెట్ ధర
- ఎకానమీ అయితే రూ.1,645 వరకు .. ఎగ్జిక్యూటివ్ అయితే రూ.3,045


సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్–తిరుపతి మధ్య కొత్తగా ప్రారంభం కాబోతున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో టికెట్ ధరలు సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని ఏసీ రెండో తరగతి ధరల కంటే ఎక్కువగానే ఉండనున్నట్టు తెలుస్తోంది. చార్జీల వివరాలను అధికారికంగా ఇంకా విడుదల చేయనప్పటికీ, ఎకానమీ చైర్ కార్‌లో ప్రయాణానికి రూ.1,645 వరకు చెల్లించాల్సి ఉంటుందని తెలుస్తోంది. అదే ఎగ్జిక్యూటివ్ చైర్ కార్‌లో అయితే రూ.3,045 వరకు ఉంటుందని సమాచారం. సికింద్రాబాద్‌లో ఉదయం ఆరు గంటలకు బయలుదేరి మధ్యాహ్నం రెండున్నర తర్వాత తిరుపతికి చేరుకోనున్నందున, బ్రేక్‌ఫాస్ట్, లంచ్ అందించాల్సి ఉంటుంది. దీంతో వెళ్లేటప్పుడు చార్జీ వచ్చేటప్పటి కంటే కొంచెం ఎక్కువగా ఉండనుంది. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో స్లీపర్ కోచ్ ధర రూ.375, థర్డ్ ఏసీ 990, సెకండ్ ఏసీ రూ.1,400, ఫస్ట్‌క్లాస్ ఏసీ రూ.2,360 ఉండగా, నారాయణాద్రిలో వరుసగా రూ.395, 1,070, 1,505, 2,515గా, రాయలసీమలో రూ.410, 1,090, 1,545గా ఉండటం విశేషం.

అప్పటివరకు తక్కువ కోచ్‌లతోనే..!

వందేభారత్ టికెట్ ధర ఎక్కువగా ఉండనున్నందున ఈ రైలుకు డిమాండ్ ఎలా ఉంటుందో స్పష్టత వచ్చే వరకు తక్కువ కోచ్‌లతోనే నడపాలని అధికారులు భావిస్తున్నారు. గతంలో కాచిగూడ–తిరుపతి మధ్య చైర్‌కార్‌తో నడిచిన డబుల్ డెక్కర్ రైలు ప్రయాణికుల ఆదరణ చూరగొనలేకపోయింది. పగటి వేళ ప్రయాణం, కూర్చుని వెళ్లాల్సి రావటంతో జనం పెద్దగా ఆదరించలేదు. దీంతో కొన్ని నెలల తర్వాత దాన్ని మరో రూట్‌కు మార్చారు. వందేభారత్‌ను కూడా కొన్ని నెలలు చూసిన తర్వాత ఆక్యుపెన్సీ రేషియో ఎక్కువగా ఉంటే 16 కోచ్‌లతో నడపాలని, తక్కువగా ఉంటే 9 లేదా 10 కోచ్‌లతో కొనసాగించాలని భావిస్తున్నారు.

బండి ఏ–1 ఎలా అవుతారు?

- వాట్సాప్‌లో వచ్చిన టెన్త్ పేపర్‌పై స్పందిస్తే లీక్ చేసినట్లా?
- సంజయ్ అరెస్ట్ కుట్రపూరితం: ఎమ్మెల్యే రఘునందన్‌రావు




సాక్షి, హైదరాబాద్: వాట్సాప్‌లో ఎవరో పంపిన టెన్త్ ప్రశ్నపత్రం ఫొటో చూసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ స్పందిస్తే ఆయన్ను పోలీసులు ఈ కేసులో ఏ–1 (ప్రధాన నిందితుడు) ఎలా చేరుస్తారని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రశ్నించారు. ఉదయం 9:37 గంటలకు పేపర్ లీకైతే 11:30 గంటలకు సంజయ్‌కు వాట్సాప్‌లో పేపర్ వచ్చిందని చెబుతున్నారన్నారు. అప్పటికే బయటకు వచ్చిన ప్రశ్నపత్రం 200 వాట్సాప్ గ్రూపుల్లో ఉంటే దాన్ని సంజయ్ ఎలా లీక్ చేసినట్లు అవుతుందని నిలదీశారు. వాట్సాప్‌లో ప్రశ్నపత్రం ఫొటో అందుకున్నవారిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలెవరూ లేరా అని ప్రశ్నించారు. వారందరినీ వదిలేసి సంజయ్‌ను మాత్రమే అరెస్టు చేయడం వెనక కుట్ర ఉందని స్పష్టంగా తెలుస్తోందన్నారు. గురువారం బీజేపీ కార్యాలయంలో రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడుతూ వరంగల్ సీపీ రంగనాథ్ అత్యుత్సాహంతో అధికార పార్టీని తృప్తిపరిచేందుకే కేసులు పెట్టినట్లు కనిపిస్తోందని ఆరోపించారు. సంజయ్ అరెస్టు విషయంలో సీపీ రెండు రోజుల్లోనే మాట మార్చారన్నారు. ప్రశ్నపత్రాన్ని ఫొటో తీసినట్టుగా చెబుతున్న శివగణేశ్ తన ఫోన్‌ను 24 గంటల్లోగా కోర్టుకు సమర్పించారా లేదా అన్నది పోలీసులు వెల్లడించాలన్నారు. ఈ వ్యక్తికి బీజేపీతో సంబంధం ఉందా లేదా, అతడి వాట్సాప్ చెక్ చేశారా? ఫోన్ సీజ్ చేశారా లేదా అని ప్రశ్నించారు. పేపర్ లీకేజీకి కారణమైన శివగణేశ్ వాట్సాప్ చాట్‌ను పోలీసులు ఎందుకు బయటపెట్టలేదో చెప్పాలని రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. వందల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుంటే సెంటర్ వద్ద పోలీసులు ఎందుకు లేరని ప్రశ్నించారు. ఈ ప్రశ్నలన్నింటికీ సీపీ రంగనాథ్ సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తం పరిణామాలను గమనిస్తే రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందనేది స్పష్టమవుతోందని ఆరోపించారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 7-4-2023

శుభ శుక్రవారం పండుగ కాదు. పరీక్షించుకొని యేసు శుద్ధ రక్తంతో కడుగుకొని, కృతజ్ఞతతో పరివర్తన పొంది, నూతన శక్తిని పొందే దినం.

నేడు గుడ్ ఫ్రైడే



పడియున్న జనులను పైకి లేపు సిలువ

యెరూషలేము వీధులలో భారమైన కొయ్య సిలువ మోసుకొనుచు, కల్వరి వైపు అప్పటికే కొరడా దెబ్బలతో రక్తపు గాయాలతో నడవలేక నడుచుచున్న ఈయన ఎవరు? ఈయన మానవ పాపభారం మోయు యేసుక్రీస్తు అను రబ్బూనీ. తనను చూచి ఆశ్చర్యంతో గమనించు జన సమూహం, ఏడ్చుచున్న స్త్రీలను ప్రభువు చూచి ఇట్లనెను "యెరూషలేము కుమార్తెలారా, నా నిమిత్తము ఏడ్వకుడి; మీ నిమిత్తమును మీ పిల్లల నిమిత్తమును ఏడ్వుడి" (లూకా 23:28). కన్నీటి ప్రార్థన తప్పక జవాబునిచ్చును. శుభ శుక్రవారం, నేరములు రుజువు కాక పోయినను జనుల, అలనాటి నాయకుల అసూయ, ఒత్తిడిచే, పిలాతు అను గవర్నర్ యేసును సిలువ వేయుటకు అప్పగించెను.

యేసు పాపులను రక్షించుటకే మరణించెను. మనుష్య కుమారుడు సిలువ వేయుటకై కొనిపోబడును. (మత్తయి 26:2) మూడోదినమున లేచుట అగత్యమని చెప్పెను. (మత్తయి 16:21). నరావతారుడైన దేవుడు, పతనమైన నరుని పైకెత్తుటకు సిలువ కొయ్యపై మూడు మేకులతో వ్రేలాడుచు కల్వరి కొండపై అందరూ చూచునట్లు సిలువ శిక్షను పొందెను. తుదకు బల్లెంతో ప్రభువును పొడిచినప్పుడు రక్తం, నీళ్లు కారుట యోహాను అను శిష్యుడు చూచెను. సిలువ ఒక గొప్ప మర్మము. పాప రహితుడు పాప శిక్ష భరించెను. యేసు ఇట్లనెను– నేను భూమి మీద నుండి పైకెత్తబడిన ఎడల అందరినీ నా యొద్దకు ఆకర్షించుకొందును (యోహాను 12:32). అందులకే కోట్లాదిమంది యేసును ప్రభువుగా, రక్షకునిగా అంగీకరించుచున్నారు. సురూపము, సొగసులేని ఈ కరుణామయుని ప్రేమ లోకమును ఆకర్షించి – రక్షణ, స్వస్థత, శాంతి, పరలోక భాగ్యము ఇచ్చుచున్నది. ఆ దినమే మంచి శుక్రవారం, మానవాళిని మంచిగా చేసి, మంచిని పంచే వ్యక్తులుగా సిలువపై యేసు చేయును.

నికోదేముతో యేసు "అరణ్యంలో మోషే సర్పమును ఎలాగు ఎత్తెనో అలాగే విశ్వసించు ప్రతివాడు నశింపక ఆయన ద్వారా నిత్య జీవము పొందునట్లు మనుష్య కుమారుడు ఎత్తబడవలెను" అనెను. (యోహాను 3:14) (సంఖ్యా 21:28). సిలువపై యేసు కుడి ఎడమల బందిపోటు దొంగలు, అందులో ఒకడు తన పాపముల కొరకు పశ్చాత్తాపపడగా యేసు "నీవు నాతో కూడా పరదైసులో ఉందువు అని పాపిని పరలోకానికి లేవనెత్తెను".

'సర్వ పాప పరిహారోం – రక్త ప్రోక్షణ అవశ్యం. తద్ రక్తం పరమాత్మేవ – పుణ్యదాన బలియాగం" అని సామవేదం చెబుతున్నది. బైబిల్ సహితం రక్తము చిందింపకుండా పాప క్షమాపణ కలుగదు. (హెబ్రీ 9:21). 1యోహాను 1:7,9 ప్రకారము పాపములు ఒప్పుకొని యేసు చిందించిన నిర్దోష, ప్రశస్త రక్తాన్ని నమ్మితే జన్మ, కర్మ పాపములకు విముక్తి అని బైబిల్ తెలుపుచున్నది. యేసుకు శిక్ష మానవునికి రక్ష. క్లోరోఫామ్ కనుగొన్న సిమ్సన్ ఇలాగు అన్నాడు. నేను పాపిని, క్రీస్తు నా కొరకు మరణించెను అనినచో అప్పుడు పరలోకముకు వెళ్లే టికెట్ దొరుకును.

యేసు సిలువ మరణం పాప బానిసత్వానికి స్వస్తి, దైవ రాజ్యానికి హక్కు. యెషయా ప్రవక్త 700 సంవత్సరముల క్రితం ఇట్లు ప్రవచించెను."మన అతిక్రమ క్రియలను బట్టి అతడు గాయపరచబడెను, మన దోషములను బట్టి

ఆయన నలుగగొట్టబడెను, మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను, అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది". (యెషయా 53:5) యేసు సిలువ... పాపాలకు, దురలవాట్లకు, దుర్లాభములకు, రోగములకు సమాధి.

వివేకానందుడు సూడార్ 2, 372 పేజీలో 'సిలువపై వ్రేలాడు మానవుని ఆలోచించు, తనను సిలువ వేసిన వారిని కృపతో క్షమించి సర్వ గర్వముల అవమానం భరించెను. ఆయన స్తుతి పాత్రుడు. పాపములు భరించి, మోసి – ప్రయాసపడు సమస్త జనులారా నా యొద్దకు రండి అని (మత్తయి 11:28) చెప్పెను. 6 గంటలు సిలువ పైకెత్తబడి, వేలాడతీయబడిన యేసు ప్రేమతో ఆ బాధ, వేదనలో ఏడు మాటలు పలికెను.

అవి 1. క్షమాపణ 2. రక్షణ 3. ఆదరణ 4. ఆవేదన 5. శ్రమ 6. జయము 7. ఆత్మార్పణ, ఇవి జీవిత సార్థకతను సూచించుచున్నవి. (లూకా 23:34; 43) (యోహాను 19:26,27) (మత్తయి 27:46) (యోహాను 19:28) (యోహాను 19:30) (లూకా 23:46). ఇవి యేసుప్రభు కొండ మీద ప్రసంగించిన సూక్తుల వలె కలవరి కొండ సిలువ ప్రసంగములు. వీటి సారాంశం గ్రహించి, వీటిని అనుసరించినట్లయితే భూలోకమే పరలోక మగును.

తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడును, తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును (లూకా 18:14). ఇది యేసు ప్రభు బోధించిన విధానం. ఎన్ని అద్భుతాలు చేసినను తగ్గించుకొని మాదిరి చూపే ముక్తి మార్గము యేసు వేసెను.

అందుకే 2000 సంవత్సరముల క్రితం సిలువ వేయబడినను, సమాధి చేయబడి, తిరిగి బతికెను. అందులకే యేసు నామము ఉన్నత నామము, లోకానికి ఆదరణ, ఆదర్శ, దురాత్మలపై జయము కలుగజేసి, మోక్షమిచ్చే నామం. మిసిసిపి నది బ్రిడ్జిపై – యేసు శిలువలో వ్రేలాడుతూ మూడు సిలువలు చిత్రించబడి ఆ క్రింద ఇలాగు రాయబడినది. "ఇప్పుడు నీ నిర్ణయం!" పక్కన వెళ్లే ప్రజానీకానికి అద్భుతమైన మనస్సాక్షిని ప్రేరేపించి నిర్ణయం తీసుకునే మాట. బలవంతం లేదు. ఆలోచించి దేవుడే దీనుడై, తన ప్రేమను వెల్లడి పరిచిన తరువాత పాపంలో, గర్వంలో, మరణంలో, వ్యాధి బాధలతో, ఆర్థిక కృంగుబాటులో, యుద్ధములు, తెగుళ్ల భయములతో, సమాధానం లేని చిక్కు సమస్యలతో, నిస్పృహతో నిండిన మానవుని యేసు ప్రభువు గాయపరచబడిన తన చేతులతో తండ్రి వలె ప్రేమతో పైకెత్తి తనతో నివసింప చేసే దినమే గుడ్ ఫ్రైడే. శుభ శుక్రవారం పండుగ కాదు. యేసు శుద్ధ రక్తంతో కడుగుకొని, కృతజ్ఞతతో పరివర్తన పొంది, నూతన శక్తి పొందే దినం. శ్రమలలో కూడా త్యాగముతో, ఏ భేదము లేక తోటి మానవుని పడద్రోయక, బాధపెట్టక, పైకెత్తి ఆదరించి ప్రోత్సాహపరిచే స్ఫూర్తినిచ్చు సిలువ దృశ్యం – ఇదే నిజమైన శుభ శుక్రవారం.

– తంటిపూడి ప్రభాకర రావు
ఎల్. ఇ.ఎఫ్ చర్చి, మచిలీపట్నం

పాపంలో, గర్వంలో, మరణంలో, వ్యాధి బాధలతో, ఆర్థిక కృంగుబాటులో, యుద్ధములు, తెగుళ్లు భయములతో, సమాధానం లేని చిక్కు సమస్యలతో, నిస్పృహతో నిండిన మానవుని యేసు ప్రభువు గాయపరచబడిన తన చేతులతో తండ్రి వలె ప్రేమగా పైకెత్తి తనతో నివసింప చేసే దినమే గుడ్ ఫ్రైడే.

తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడును, తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును (లూకా 18:14). ఇది యేసు ప్రభు బోధించిన విధానం.

ఫ్యాషన్

స్మార్ట్ ఫ్రాక్స్

వేసవి చాలా వరకు హాయిగొలిపే స్టైల్స్‌ని పరిచయం చేస్తుంటుంది. సౌకర్యంగా ఉన్న డ్రెస్సులనే మన ముందుకు తీసుకువస్తుంది. అందుకు తగినట్టుగానే మనవైన చేనేతలు ఎప్పుడూ కొత్తగా మెరిసిపోతూనే ఉంటాయి. కాటన్‌తో కంఫర్టబుల్‌గా ఉండే ఈ షార్ట్ ఫ్రాక్ డిజైన్స్‌ని ఒక బాటమ్ ఎంపికతో కుర్తీలుగానూ ఉపయోగించుకోవచ్చు.







కొత్తవే అయినా ఉపయోగించని దుపట్టాలు, చీరలు ప్రతి ఇంట్లో ఎన్నో కొన్ని తప్పక ఉంటాయి. వాటిని రీయూజ్ చేసుకుంటే ఈ వేసవి మరింత ఆహ్లాదంగా మారిపోతుంది. మంగళగిరి, ఇక్కత్, నారాయణ్‌పేట్, ఉప్పాడ.. వంటి చేనేతల గురించి మనకు తెలిసినదే. వాటితో ఇలా షార్ట్ ఫ్రాక్స్‌గా డిజైన్ చేసుకోవచ్చు. ఇవి మేనికి సౌకర్యంగా ఉండటమే కాదు సమ్మర్ స్టైల్ జాబితాలో మొదటి స్థానంలో నిలుస్తాయి. యంగ్‌స్టర్స్‌కి ఆలోచనలకు తగినట్టూ అందంగానూ ఉంటాయి. అందుకు ఇంట్లో ఉన్న చేనేత దుప్పట్లు, చీరలనూ ఉపయోగించుకోవచ్చు. లేదంటే, మార్కెట్‌లో లభించే వాటినీ ఎంపిక చేసుకోవచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫ్యాషనబుల్‌గా కనిపించవచ్చు.









వంటిల్లు

ఇంటి హలీమ్

రంజాన్ మాసం వచ్చేసింది... సగం మాసం పూర్తయింది కూడా. రోడ్డు మీదకు వెళ్తే హలీమ్ బోర్డులు ఆహ్వానిస్తున్నాయి. హలీమ్ రుచి నోరూరిస్తోంది. బలవర్థకమైన ఆహారాన్ని పిల్లలకు అలవాటు చేయడం మంచిదే. అయితే తరచూ బయట తెచ్చుకోవడం ఎందుకు? ప్రయత్నించాలనే ఆసక్తి ఉంటే... అంత శ్రమించే శక్తి ఉంటే మన 'వంటిల్లు' కూడా హలీమ్‌కు వేదికవుతుంది.

చికెన్ హలీమ్



కావలసినవి
చికెన్ – అర కేజీ (బోన్‌లెస్); **నెయ్యి** – 4 టేబుల్ స్పూన్‌లు; **జీడిపప్పు** – అర కప్పు; **బాదం** – పావు కప్పు; **పిస్తా**– 15; **దాల్చిన చెక్క** – రెండు అంగుళాల ముక్క; **యాలకులు** – 4; **నల్ల యాలకులు** – 2; **లవంగాలు** – 5; **మిరియాల పొడి** – టీ స్పూన్; **పత్తర్ ఫూల్** – టీ స్పూన్; **షాజీరా** – టీ స్పూన్; **తోక మిరియాలు** – టీ స్పూన్ (కెబాబ్ చీనీ); **ఉల్లిపాయ ముక్కలు** – కప్పు; **పచ్చిమిర్చి**– 6; **అల్లంవెల్లుల్లి పేస్ట్** – 2 టేబుల్ స్పూన్‌లు; **పసుపు** – పావు టీ స్పూన్; **ధనియాల పొడి**– టీ స్పూన్; **మిరప్పొడి**– అర టీ స్పూన్; **వేయించిన జీలకర్ర పొడి**– టీ స్పూన్; **పెరుగు**– అర కప్పు; **కొత్తిమీర తరుగు** – పావు కప్పు; **ఉప్పు** – టేబుల్ స్పూన్ లేదా రుచిని బట్టి; **నీరు** – ముప్పావు లీటరు.

డ్రైఫ్రూట్స్ పేస్ట్ కోసం...
వేయించిన జీడిపప్పు– గుప్పెడు; **వేయించిన బాదం** – గుప్పెడు; **వేయించిన పిస్తా**– అర గుప్పెడు; పెరుగు – అర కప్పు.

నానబెట్టాల్సిన ధాన్యాలు
గోధుమ రవ్వ – అర కప్పు (లావు రవ్వ); **పచ్చి శనగపప్పు** – టేబుల్ స్పూన్; **కందిపప్పు** – టీ స్పూన్; **ఓట్స్ లేదా బార్లీ** – రెండు టేబుల్ స్పూన్‌లు; **పెసర పప్పు** – టీ స్పూన్; **బియ్యం**– టేబుల్ స్పూన్; **మినప్పప్పు** – టేబుల్ స్పూన్; **నువ్వులు** – టీ స్పూన్.

హలీమ్ గార్నిష్ చేయడానికి...
పాలు – పావు కప్పు; ఎండిన గులాబీ రేకులు – 2 టేబుల్ స్పూన్‌లు; **పుదీన తరుగు** – పావు కప్పు; **కొత్తిమీర తరుగు** – పావు కప్పు; **గరం మసాలా** – ఒకటిన్నర టేబుల్ స్పూన్‌లు; **నెయ్యి**– అర కప్పు; **నేతిలో వేయించిన ఉల్లిపాయ ముక్కలు**– కప్పు; **నిమ్మకాయ ముక్కలు** – పది;

తయారీ:
- గోధుమ రవ్వ మినహా నానబెట్టిన ధాన్యాలన్నింటినీ ఒక పాత్రలో వేసి కడిగి నిండుగా నీటిని పోసి నాలుగు గంటల సేపు నానబెట్టాలి. గోధుమ రవ్వను విడిగా తడిపి పెట్టుకోవాలి. నాలుగు గంటల తర్వాత నీటిని వడపోసి రవ్వతోపాటు ధాన్యాలన్నింటినీ కలిపి మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి.
- చికెన్‌ను శుభ్రంగా కడిగి ఉప్పు నీటిలో అరగంట సేపు నానబెట్టాలి.
- ప్రెషర్ పాన్‌లో టేబుల్ స్పూన్ నెయ్యి వేడి చేసి జీడిపప్పు, బాదం, పిస్తాలను దోరగా వేయించి తీసి పక్కన పెట్టుకోవాలి.
- అదే పెనంలో లవంగాలు, దాల్చిన చెక్క, యాలకులు, మిరియాలు వేసి అవి వేగిన తరవాత ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేయించి ఇప్పుడు అల్లం వెల్లుల్లి పేస్ట్ కూడా వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించి అప్పుడు ఉప్పు నీటిలో నానబెట్టిన చికెన్ ముక్కలు వేసి కొద్దిసేపు వేగనివ్వాలి. ముక్కలు రంగు మారి తెల్లగా వచ్చిన తరవాత అందులో పచ్చి మిర్చి, ఉప్పు, పసుపుతోపాటు ధనియాల పొడి, మిరప్పొడి వంటి మసాలా దినుసులు పుదీన, కొత్తిమీర తరుగు, పెరుగు వేసి కలిపి రెండు నిమిషాల సేపు మగ్గనివ్వాలి. ఇప్పుడు ఒక కప్పు నీటిని పోసి మూత పెట్టి ఐదారు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి.
- కుక్కర్ వేడి తగ్గిన తరవాత పప్పు గుత్తితో మెత్తగా మెదపాలి.
- డ్రై ఫ్రూట్స్ పేస్ట్ కోసం తీసుకున్న జీడిపప్పు, బాదం, పిస్తా, పెరుగు కలిపి మిక్సీలో మెత్తగా పేస్ట్ చేయాలి.
- ఒక మందపాటి పాత్రలో రెండు టేబుల్ స్పూన్‌ల నెయ్యి వేడి చేసి అందులో పప్పులను గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని వేసి, కొద్దిగా నీటిని పోసి అడుగు పట్టకుండా గరిటెతో కలుపుతూ ఉడికించాలి. బుడగలు రావడం మొదలైన తర్వాత మెదిపిన చికెన్ మిశ్రమాన్ని వేసి పప్పు గుత్తితో మెదుపుతూ ఉడికించాలి. పదిహేను నిమిషాల తర్వాత డ్రై ఫ్రూట్ పేస్ట్ వేసి కలిపి ఉడకనివ్వాలి. అరగంట తర్వాత గరం మసాలా దినుసులు, నాలుగు టేబుల్ స్పూన్‌ల నెయ్యి వేసి కలిపి సన్న మంట మీద ఉడకనివ్వాలి. మరో పదిహేను నిమిషాల తర్వాత సగం కప్పు ఎర్రగా వేయించిన ఉల్లిపాయ ముక్కలు, పుదీన, కొత్తిమీర తరుగు, ఎండిన గులాబీ రేకులు, పాలు, రెండు టేబుల్ స్పూన్‌ల నెయ్యి వేసి కలిపితే హలీమ్ రెడీ. పప్పు దినుసుల పేస్ట్‌లో మెదిపిన చికెన్ మిశ్రమం వేసిన తర్వాత దాదాపు ఓ గంట సేపు ఉడకాలన్నమాట.

వడ్డించేటప్పుడు కప్పులో హలీమ్ వేసి పైన వేయించిన జీడిపప్పు, బాదం, పిస్తా, ఉల్లిపాయ ముక్కలు, నెయ్యి, నిమ్మకాయ ముక్క వేయాలి.



మటన్ హలీమ్ కూడా ఇంట్లో ప్రయత్నించవచ్చు. అయితే చికెన్ కంటే ఎక్కువ సేపు ఉడికించాల్సి ఉంటుంది.

వెజ్ హలీమ్



కావలసినవి
ఉల్లిపాయ ముక్కలు – కప్పు; **ఉప్పు** – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; **పాలు** – కప్పు;**అల్లం వెల్లుల్లి పేస్ట్** – టేబుల్ స్పూన్; **ఎండిన గులాబీరేకులు**– పావు కప్పు; **పచ్చి మిర్చి** – 5; **నెయ్యి** – 2టేబుల్ స్పూన్‌లు; **గోధుమ రవ్వ** – అర కప్పు (లావు రవ్వ); **ఓట్స్ లేదా బార్లీ** – పావు కప్పు; **బాదం** – 6; **శనగపప్పు** – టీ స్పూన్; **మినప్పప్పు** – టీ స్పూన్; **ఎర్ర కందిపప్పు** – టీ స్పూన్; **పెసర పప్పు** – టీ స్పూన్; **నువ్వులు** – టీ స్పూన్; **షాజీరా**– అర టీ స్పూన్; **లవంగాలు** – 2; **మిరియాలు** – టీ స్పూన్; **దాల్చిన చెక్క** – రెండంగుళాల ముక్క; **యాలకులు** – 8; **జీలకర్ర**– టీ స్పూన్; **తోక మిరియాలు** – అర టీ స్పూన్; **పెరుగు** – అరకప్పు; **కొత్తిమీర తరుగు**– టేబుల్ స్పూన్; **పుదీన తరుగు**– టేబుల్ స్పూన్; **జీడిపప్పు** – 20 గ్రా; **పిస్తా**– 20 గ్రా ; **బాదం** – 20 గ్రా; **సోయా బీన్ నగెట్స్** (మీల్ మేకర్)– 100 గ్రా; **నిమ్మరసం** – టీ స్పూన్; **నిమ్మకాయ ముక్కలు** – 10.

తయారీ
- మీల్‌మేకర్ ని శుభ్రంగా కడిగి ఉడికించి చల్లారిన తరవాత మిక్సీలో గ్రైండ్ చేయాలి. మరీ మెత్తగా చేయరాదు, కొంచెం బరకగా ఉండాలి.
- తోక మిరియాలు, షాజీరా, యాలకులు, దాల్చిన చెక్క, మిరియాలు, జీలకర్ర, పెసర పప్పు, మినప్పప్పు, ఎర్ర కందిపప్పు, శనగపప్పు, బాదం, ఓట్స్, గోధుమ రవ్వలను ఒక పాత్రలో వేసి బాగా కలిపి మిక్సీ లో పొడి చేయాలి.
- మందపాటి పాత్రను స్టవ్ మీద పెట్టి అందులో పెరుగు, పాలు, గులాబీరేకులు, కొత్తిమీర తరుగు, పుదీన తరుగు, ఉప్పు వేసి లీటరు నీరు పోయాలి. నీరు వేడెక్కే లోపు అందులో మసాలాలు, పప్పులతో చేసిన పొడిని వేసి ఉండలు లేకుండా కలిపి సన్న మంట మీద పదిహేను నిమిషాల పాటు ఉడికించాలి. పొడి పిండి ఉండలు కట్టకుండా ఉండాలంటే... ముందుగా పొడిలో చన్నీటిని పోసి కలుపుకుని అప్పుడు స్టవ్ మీదున్న నీటిలో పోయవచ్చు.
- ప్రెషర్ పాన్‌లో నెయ్యి వేడి చేసి ఉల్లిపాయ ముక్కలు సగం వేసి ఎర్రగా వేయించి తీసి పక్కన పెట్టుకోవాలి. అదే పాన్‌లో జీడిపప్పు, పిస్తా, బాదం దోరగా వేయించి, అందులో మిగిలిన ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేగిన తరవాత అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి వేసి మగ్గనివ్వాలి. ఇప్పుడు సోయాబీన్స్ నగెట్స్ (మీల్‌మేకర్) పేస్ట్ వేసి బాగా కలిపి మూత పెట్టి దాదాపుగా పదిహేను నిమిషాల పాటు మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి.
- వేడి తగ్గిన తరవాత మూత తీసి పప్పుగుత్తితో ఒకసారి అంతా సమంగా కలిసేటట్లు మెదిపి ఉప్పు చూసి అవసరమైతే కొంత కలుపుకుని, నిమ్మరసం కలిపితే వెజ్ హలీమ్ రెడీ.
- సర్వ్ చేయడానికి కప్పులోకి తీసుకున్న తర్వాత కొద్దిగా ఉల్లిపాయ ముక్కలు, నిమ్మకాయ ముక్క ఒకటి పెట్టాలి. ఇష్టమైతే కొత్తిమీర తరుగు కూడా కలుపుకోవచ్చు.

కిచెన్ టిప్



పచ్చళ్లను నిలవ చేసే గాజు సీసాలు, జాడీలను కొంచెంసేపు ఎండలో పెట్టాలి. అలా చేయడం వల్ల అందులో నీళ్లన్నీ ఎండిపోయి పచ్చళ్లు బూజు పట్టకుండా ఎక్కువ కాలం నిలవ ఉంటాయి.

స్వరరాగ మధుర తరంగాలు



● విన్నర్స్‌తో ఏఆర్ రెహమాన్

● మ్యూజిక్ వరల్డ్

'సాధన చేయుమురా నరుడా.... సాధ్యం కానిది లేదురా!' అన్నది పెద్దల మాట ఇంగ్లిష్ పాట విషయంలో కూడా ఆ విలువైన మాటను గుర్తు చేసుకోవాల్సి ఉంటుంది. విదేశాల్లో పుట్టిన వారు, ప్రవాసభారతీయులు మాత్రమే ఇంగ్లిష్ పాటను బాగా పాడగలరా? 'సాధన చేస్తే ఎవరైనా పాడగలరు' అని నిరూపించింది నెక్సా మ్యూజిక్ ల్యాబ్...

గోవాలో జరిగిన మ్యూజిక్ ఫెస్టివల్‌లో యువగళాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. 'ఎవరు వీరు?' అని ఆరా తీసేలా చేశాయి. దేశంలోని వివిధ ప్రాంతాలు, భిన్నమైన సాంస్కృతిక నేపథ్యాల నుంచి వచ్చిన వారు, 'ఒక్క ఛాన్స్ ప్లీజ్' అని స్టూడియోలు, స్టేజీల చుట్టూ చక్కర్లు కొట్టిన గాయకులు కూడా ఇందులో ఉన్నారు. అలాంటి వారు తమ టాలెంట్‌ను ఈ మ్యూజిక్ ఫెస్టివల్‌లో ప్రదర్శించే అవకాశం రావడానికి ప్రధాన కారణం నెక్సా మ్యూజిక్ ల్యాబ్.

నేషనల్‌వైడ్ టాలెంట్ డిస్కవరీ ప్లాట్‌ఫామ్ 'నెక్సా మ్యూజిక్ ల్యాబ్' మారుమూల ప్రాంతాల నుంచి మహా పట్టణాల వరకు మట్టిలో మాణిక్యాలను బయటకు తీసుకువచ్చి అంతర్జాతీయ స్థాయిలో మెరిపిస్తోంది.

ఈ పోటీలో పాల్గొనదలచినవారు మూడు నిమిషాల నిడివి ఉన్న ఒరిజినల్ ఇంగ్లిష్ మ్యూజిక్ కంపోజిషన్‌ను సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. పాప్, జాజ్, ఫ్యూజన్...మ్యూజిక్ జానర్ ఏదైనా ఫరవాలేదు. దీంతో పాటు నెక్సా మ్యూజిక్ అడిషన్‌లో కూడా పాల్గొనవలసి ఉంటుంది.

ఎంట్రీలకు మినిమం ఏజ్ లిమిట్...పద్దెనిమిది సంవత్సరాలు.

సబ్మిట్ చేసిన ఎంట్రీలు నియమ, నిబంధనలకు తగినట్లుగా లేకపోతే నెక్సా గ్యాలరీలో కనిపించవు. అయినా నిరాశ చెందనక్కర్లేదు. తప్పులు సవరించుకొని ఫ్రెష్‌గా పంపవచ్చు. వ్యక్తిగత స్థాయిలోనూ, మ్యూజిక్ బ్యాండ్‌లో ఒకరిగా కూడా పాల్గొనవచ్చు.

ఏఆర్ రెహమాన్ నేతృత్వంలోని జ్యూరీ 24 మందిని ఎంపిక చేస్తుంది. వీరికి నెక్సా మ్యూజిక్ సీజన్స్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. ఈ ఇరవైనాలుగు మంది నుంచి ఫైనల్‌గా నలుగురిని ఎంపిక చేసి, వారి చేత పాడించిన ఆల్బమ్‌లను అంతర్జాతీయంగా విడుదల చేస్తారు.

దిల్లీకి చెందిన నిశా నుంచి గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన యువ మ్యూజిక్ బ్యాండ్ 'హీట్ సింక్' వరకు ఎంతోమందిలో కొత్త వెలుగు తీసుకువచ్చింది నెక్సా మ్యూజిక్ ల్యాబ్.

బహుముఖ ప్రతిభ



నెక్సా సీజన్ 1 విజేతగా నిలిచిన దిల్లీకి చెందిన నిశా శెట్టి సింగర్, సాంగ్‌రైటర్, వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్‌గా బహుముఖ ప్రజ్ఞ ప్రదర్శిస్తోంది. చిన్నప్పటి నుంచి నాటకాలు, వాటికి సంబంధించిన వర్క్‌షాప్‌లను చూస్తూ పెరిగింది. కథక్, కూచిపూడి, హిందుస్థానీ శాస్త్రీయసంగీతం నేర్చుకుంది. చిన్న చిన్న షోలలో పాల్గొనే నిశాకు 'నెక్సా మ్యూజిక్ ల్యాబ్' టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చింది.

'ఎంపికైన విజేతలలో మీరు ఒకరు' అంటూ నిర్వాహకుల నుంచి వచ్చిన మెయిల్ నేహాకు ఎప్పుడూ గుర్తుండే తియ్యటి జ్ఞాపకం.

'కలలు కనడం వరకు మాత్రమే పరిమితం కాకూడదు. కల సాకారం చేసుకునే శక్తి కోసం ఎక్కడెక్కడో వెదకనక్కర్లేదు. అది మన దగ్గరే ఉంది' అంటుంది నిశా శెట్టి.

● సక్సెస్ స్టార్

విజయేష్



అప్పటికింకా జయేష్ వయసు పదమూడే. అయితే మాత్రం ఏమిటీ ఆ వయసులోనే ఫస్ట్ టెక్ బిజినెస్‌కు శ్రీకారం చుట్టాడు.'ఎంహెచ్ఎం' పేరుతో గేమింగ్ సర్వర్ పోర్టల్ ప్రొవైడర్‌ను ప్రారంభించాడు ముంబైకి చెందిన జయేష్ గడేవర్. దీనికి కాస్తో కూస్తో లాభాలు వచ్చినా సూపర్ ప్రాఫిట్ మాత్రం రాలేదు.

ఇక కాలేజీ రోజుల్లో స్నేహితులతో కలిసి ఒక మారథాన్ కోసం వృద్ధులకు ఉపయోగపడే సాఫ్ట్‌వేర్ తయారు చేశాడు జయేష్. ఇంట్లో వృద్ధులు పడిపోయినప్పుడుగానీ. ఇతరత్రా ప్రమాదాలు జరిగినప్పుడుగానీ సంబంధిత వ్యక్తులను ఈ సాఫ్ట్‌వేర్ ఎలార్ట్ చేస్తుంది.

'ముంబై యూనివర్శిటీ'లో ఇంజినీరింగ్ పూర్తయిన తరువాత ఆయుష్ ఘోష్, కుష్ కౌశిక్‌లతో కలిసి 'స్క్రట్ ఆటోమేషన్' అనే స్టార్టప్ మొదలుపెట్టాడు. ప్రాథమిక దశ, గ్రోత్-స్టేజ్‌లలో ఉన్న స్టార్టప్‌లకు సంబంధించి భద్రతాపరమైన కోణాలలో సహాయం అందించే 'స్క్రట్ ఆటోమేషన్' విదేశాలకు కూడా విస్తరించింది.

24 సంవత్సరాల జయేష్ గడేవర్ పేరు పక్కన కో-ఫౌండర్ అండ్ సీటీవో, స్క్రట్ ఆటోమేషన్ అనే అక్షరాలు ఘనంగా కనిపిస్తాయి. చదవడం, తెలుసుకోవడం, కొత్తగా ఆలోచించడం, ప్రయోగాలు చేయడం...అనేవి జయేష్ దైనందిన జీవితంలో భాగం అయ్యాయి. అందుకే విజయాలు అతడికి ఆత్మీయంగా దగ్గరయ్యాయి.

● గేమింగ్



వర్చువల్ రియాలిటీ బాక్సింగ్ వీడియోగేమ్ 'క్రీడ్ రైజ్ టు గ్లోరీ' రెండు రోజుల క్రితం విడుదలైంది. రాకీ ఫ్రాంచైజీ నుంచి వచ్చిన గేమ్ ఇది. లీడింగ్ వర్చువల్ రియాలిటీ స్టూడియో సర్వైవ్స్ నిర్మించిన ఈ ఛాంపియన్‌షిప్ ఎడిషన్‌లో కొత్త క్యారెక్టర్లు, లొకేషన్స్, కాస్ట్యూమ్స్ ఉంటాయి. సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. ఈసారి ప్లేయర్స్ హెవీ వెయిట్ ఛాంపియన్ అపోలో క్రీడ్ కుమారుడు ఎడోనిస్ క్రీడ్ రోల్‌లో ఆడాల్సి ఉంటుంది.

● 4కె/హెచ్‌డీఆర్ సపోర్ట్ ● అడ్వాన్స్‌డ్ కంట్రోలర్ ట్రాకింగ్ ● జానర్: ఫైటింగ్ ● మోడ్స్: సింగిల్ ప్లేయర్, మల్టీ ప్లేయర్ ● ప్లాట్‌ఫామ్స్: మైక్రోసాఫ్ట్ విండోస్, ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, ప్లేస్టేషన్ వీఆర్, ప్లేస్టేషన్ వీఆర్2



బిగ్గర్ ఫిష్ టు ఫ్రై

ఇంతకంటే ఆసక్తికరమైన విషయం ఉంది. ఇంతకంటే ముఖ్యమైన విషయం ఉంది. ఇంతకంటే మంచి అవకాశం ఉంది. ఇంతకంటే తీవ్రమైన సమస్య ఉంది...ఇలాంటి సందర్భాల్లో ఉపయోగించే ఇడియమ్ హ్యావ్ బిగ్గర్ ఫిష్ టు ఫ్రై. ఉదా: ఐ కాన్ట్ స్పెండ్ ఏ లాట్ ఆఫ్ టైమ్ ఆన్ ది ప్రాబ్లమ్. ఐ హ్యావ్ బిగ్గర్ ఫిష్ టు ఫ్రై.

రాక్ ది బోట్

సజావుగా జరుగుతున్న పనిని చెడగొట్టే ప్రయత్నం జరిగినప్పుడు, ఆశాజనకంగా సాగుతున్న చర్చలు ఫలప్రదం కాకుండా చేస్తున్నప్పుడు, ఐక్యతకు భంగం వాటిల్లే పరిస్థితి ఎవరైనా సృష్టించినప్పుడు...ఇలాంటి సందర్భాల్లో వార్నింగ్‌గా ఉపయోగించే ఇడియమ్ రాక్ ది బోట్. ఉదా: డోన్ట్ రాక్ ది బోట్ అన్‌టిల్ ది నెగోషియన్స్ ఆర్ ఫినిష్‌డ్.

● అవును...ఇది నిజమే!



▸ ప్రాచీన రోమన్ క్యాలెండర్‌లో 'ఏప్రిల్' అనేది రెండో నెల. 'ఏపిరైర్' అనే లాటిన్ పదం నుంచి 'ఏప్రిల్' వచ్చింది. దీని అర్థం తెరుచుకోవడం. ఏప్రిల్ నెలలో పూలు వికసిస్తాయి కాబట్టి ఆ పేరు వచ్చింది అనే వాదన ఉంది. ప్రాచీన రోమన్ క్యాలెండర్‌లో 'మార్చ్' మొదటి నెల. ఏప్రిల్ అనేది 'ఆఫ్రూ' అనే పదం నుంచి వచ్చింది అని కొందరి నమ్మకం. 'ఆఫ్రొడైటీ' అనే గ్రీకు దేవత నుంచి వచ్చిన పదం ఇది. అందం, ప్రేమకు ఈ దేవత ప్రతీక. ప్రేమ ప్రతిపాదనకు ఈ నెల సరియైనదని నమ్మేవారు.

▸ స్వచ్ఛమైన గాలి, సహజకాంతి తగిలితే ఆలోచనలు స్వచ్ఛంగా ఉంటాయని, ఆరోగ్యం బాగుంటుందనే ఉద్దేశంతో ఓపెన్-ఎయిర్ స్కూల్స్ ప్రారంభమయ్యాయి. వీటికి 'ఫారెస్ట్ స్కూల్' అనేది మార్గదర్శిగా నిలిచింది. జర్మన్ వైద్యుడు జాకబ్ బెర్న్‌హార్డ్ బెన్‌డిక్స్ 1904లో బెర్లిన్‌కు సమీపంలోని అడవిలో ఫారెస్ట్ స్కూల్ ప్రారంభించాడు. ఆ తరువాత జర్మనిలో ఇదొక ట్రెండ్‌గా మారి యూరప్, నార్త్ అమెరికాలకు విస్తరించింది.

● టెక్.. టాక్

శాంసంగ్ గెలాక్సీ ఎ54 5జీ



డిస్‌ప్లే: 6.40 అంగుళాలు
రిజల్యూషన్: 1080x2340 పిక్సెల్స్ :
మెమోరీ: 128జీబి 6జీబి ర్యామ్ 128జీబి 8జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్ :
వోఎస్: ఆండ్రాయిడ్ 13
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్

ప్రొఫైల్ పిక్చర్ హైడ్ చేయడానికి...

వాట్సప్‌లో వద్దనుకున్న కాంటాక్ట్స్ నుంచి ప్రొఫైల్ పిక్చర్‌ను హైడ్ చేయడానికి...

1. వాట్సప్ ఓపెన్ చేసి స్క్రీన్ టాప్ రైట్‌లోని 3-డాట్ మెనూ క్లిక్ చేయాలి.
2. సెట్టింగ్స్ సబ్-మెనూ క్లిక్ చేస్తే మల్టీపుల్ ఆప్షన్స్ కనిపిస్తాయి.
3. ప్రైవసీ క్లిక్ చేయాలి.
4. 'హూ కెన్ సీ మై పర్సనల్ ఇన్ఫో' సెక్షన్‌లో ప్రొఫైల్ ఫొటో ట్యాప్ చేయాలి.
5. 'మై కాంటాక్ట్స్ ఎక్సెప్ట్' ఆప్షన్‌లో సేవ్ చేసిన కాంటాక్ట్స్ కనిపిస్తాయి.
6. ప్రొఫైల్ పిక్చర్ బ్లాక్ చేయదల్చుకున్న కాంటాక్ట్‌ను ఎంపిక చేసుకోవాలి.
7. స్క్రీన్ బాటమ్ రైట్‌లోని టిక్ బటన్ నొక్కాలి.

సోనీ జెడ్‌వీ-ఈఐ



సోనీ కంపెనీ జెడ్‌వీ-ఈఐ
వ్లాగింగ్ కెమెరా వివరాలు...
● బాడీ ప్లస్ 28-60 ఎంఎం జూమ్ లెన్స్
● కెమెరా టైప్: ఇంటర్ ఛేంజబుల్ లెన్స్ డిజిటల్ కెమెరా ● కెమెరా సెక్షన్: 35 ఎంఎం ఫుల్‌ఫ్రేమ్ (35.6x23.8 ఎంఎం) ● కలర్ టెంపరేచర్ రేంజ్: 2500కె-9900కె
● యాంటి డస్ట్ ఫంక్షన్ ఫీచర్స్

సినిమా

ఆజా రాజా



● రవితేజ ● ఎన్టీఆర్ ● అల్లు అర్జున్

పాన్ ఇండియా ఫార్ములా భాషాపరమైన హద్దులను చెరిపేసింది. ఒక భాషలో రూపొందించిన చిత్రాలను ఇతర భాషల్లో అనువదించి, విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు హీరోలకు కూడా హిందీలో మంచి మార్కెట్ ఏర్పడింది. ఇప్పుడు బాలీవుడ్ మేకర్స్ 'ఆజా రాజా' (రా రాజా) అంటూ తెలుగు హీరోలతో స్ట్రయిట్ హిందీ చిత్రాలు నిర్మించడానికి ముందుకొస్తున్నారు. ప్రస్తుతం తెలుగు స్టార్స్ చేస్తున్న హిందీ స్ట్రయిట్ ఫిలింస్ విశేషాలు తెలుసుకుందాం.

● రవితేజ హీరోగా నటించిన పలు హిట్ సినిమాలు హిందీలో డబ్బింగ్ అయి, అక్కడి బుల్లితెరపై అడపా దడపా ప్రదర్శితమవుతున్నాయి. ఆ విధంగా హిందీ ప్రేక్షకుల్లో రవితేజకు మంచి పాపులారిటీ ఉంది. ఇప్పుడు స్ట్రయిట్‌గా రవితేజ బాలీవుడ్‌కు వెళ్లనున్నట్లు టాలీవుడ్ టాక్. తమిళ హిట్ ఫిల్మ్ 'మానాడు' రీమేక్‌లో (హిందీ, తెలుగు) రవితేజ, బాలీవుడ్ యాక్టర్ వరుణ్ ధావన్ కలిసి నటించనున్నారట. ఈ చిత్రానికి ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహిస్తారని సమాచారం. ఈ చిత్రాన్ని హీరో రానా, ఏషియన్ సునీల్ నిర్మిస్తారట.



● ప్రభాస్

'బాహుబలి' సక్సెస్‌తో లేటెస్ట్ జనరేషన్‌లో పాన్ ఇండియా స్టార్‌గా పేరు తెచ్చుకున్న తొలి హీరోగా ప్రభాస్‌ను చెప్పుకోవచ్చు. ఆ చిత్రం తర్వాత ప్రభాస్ నటించిన 'సాహో', 'రాధేశ్యామ్' చిత్రాల బడ్జెట్స్ పెరిగాయి. బాలీవుడ్‌లో కూడా భారీ ఎత్తున రిలీజ్ చేశారు. ప్రభాస్ హీరోగా నటించిన తాజా హిందీ చిత్రం 'ఆదిపురుష్'. ఓం రౌత్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని భూషణ్‌కుమార్, క్రిషణ్ కుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతార్, రాజేష్ నాయర్, వంశీ, ప్రమోద్ ఈ సినిమాను నిర్మించారు. రామాయణంగా ఆధారంగా రూపొందిన ఈ చిత్రం జూన్ 16న విడుదల కానుంది. అలాగే ప్రభాస్ హీరోగా కమిటైన మరో చిత్రం 'స్పిరిట్'. ప్రభాస్ కెరీర్‌లో 25వ చిత్రంగా రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించనున్నారు. టీ సిరీస్ భూషణ్‌కుమార్, భద్రకాళి పిక్చర్స్ సందీప్‌రెడ్డి వంగా, యూవీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్ ఈ సినిమాను నిర్మించనున్నారు. 2024 చివర్లో ఈ సినిమా సెట్స్‌పైకి వెళుతుందని టాక్.

● 'ఆర్ ఆర్ ఆర్'తో ఎన్టీఆర్ క్రేజ్ మరింత పెరిగిందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఈ క్రేజ్‌ను క్యాష్ చేసుకోవడంలో యశ్ రాజ్ ఫిలింస్ నిర్మాత ఆదిత్యా చోప్రా ఫస్ట్ సక్సెస్ అయ్యారు. యశ్ రాజ్ ఫిలింస్ నిర్మించనున్న స్పై మూవీ 'వార్ 2'లో హృతిక్ రోషన్‌తో కలిసి ఎన్టీఆర్ నటించనున్నట్లు తెలుస్తోంది. 'బ్రహ్మాస్త్రం' ఫేమ్ అయాన్ ముఖర్జీ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారని సమాచారం. ప్రస్తుతం బీ టౌన్‌లో బలంగా వినిపిస్తున్న ఈ వార్తలు నిజమైతే ఎన్టీఆర్ నటించే తొలి స్ట్రయిట్ హిందీ చిత్రం ఇదే అవుతుంది.

● బాలీవుడ్‌లో అల్లు అర్జున్ ఎంట్రీ గురించిన టాక్ ఎప్పట్నుంచో ఉంది. అల్లు అర్జున్‌తో ఓ హిందీ సినిమా చేయాలని బాలీవుడ్ నిర్మాత దినేష్ విజన్ ప్రయత్నించారు... కుదర్లేదు. ఆ తర్వాత దర్శక-నిర్మాత సంజయ్‌లీలా భన్సాలీతో అల్లు అర్జున్ సమావేశమవగానే ఈ ఇద్దరి కాంబినేషన్‌లో సినిమా అంటూ బాలీవుడ్ మీడియా కోడై కూసింది. కానీ అల్లు అర్జున్‌తో స్ట్రయిట్ హిందీ ఫిల్మ్ చేసే అవకాశం టీ సిరీస్ అధినేత భూషణ్ కుమార్‌కు లభించింది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా ఓ సినిమా తెరకెక్కనుంది. టీ సిరీస్, భద్రకాళి ప్రొడక్షన్స్ పతాకంపై భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, ప్రణవ్ రెడ్డి వంగా ఈ సినిమాను నిర్మించనున్నారు.



● వరుణ్ తేజ్

● దేశభక్తి నేపథ్యంతో కూడిన చిత్రంతో బాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు వరుణ్ తేజ్. శక్తి ప్రతాప్‌సింగ్‌ను దర్శకునిగా పరిచయం చేస్తూ, సోనీ పిక్చర్స్ ఇండియా, రెనైసాన్స్ పిక్చర్స్ పతాకంపై సందీప్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో వరుణ్ తేజ్ జెట్ పైలెట్‌గా చేస్తున్నారు. ప్రపంచ సుందరి మానుషీ చిల్లర్ హీరోయిన్. ఈ సినిమాను వచ్చే ఏడాది విడుదల చేయాలనుకుంటున్నారు.



● రామ్‌చరణ్, సల్మాన్ ఖాన్, వెంకటేశ్

దాదాపు పదేళ్ల క్రితమే హిందీలో 'జంజీర్' (తెలుగులో 'తుఫాన్')తో ఎంట్రీ ఇచ్చారు రామ్‌చరణ్. ఆ తర్వాత తెలుగు చిత్రాలకే పరిమితం అయ్యారు చరణ్. అయితే గత ఏడాది విడుదలైన 'ఆర్ఆర్ఆర్'లో ఓ హీరోగా నటించిన రామ్‌చరణ్‌కు బాలీవుడ్‌లో సూపర్ క్రేజ్ దక్కింది. హిందీలో స్ట్రయిట్ చిత్రాలు చేసే దిశగా చర్చలు జరుగుతున్న నేపథ్యంలో పదేళ్ల తర్వాత ఓ గెస్ట్ రోల్‌లో హిందీ తెరపై కనిపించనున్నారు చరణ్. సల్మాన్ ఖాన్, వెంకటేశ్ నటించిన 'కిసీ కా భాయ్ కిసీ కా జాన్' చిత్రంలో రామ్‌చరణ్ ఓ గెస్ట్ రోల్ చేశారు. ఈద్ సందర్భంగా ఈ నెల 21న ఈ చిత్రం రిలీజ్ కానుంది. మరోవైపు స్ట్రయిట్ హిందీ ఫిల్మ్ చేసేందుకు కూడా చరణ్ కొన్ని కథలు విన్నారు.



● బెల్లంకొండ సాయి శ్రీనివాస్

● బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కు హిందీ వ్యూయర్స్‌లో క్రేజ్ ఉంది. శ్రీనివాస్ హీరోగా నటించిన 'జయ జానకి నాయక' హిందీ వెర్షన్‌కు యూట్యూబ్‌లో 700 మిలియన్ వ్యూస్ రావడమే ఇందుకు ఓ నిదర్శనం. సాయి శ్రీనివాస్ నటించిన తెలుగు చిత్రాల హిందీ అనువాదాలకు అక్కడి ప్రేక్షకుల్లో మంచి ఆదరణ లభించింది. దీంతో 'ఛత్రపతి'గా బాలీవుడ్‌కు వెళ్తున్నారు బెల్లంకొండ సాయిశ్రీనివాస్. ప్రభాస్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన 'ఛత్రపతి' సినిమాకి రీమేక్ ఇది. అదే టైటిల్‌తో హిందీలో రీమేక్ అయిన ఈ సినిమాకు వీవీ వినాయక్ దర్శకత్వం వహించారు. జయంతి లాల్ గడ నిర్మించిన ఈ చిత్రం మే 12న విడుదల కానుంది.

మరికొందరు తెలుగు స్టార్స్ కూడా హిందీలో స్ట్రయిట్ ఫిల్మ్స్ చేసే చాన్స్ ఉంది.

మాస్ ఐ ఫోన్!



● గోపీచంద్, డింపుల్ హయతి

గోపీచంద్ హీరోగా శ్రీవాస్ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'రామబాణం'. డింపుల్ హయతి హీరోయిన్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా మే 5న రిలీజ్ కానుంది. మిక్కీ జె. మేయర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఐ ఫోన్..' అనే మాస్ పాటని గురువారం విడుదల చేశారు. ''యాక్షన్ అంశాలతో కూడిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'రామబాణం'. మాస్ పాటలు రాయడంలో స్పెషలిస్ట్ అయిన కాసర్ల శ్యామ్ తెలంగాణ యాసలో ఈ పాటను రాశారు. రామ్ మిరియాల, మోహనా భోగరాజు ఎనర్జిటిక్‌గా పాడారు. గోపీచంద్, డింపుల్ మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ఆకట్టుకుంటాయి'' అని చిత్రయూనిట్ తెలిపింది. జగపతిబాబు, ఖుష్బు, అలీ నటించిన ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, కెమెరా: వెట్రి పళనిసామి.

జిలేబి మంచి వినోదాత్మక చిత్రం అవుతుంది: వెంకటేశ్



● విజయ భాస్కర్, శివాని, వెంకటేశ్, శ్రీ కమల్, రామకృష్ణ, అంజు

''విజయ భాస్కర్‌గారు నాకు ఇష్టమైన డైరెక్టర్. నా ఫేవరేట్ చిత్రాలైన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి'లను ఆయన ఎంత చక్కగా తీశారో మనందరికీ తెలుసు. ఆయన తీసిన 'జిలేబి' కూడా తప్పకుండా మంచి వినోదాత్మక చిత్రం అవుతుందని నమ్ముతున్నాను'' అన్నారు హీరో వెంకటేష్. దర్శకుడు విజయ భాస్కర్ తనయుడు శ్రీ కమల్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'జిలేబి'. ఈ చిత్రంలో శివానీ రాజశేఖర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. విజయ భాస్కర్ దర్శకత్వంలో అంజు అస్రాని సమర్పణలో ఎస్ఆర్‌కే పతాకంపై గుంటూరు రామకృష్ణ నిర్మించిన చిత్రం 'జిలేబి'. ఈ సినిమా ఫస్ట్ లుక్ గ్లింప్స్‌ను వెంకటేష్ విడుదల చేసి, మాట్లాడుతూ–''జిలేబి' తో నటుడిగా పరిచయమవుతున్న కమల్‌కి, నిర్మాతలు రామకృష్ణ, అంజులకు ఆల్ ది బెస్ట్. ఇది అందరూ చూసే సినిమా అవుతుంది'' అన్నారు. ''వెంకటేష్‌గారి చేతులమీదుగా మా అబ్బాయి నటించిన 'జిలేబి' గ్లింప్స్ లాంచ్ కావడం సంతోషంగా ఉంది. 'జిలేబి' అందమైన ప్రయాణం. మణిశర్మగారు, రామకృష్ణ, అంజు, కెమెరామేన్ సతీష్... ఇలా అందరం కలిసి ఓ కుటుంబంలా పనిచేశాం'' అన్నారు. ''మా 'జిలేబి' చూసి మనసారా నవ్వుకుంటారని ఆశిస్తున్నాను'' అన్నారు శ్రీకమల్. ''నా మనసుకు దగ్గరైన సినిమా 'జిలేబి'' అన్నారు శివాని. ''నిర్మాతగా నా తొలి చిత్రం ఇది. బ్యాలెన్స్ ఉన్న రెండు పాటలను ఫారిన్‌లో చిత్రీకరించనున్నాం'' అన్నారు. ''విజయభాస్కర్‌లాంటి దర్శకునితో మా తొలి సినిమా చేసినందుకు చాలా సంతోషంగా ఉంది. త్వరలోనే ఈ మూవీ విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు అంజు.

ప్రేక్షకులు థ్రిల్ అవుతారు
- మేఘా ఆకాష్



''రావణాసుర' మూవీలో నాది చాలా కీలకమైన పాత్ర. కామెడీ, ఇంటెన్స్.. ఇలా వేరియేషన్స్ ఉంటాయి. ఆ పాత్ర చేయడం సవాల్‌గా అనిపించింది'' అని మేఘా ఆకాష్ అన్నారు. రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'రావణాసుర'. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ చిత్రంలో ఓ హీరోయిన్‌గా నటించిన మేఘా ఆకాష్ మాట్లాడుతూ–''రావణాసుర'లో నేను రిచ్, క్లాసీ అమ్మాయిగా కనిపిస్తాను. ఈ మూవీలో చాలా మలుపులు, ట్విస్టులు, సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి. ప్రేక్షకులు థ్రిల్ ఫీలవుతారు. సుధీర్ వర్మగారు ఒక యాక్టర్‌కి చాలా కంఫర్ట్ జోన్ ఇస్తారు. ప్రస్తుతం విజయ్ ఆంటోనీతో ఒక సినిమా, మా అమ్మగారి సమర్పణలో ఓ చిత్రం చేస్తున్నాను'' అన్నారు.

జై పవన పుత్ర హనుమాన్



● దేవదత్ నాగే

సినీ అభిమానులు, ముఖ్యంగా ప్రభాస్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న చిత్రం 'ఆదిపురుష్'. ప్రభాస్ హీరోగా ఓం రౌత్ దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా చిత్రమిది. రామాయణం ఇతివృత్తంగా రూపొందిన ఈ చిత్రంలో సీతగా కృతీ సనన్, రావణాసురుడిగా సైఫ్ అలీ ఖాన్, లక్ష్మణుడిగా సన్నీ సింగ్, హనుమాన్ పాత్రలో దేవదత్ నాగే నటించారు. ఈ చిత్రం జూన్ 16న విడుదల కానుంది. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని హనుమాన్ పోస్టర్‌ను విడుదల చేసింది యూనిట్. 'రామ భక్తుడు, రాముడి ఆత్మ.. జై పవన పుత్ర హనుమాన్!' అని క్యాప్షన్ ఇస్తూ హనుమంతుని పాత్రధారి దేవదత్ నాగే లుక్ రిలీజ్ చేశారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
144	42
59,833	17,599

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	12,082	▲	85
డోజోన్స్	33,473	▽	9
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,472	▲	79
డాక్స్	15,598	▲	78
షాంఘై	3,313		0
నికాయ్	27,473	▽	341

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	60,623	▽ 158
బంగారం (22 క్యారెట్)	60,380	▽ 158
వెండి (కిలో)	74,164	▲ 330

గో డిజిట్ మళ్లీ ఐపీవో బాట

తాజా సమాచారంతో సెబీకి ప్రాస్పెక్టస్


న్యూఢిల్లీ: సాధారణ బీమా సేవలందించే గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ మళ్లీ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి తాజాగా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. కెనడియన్ సంస్థ ఫెయిర్‌ఫాక్స్ గ్రూప్‌నకు పెట్టుబడులున్న కంపెనీ ఉద్యోగుల గుర్తింపు ఆధారిత రైట్స్ స్టాక్ పథకంలో తగిన సవరణలు చేసింది. తద్వారా సెబీకి మరోసారి ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది. ఈ ఏడాది జనవరి 30న సెబీ మరింత సమాచారాన్ని కోరుతూ 2022 ఆగస్ట్‌లో గో డిజిట్ సమర్పించిన ప్రాస్పెక్టస్‌ను వెనక్కి పంపింది. ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్ ఎప్రిషియేస్ రైట్స్ పథకం నిబంధనల అమలుపై తొలి ప్రాస్పెక్టస్‌ను సెబీ తిప్పి పంపిన విషయం విదితమే. ఆపై ఉద్యోగుల స్టాక్ ఆప్షన్ పథకంలో సవరణలకు వాటాదారులు, బోర్డు ఆమోదముద్ర వేశాయి.

రూ. 1,250 కోట్ల ఈక్విటీ జారీ

ఐపీవో అప్‌డేటెడ్ ప్రాస్పెక్టస్ ప్రకారం గో డిజిట్ రూ.1,250 కోట్ల ఈక్విటీని జారీ చేయనుంది. వీటికి అదనంగా 10.94 కోట్ల షేర్లను ప్రమోటర్ గో డిజిట్ ఇన్ఫోవర్క్స్‌తోపాటు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. క్రికెటర్ విరాట్ కోహ్లీ, అతని భార్య, నటి అనుష్క శర్మ కంపెనీలో ఇన్వెస్ట్ చేశారు.

ఎక్కడి రేట్లు అక్కడే..!

- ఆర్‌బీఐ అనూహ్య నిర్ణయం
- మార్కెట్ అంచనాలకు భిన్నంగా కీలక రెపో రేటు యథాతథం
- 6.5 శాతంగా కొనసాగింపు
- అవసరమైతే తరువాతి సమావేశాల్లో వడ్డింపు ఉంటుందని సూచన
- ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ అంశాలను జాగ్రత్తగా గమనిస్తున్నట్లు వెల్లడి



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మార్కెట్ అంచనాలకు భిన్నమైన నిర్ణయం తీసుకుంది. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు– రెపోను యథాతథంగా 6.5 శాతం వద్దే ప్రస్తుతానికి కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేసింది. 11 నెలల వరుస రేటు పెంపు అనంతరం ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయం విశ్లేషకుల అంచనాలకు భిన్నంగా ఉంది. నిజానికి ఈ దఫా రేటు పావుశాతం వరకూ ఉంటుందని మార్కెట్, ఆర్థిక విశ్లేషకులు అంచనావేశారు.

ఏకగ్రీవ నిర్ణయం

ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ద్రవ్యపరపతి విధాన కమిటీ (ఎంపీసీ) ఏకగ్రీవంగా రేటు పెంపు నిలుపుదల నిర్ణయం తీసుకుంది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి, అంతర్జాతీయంగా క్రూడ్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తీవ్రత నేపథ్యంలో దీర్ఘకాలంగా 4 శాతంగా ఉన్న రెపో రేటు, గతేడాది మే 4వ తేదీన మొదటిసారి 0.40 శాతం పెరిగింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో వరుసగా ఆరవసారి పెంపుతో అప్పటి నుంచి 2.5% రెపో రేటు పెరిగినట్లయ్యింది.

వృద్ధి 6.5 శాతానికి పెంపు

2023–24లో వృద్ధి రేటు 6.5 శాతంగా నమోదవుతుందని ఆర్‌బీఐ తాజాగా అంచనావేసింది. ఫిబ్రవరిలో వేసిన 6.4 శాతం రేటు అంచనాల తాజా పెంపు సానుకూల పరిణామం. క్యూ1లో 7.8%, క్యూ2లో 6.2 శాతం, క్యూ3లో 6.1 శాతం, క్యూ4లో 5.9 శాతం వృద్ధి నమోదు అంచనా.

ద్రవ్యోల్బణం అంచనా తగ్గింపు

వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 2023–24లో 5.3 శాతం ఉంటుందని ఫిబ్రవరిలో అంచనా వేస్తే, తాజాగా ఈ అంచనాలను 5.2 శాతానికి తగ్గించడం వృద్ధికి దారితీసే మరో హర్షణీయ పరిణామం. అయితే ద్రవ్యోల్బణంపై పోరు ముగిసిపోలేదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఒపెక్ చమురు ఉత్పత్తి కోత నిర్ణయం ఇక్కడ పరిశీలనలోకి తీసుకోవాల్సిన అంశంగా పాలసీ పేర్కొంది. రిటైల్ ద్రవ్యోల్బణం కేంద్రం నిర్దేశిస్తున్న విధంగా 6 శాతం దిగువకు సుదీర్ఘ కాలం కొనసాగేంత వరకూ దీనిపై సెంట్రల్ బ్యాంక్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధానానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం 2022 నవంబర్, డిసెంబర్ మినహా 2022 జనవరి నుంచి 6 శాతం ఎగువనే కొనసాగుతోంది.

వెనక్కు మళ్లడం కాదు.. విరామమే..!

తాజా నిర్ణయం కఠిన ద్రవ్య విధానం నుంచి వెనక్కు మళ్లినట్లు కాదు. ఇది కేవలం విరామం మాత్రమే. ఈ నిర్ణయం ''కేవలం ఈ సమావేశానికి మాత్రమే''. అవసరమైతే మళ్లీ రేటు పెంపు ఉంటుంది. అంతర్జాతీయ అంశాలను, ద్రవ్యోల్బణం కదలికలను జాగ్రత్తగా గమనిస్తున్నాం. వృద్ధి–ద్రవ్యోల్బణం సమతౌల్యతపై ప్రస్తుతానికి దృష్టి సారించడం జరుగుతోంది. చమురు ధరలు సహా పలు అంశాలకు సంబంధించి అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు నాటకీయ మార్పులను గమనిస్తున్నాం.

– శక్తికాంతదాస్, ఆర్‌బీఐ గవర్నర్

ముఖ్యాంశాలు...

- రెగ్యులేటర్లు నిరంతరం 'ఒడిదుడుకులకు దారితీసే అంశాలపై' అప్రమత్తంగా ఉండాలి. ఈ సవాళ్లపై నిరంతర పర్యవేక్షణ అవసరం.
- అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో బ్యాంకింగ్ సంక్షోభ పరిస్థితులపై ఆర్‌బీఐ నిరంతర అప్రమత్తత పాటిస్తుంది. బ్యాంకింగ్‌లో తగిన నిధుల లభ్యత అవసరాలను పర్యవేక్షిస్తుంది.
- బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని డిపాజిట్లను గుర్తించడానికిగాను ఆర్‌బీఐ ఒక కేంద్రీకృత పోర్టల్‌ను ఏర్పాటు చేస్తుంది.
- భారత రూపాయి 2022లో ఒక క్రమపద్ధతిలో కదలాడింది. 2023లో కూడా అలాగే కొనసాగుతుంది. కరెన్సీ స్థిరత్వంపై ఆర్‌బీఐ అప్రమత్తత కొనసాగుతుంది.
- బ్యాంకింగ్ నెట్‌వర్క్ నుంచి యూపీఐ ద్వారా ముందస్తు రుణాలను పొందేందుకు త్వరలో మార్గదర్శకాలు జారీ కానున్నాయి.
- 2023–24 ఆర్థిక సంవత్సరం రెండవ ద్వైమాసిక ద్రవ్య పరపతి సమీక్ష జూన్ 6 నుంచి 8 వరకూ జరుగుతుంది.

తగిన నిర్ణయం

ఆర్‌బీఐ తగిన మంచి నిర్ణయం తీసుకుందని నేను భావిస్తున్నాను. దేశ ఎకానమీ సౌలభ్యతను ఇది సూచిస్తోంది

– నిర్మలా సీతారామన్, ఆర్థికశాఖ మంత్రి

ఆశ్చర్యం కలిగించింది

మరో దఫా రేటు పెంపుపై ఖాయమని మార్కెట్ వర్గాల అంచనా నేపథ్యంలో సెంట్రల్ బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయం ఆశ్చర్యం కలిగించింది. అయితే సమయానుకూలంగా నిర్ణయం జరిగింది.

– దినేశ్ ఖరా, ఎస్‌బీఐ చైర్మన్

పరిణతి విధానం

ఆర్‌బీఐ పాలసీ పరిణతితో ఉంది. ఈ నిర్ణయం హర్షణీయం. ఆర్థిక వ్యవస్థ, ఫైనాన్షియల్ మార్కెట్లకు స్థిరత్వాన్ని అందిస్తుంది.

– సుబ్రకాంత్ పాండా, ఫిక్కీ ప్రెసిడెంట్

రియల్టీకి ఊతం

రెపో రేటును యథాతథంగా కొనసాగించాలనే నిర్ణయంపై రియల్ ఎస్టేట్ పరిశ్రమ హర్షం వ్యక్తం చేస్తోంది. ఇది గృహ డిమాండ్‌ను వేగవంతం చేయడమే కాకుండా మొత్తం ఈ విభాగంలోని అన్ని రంగాల పురోగతికి దోహదపడుతుంది. ముఖ్యంగా చౌక గృహ డిమాండ్‌ను ప్రేరేపించే నిర్ణయమిది.

– హర్షవర్ధన్ పటోడియా, క్రెడాయ్ నేషనల్ ప్రెసిడెంట్

బెట్టింగ్ గేమ్‌లపై నిషేధం

- గేమింగ్ స్వీయ నియంత్రణకు ఎస్‌ఆర్‌వోలు
- ఆన్‌లైన్ గేమింగ్ నిబంధనల ప్రకటన

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్ రంగ నియంత్రణకు సంబంధించి కేంద్రం గురువారం నిబంధనలను ప్రకటించింది. సిసలైన డబ్బులు పెట్టి ఆడేవి, బెట్టింగ్ చేసే గేమ్‌లను నిషేధించింది. అలాగే, ఆన్‌లైన్ గేమింగ్ రంగం స్వీయ నియంత్రణ విధానాన్ని పాటించాలని సూచించింది. ఈ దిశగా దేశీయంగా ఉపయోగించే గేమ్‌లను ఆమోదించేందుకు తొలుత మూడు స్వీయ నియంత్రణ సంస్థలను (ఎస్‌ఆర్‌వో) నోటిఫై చేయనుంది. 2021 ఐటీ చట్టాలకు సవరణగా ఈ నిబంధనలను చేర్చారు. సిసలైన డబ్బుతో పందేలు కాయనివి, వినియోగదారులకు హాని కలిగించే కంటెంట్ ఏదీ ఉండనివి, పిల్లలకు వ్యసనంగా మారని గేమ్స్‌కు అనుమతి ఉంటుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ చెప్పారు. 'ఆన్‌లైన్ గేమింగ్ వృద్ధికి భారత్‌లో అపార అవకాశాలు ఉన్నాయి. అది గణనీయంగా విస్తరించేందుకు ఈ నిబంధనలు తోడ్పడగలవు' అని మంత్రి చెప్పారు. కొత్త నిబంధనలు నవకల్పనలకు ఊతమివ్వగలవని, ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని పెంపొందించగలదని పరిశ్రమ వర్గాలు స్వాగతించాయి. గ్యాంబ్లింగ్ ప్లాట్‌ఫాంలను ఏరివేసి, అంతర్జాతీయంగా పరిశ్రమ పోటీపడేలా ప్రోత్సహించగలవని అభిప్రాయపడ్డాయి.

నిబంధనల్లో మరిన్ని ముఖ్య అంశాలు..

- ఆన్‌లైన్ గేమ్స్‌ను నియంత్రించే ఎస్‌ఆర్‌వోల్లో పరిశ్రమ ప్రతినిధులు, గేమర్లు, ఇతరత్రా సంబంధిత వర్గాలు ఉంటాయి. నిబంధనల ప్రకారం ఎస్‌ఆర్‌వోల్లో ఒక విద్యావేత్త, సైకాలజీ నిపుణులు, బాలల హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న వ్యక్తి లేదా అధికారి ఉండాలి. నిబంధనలకు అనుగుణంగా నడుచుకోకపోతే ఎస్‌ఆర్‌వోలను డీనోటిఫై చేస్తారు.
- గేమింగ్ వ్యసనంగా మారకుండా, ఆర్థికంగా నష్టపోకుండా, మోసాల బారిన పడకుండా యూజర్లను కాపాడేందుకు తగు వ్యవస్థను ఎస్‌ఆర్‌వోలు రూపొందించాలి. ఒక గేమింగ్ సెషన్‌లో సముచిత సమయం దాటితే పదే పదే హెచ్చరిక మెసేజీలు కూడా పంపించే విధంగా అది ఉండాలి.



బీ న్యూ మొబైల్స్ స్టోర్‌లో రెడ్‌మీ 12సి సిరీస్ ఫోన్లు

హైదరాబాద్: ప్రముఖ రిటైల్ చైన్ బీ న్యూ మొబైల్ స్టోర్ రెడ్‌మీ 12సీ, 12 సిరీస్ స్మార్ట్ ఫోన్లను అందుబాటులోకి తెచ్చింది. సినీ నటి దక్ష నాగర్కర్ గురువారం రెడ్‌మీ 12సీ స్మార్ట్‌ఫోన్‌ను గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ''బీ న్యూ స్టోర్స్ అద్భుతమైన ఆఫర్లతో రెడ్‌మీ 12సీ స్మార్ట్‌ఫోన్లను తక్కువ ధరకే అందిస్తుంది. కస్టమర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి'' అని నాగర్కర్ కోరారు. ఆవిష్కరణ కార్యక్రమంలో కంపెనీ సీఎండీ బాలాజీ చౌదరి, సీఈఓ సాయి నిఖిలేశ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి నితేశ్‌తో పాటు రెడ్‌మీ ప్రతినిధులు పాల్గొన్నారు.



బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్ల జోరు

ముంబై: స్టాక్ సూచీలు అయిదో రోజూ లాభాలను ఆర్జించాయి. ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ ఆర్థికవేత్తల అంచనాలకు భిన్నంగా కీలక వడ్డీరేట్ల యథాతథ కొనసాగింపునకు మొగ్గుచూపింది. ఫలితంగా వడ్డీ రేట్ల ఆధారిత బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో, రియల్టీ షేర్లు రాణించాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 144 పాయింట్లు లాభపడి 59,833 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 42 పాయింట్లు పెరిగి 17,599 వద్ద నిలిచింది. చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్ లభించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ షేర్లు అరశాతానికి పైగా లాభపడ్డాయి. ఐటీ, టెక్, మెటల్, వినిమయ, టెలీకమ్యూనికేషన్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. గుడ్ ఫ్రైడే సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు.

ఆర్‌బీఐ రెపో రేటులో ఎలాంటి మార్పు లేకపోవడంతో వడ్డీరేట్ల ఆధారిత బ్యాంకింగ్, ఆటో, రియల్టీ షేర్లు లాభపడ్డాయి. బ్యాంకింగ్ రంగ ఇండస్ఇండ్ బ్యాంక్ 2%, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఒకశాతం ఒకశాతం, కోటక్ మహీంద్రా బ్యాంక్ అరశాతం పెరిగాయి.



ఎవలాన్ టెక్ ఐపీవో ఓకే

ఎలక్ట్రానిక్ తయారీ సర్వీసుల కంపెనీ ఎవలాన్ టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూ గట్టెక్కింది. చివరి రోజు గురువారానికల్లా 2.2 రెట్లు అధికంగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. ఐపీవోలో భాగంగా 1.14 కోట్ల షేర్లను ఆఫర్ చేయగా.. 2.53 కోట్ల షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి.



పోరాడి ఓడిన సాకేత్-యూకీ జోడీ

యూఎస్ పురుషుల క్లే కోర్టు టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో భారత డబుల్స్ జోడీ సాకేత్ మైనేని, యూకీ బాంబ్రీ జోడీ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. అమెరికాలోని హ్యూస్టన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాకేత్-యూకీ ద్వయం 6–7 (6/8), 6–2, 5–10తో 'సూపర్ టైబ్రేక్'లో రాబర్ట్ గాలోవే (అమెరికా)–మిగేల్ ఏంజెల్ రేయస్ వరేలా (మెక్సికో) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. గంటా 40 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్, యూకీ మూడు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌లో ఆరుసార్లు బ్రేక్ పాయింట్లను కాపాడుకున్న సాకేత్, యూకీ ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు. అయితే నిర్ణాయక సూపర్ టైబ్రేక్‌లో మాత్రం గాలోవే-వరేలా ద్వయం పైచేయి సాధించింది. తొలి రౌండ్‌లో నిష్క్రమించిన సాకేత్, యూకీలకు 3,510 డాలర్ల (రూ. 2 లక్షల 87 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

ప్రియాన్షు సంచలనం

ప్రపంచ 12వ ర్యాంకర్‌పై విజయం

న్యూఢిల్లీ: ఓర్లియాన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువతార ప్రియాన్షు రజావత్ సంచలనం సృష్టించాడు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రియాన్షు ప్రపంచ 12వ ర్యాంకర్, టాప్ సీడ్ కెంటా నిషిమోటో (జపాన్)పై గెలుపొందాడు. గతవారం స్పెయిన్ మాస్టర్స్ టోర్నీలో చాంపియన్‌గా నిలిచిన నిషిమోటోతో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 58వ ర్యాంకర్ ప్రియాన్షు 21–8, 21–16తో గెలుపొంది క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. థామస్ కప్ టైటిల్ సాధించిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్న ప్రియాన్షు ఈ మ్యాచ్ తొలి గేమ్‌లో 10–0తో ఆధిక్యంలోకి వెళ్లడం విశేషం. రెండో గేమ్‌లో ప్రియాన్షుకు పోటీ ఎదురైనా కీలకదశలో పాయింట్లు గెలిచి 42 నిమిషాల్లో విజయాన్ని అందుకున్నాడు. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో చి యు జెన్ (చైనీస్ తైపీ)తో ప్రియాన్షు తలపడతాడు.



'నంబర్‌వన్' అర్జెంటీనా



జ్యూరిక్: అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) ప్రపంచ ర్యాంకింగ్స్‌లో విశ్వవిజేత అర్జెంటీనా జట్టు ఆరేళ్ల తర్వాత మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకుంది. ఇటీవల పనామా, కురాసావ్ జట్లతో జరిగిన అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌ల్లో అర్జెంటీనా గెలుపొందడంతో మెస్సీ బృందం రెండో స్థానం నుంచి అగ్రస్థానానికి చేరుకుంది. గత ఏడాది ఖతర్‌లో జరిగిన ప్రపంచకప్‌లో మెస్సీ నాయకత్వంలోని అర్జెంటీనా 36 ఏళ్ల తర్వాత జగజ్జేతగా నిలిచిన సంగతి తెలిసిందే. మొరాకోతో జరిగిన ఫ్రెండ్లీ మ్యాచ్‌లో బ్రెజిల్ ఓడిపోవడంతో ఆ జట్టు నంబర్‌వన్ ర్యాంక్ నుంచి రెండు స్థానాలు పడిపోయి మూడో ర్యాంక్‌కు చేరుకుంది. మూడో స్థానంలో ఉన్న ఫ్రాన్స్ రెండో స్థానానికి ఎగబాకింది. బెల్జియం నాలుగో ర్యాంక్‌లో, ఇంగ్లండ్ ఐదో ర్యాంక్‌లో ఉన్నాయి.

భారత్ @ 101

గురువారం విడుదల చేసిన 'ఫిఫా' ర్యాంకింగ్స్‌లో భారత జట్టు ఐదు స్థానాలు పురోగతి సాధించి 101వ ర్యాంక్‌కు చేరుకుంది. స్వదేశంలో జరిగిన మూడు దేశాల టోర్నీలో కిర్గిజ్ రిపబ్లిక్, మయన్మార్ జట్లపై గెలిచి విజేతగా నిలవడంతో ర్యాంకింగ్స్‌లో భారత్ ఎగబాకింది. 1994లో భారత్ అత్యుత్తమంగా 94వ ర్యాంక్‌లో నిలిచింది.

ఐర్లాండ్ పోరాటం

- రెండో ఇన్నింగ్స్‌లో 286/8
- లొర్కాన్ టకెర్ సెంచరీ



టకెర్

మిర్పూర్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో ఐర్లాండ్ అసాధారణ పోరాటపటిమను కనబరిచింది. 131 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోరు 27/4తో మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఐర్లాండ్ ఆట ముగిసే సమయానికి 107 ఓవర్లలో 8 వికెట్లకు 286 పరుగులు సాధించింది. వికెట్ కీపర్ లొర్కాన్ టకెర్ (162 బంతుల్లో 108; 14 ఫోర్లు, 1 సిక్స్) వీరోచిత సెంచరీ చేశాడు. హ్యారీ టెక్టర్ (56; 7 ఫోర్లు, 1 సిక్స్), మెక్‌బ్రైన్ (71 బ్యాటింగ్; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో అదరగొట్టారు. టెక్టర్, టకెర్ ఆరో వికెట్‌కు 72 పరుగులు... టకెర్, మెక్‌బ్రైన్ ఏడో వికెట్‌కు 111 పరుగులు భాగస్వామ్యం జోడించారు.

వన్డే ప్రపంచకప్‌కు విలియమ్సన్ దూరం!

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ స్టార్ క్రికెటర్ కేన్ విలియమ్సన్ ఈ ఏడాది అక్టోబర్–నవంబర్‌లలో భారత్ వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ టోర్నీలో ఆడేది సందేహంగా మారింది. చెన్నైతో జరిగిన ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో గుజరాత్ తరఫున బరిలోకి దిగిన విలియమ్సన్ బౌండరీ వద్ద క్యాచ్‌కు ప్రయత్నించి గాయపడ్డాడు. విలియమ్సన్ కుడి మోకాలికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. శస్త్రచికిత్స తర్వాత విలియమ్సన్ కోలుకోవడానికి ఆరు నెలలు సమయం పట్టే అవకాశముంది.


శార్దుల్ ధనాధన్...

- 29 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 68
- కోల్‌కతా నైట్‌రైడర్స్ బోణీ
- బెంగళూరుపై 81 పరుగులతో గెలుపు
- రాణించిన గుర్బాజ్, రింకూ సింగ్
- వరుణ్, నరైన్, సుయశ్ మాయాజాలం

కోల్‌కతా: సొంతగడ్డపై కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) సమష్టి ప్రదర్శనతో గర్జించింది. ఐపీఎల్ టోర్నీలో తొలి విజయం నమోదు చేసింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుతో ఈడెన్ గార్డెన్స్‌లో గురువారం జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ 81 పరుగుల తేడాతో గెలుపొందింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 7 వికెట్లకు 204 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శార్దుల్ ఠాకూర్ (29 బంతుల్లో 68; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. గుర్బాజ్ (44 బంతుల్లో 57; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), రింకూ సింగ్ (33 బంతుల్లో 46; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా దూకుడుగా ఆడారు. ఈ ముగ్గురి బ్యాటింగ్ కారణంగా కోల్‌కతా స్కోరు 200 పరుగులు దాటింది. బెంగళూరు బౌలర్లలో డేవిడ్ విల్లీ, కరణ్ శర్మ రెండు వికెట్ల చొప్పున తీశారు. అనంతరం 205 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు 17.4 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. వరుణ్ చక్రవర్తి (4/15), సునీల్ నరైన్ (2/16), తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడిన 'ఇంపాక్ట్ ప్లేయర్' సుయశ్ శర్మ (3/30) తమ స్పిన్ మాయాజాలంతో బెంగళూరు జట్టును దెబ్బతీశారు.



శార్దుల్



సుయశ్ శర్మ

ఆ ఇద్దరి దూకుడుతో...

తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కతాకు శుభారంభం లభించలేదు. డేవిడ్ విల్లీ వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో వరుస బంతుల్లో వెంకటేశ్ అయ్యర్, మన్‌దీప్ బౌల్డ్ అయ్యారు. ఒకవైపు గుర్బాజ్ జోరు కొనసాగించడంతో కోల్‌కతా పవర్‌ప్లేలో రెండు వికెట్లకు 47 పరుగులు చేసింది. ఏడో ఓవర్ తొలి బంతికి కోల్‌కతా కెప్టెన్ నితీశ్ రాణా అవుటయ్యాడు. ఆ తర్వాత రింకూ సింగ్‌తో జత కలిసి గుర్బాజ్ కోల్‌కతా ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. 11 ఓవర్లు ముగిసే సరికి కోల్‌కతా 87/3తో నిలిచింది. కరణ్ శర్మ వేసిన 12వ ఓవర్లో కోల్‌కతాకు దెబ్బ పడింది. వరుస బంతుల్లో గుర్బాజ్, రసెల్ పెవిలియన్ చేరడంతో కోల్‌కతా 89/5తో ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన శార్దుల్ ఠాకూర్ చెలరేగిపోయాడు. బెంగళూరు బౌలర్లపై ఫోర్లు, సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. 20 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రింకూ, శార్దుల్ 102 పరుగుల భాగస్వామ్యానికి 19వ ఓవర్ చివరి బంతికి హర్షల్ పటేల్ తెరదించాడు. ఆఖరి ఓవర్లో శార్దుల్‌ను సిరాజ్ అవుట్ చేయగా... చివరి రెండు బంతుల్లో ఉమేశ్ ఆరు పరుగులు స్కోరు చేయడంతో కోల్‌కతా స్కోరు 200 పరుగులు దాటింది.

తడబాటు...

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరుకు ఓపెనర్లు కోహ్లి (18 బంతుల్లో 21; 3 ఫోర్లు), డు ప్లెసిస్ (12 బంతుల్లో 23; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) శుభారంభం ఇచ్చారు. అయితే ఐదో ఓవర్లో నరైన్ బౌలింగ్‌లో కోహ్లి, ఆరో ఓవర్లో వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో డు ప్లెసిస్ బౌల్డయ్యారు. దాంతో బెంగళూరు ఇన్నింగ్స్ తడబడింది. హిట్టర్లు బ్రేస్‌వెల్, మ్యాక్స్‌వెల్, దినేశ్ కార్తీక్ క్రీజులో నిలదొక్కుకోవడంలో విఫలమయ్యారు. తక్కువ స్కోర్లకే పెవిలియన్ బాట పట్టడంతో బెంగళూరు ఓటమి ఖాయమైంది. కోల్‌కతా జట్టులో వెంకటేశ్ అయ్యర్ స్థానంలో 'ఇంపాక్ట్ ప్లేయర్'గా బరిలోకి దిగిన లెగ్ స్పిన్నర్, 19 ఏళ్ల సుయశ్ శర్మ మూడు వికెట్లతో ప్రభావం చూపించాడు. మరోవైపు బెంగళూరు ఇన్నింగ్స్‌లో సిరాజ్ స్థానంలో 'ఇంపాక్ట్ ప్లేయర్'గా బరిలోకి దిగిన అనూజ్ రావత్ కేవలం ఒక పరుగు మాత్రమే చేసి నిరాశపరిచాడు.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	2	2	0	4	0.700
పంజాబ్	2	2	0	4	0.333
కోల్‌కతా	2	1	1	2	2.056
రాజస్తాన్	2	1	1	2	1.675
లక్నో	2	1	1	2	0.950
చెన్నై	2	1	1	2	0.036
బెంగళూరు	2	1	1	2	-1.256
ఢిల్లీ	2	0	2	0	-1.703
ముంబై	1	0	1	0	-1.981
హైదరాబాద్	1	0	1	0	-3.600

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

లక్నో × హైదరాబాద్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



వరుణ్ చక్రవర్తి

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: రహ్మానుల్లా గుర్బాజ్ (సి) ఆకాశ్‌దీప్ (బి) కరణ్ శర్మ 57; వెంకటేశ్ అయ్యర్ (బి) విల్లీ 3; మన్‌దీప్ సింగ్ (బి) విల్లీ 0; నితీశ్ రాణా (సి) దినేశ్ కార్తీక్ (బి) బ్రేస్‌వెల్ 1; రింకూ సింగ్ (సి) దినేశ్ కార్తీక్ (బి) హర్షల్ పటేల్ 46; రసెల్ (సి) కోహ్లి (బి) కరణ్ శర్మ 0; శార్దుల్ ఠాకూర్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) సిరాజ్ 68; నరైన్ (నాటౌట్) 0; ఉమేశ్ యాదవ్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 204. వికెట్ల పతనం:** 1–26, 2–26, 3–47, 4–89, 5–89, 6–192, 7–198. **బౌలింగ్:** సిరాజ్ 4–0–44–1, డేవిడ్ విల్లీ 4–1–16–2, ఆకాశ్‌దీప్ 2–0–30–0, బ్రేస్‌వెల్ 3–0–34–1, షహబాజ్ అహ్మద్ 1–0–6–0, కరణ్ శర్మ 3–0–26–2, హర్షల్ పటేల్ 3–0–38–1.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (బి) నరైన్ 21; డు ప్లెసిస్ (బి) వరుణ్ చక్రవర్తి 23; బ్రేస్‌వెల్ (సి) నితీశ్ రాణా (బి) శార్దుల్ ఠాకూర్ 19, మ్యాక్స్‌వెల్ (బి) వరుణ్ చక్రవర్తి 5; హర్షల్ పటేల్ (బి) వరుణ్ చక్రవర్తి 0; షహబాజ్ అహ్మద్ (సి) శార్దుల్ (బి) నరైన్ 1; దినేశ్ కార్తీక్ (సి) వరుణ్ (బి) సుయశ్ శర్మ 9; అనూజ్ రావత్ (సి) నరైన్ (బి) సుయశ్ శర్మ 1; విల్లీ (నాటౌట్) 20, కరణ్ శర్మ (సి) నితీశ్ రాణా (బి) సుయశ్ శర్మ 1, ఆకాశ్‌దీప్ (సి అండ్ బి) వరుణ్ చక్రవర్తి 17; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (17.4 ఓవర్లలో ఆలౌట్) 123. వికెట్ల పతనం:** 1–44, 2–46, 3–54, 4–54, 5–61, 6–61, 7–84, 8–86, 9–96, 10–123. **బౌలింగ్:** ఉమేశ్ యాదవ్ 2–0–17–0, టిమ్ సౌతీ 2–0–25–0, సునీల్ నరైన్ 4–0–16–2, వరుణ్ చక్రవర్తి 3.4–0–15–4, సుయశ్ శర్మ 4–0–30–3, శార్దుల్ ఠాకూర్ 2–0–15–1.

డాక్టర్ రోబో



టీచర్ రాంబాబుతో కలసి డాక్టర్ రోబోను చూపుతున్న జెస్సికా, కె. వర్షిణి ప్రియాంక, కె. రేష్మా బిందు

- విశాఖ ఎస్సీ గురుకుల విద్యార్థినుల వినూత్న ఆవిష్కరణ
- రోగ లక్షణం చెబితే మందులు ఇస్తుంది
- ఏ రోగానికి ఏ డాక్టర్‌కి చూపించాలి.. డాక్టర్ ఖాళీగా ఉన్నారా లేదా చెబుతుంది

సాక్షి, అమరావతి: అనారోగ్యం వస్తే డాక్టర్ వద్దకు వెళ్లడం.. జబ్బు లక్షణాన్ని బట్టి వైద్యులు పరీక్షించి మందులు రాయడం అందరికీ తెలిసిందే. అదే పని ఒక రోబో చేస్తే?.. ఈ ఆలోచన వచ్చిందే తడవుగా ఎస్సీ గురుకుల విద్యార్థినులు డాక్టర్ రోబోను ఆవిష్కరించారు. విశాఖపట్నంలోని మధురవాడ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం–సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చెందిన విద్యార్థినులు జెస్సికా (10వ తరగతి), కె. వర్షిణి ప్రియాంక, కె. రేష్మా బిందు (9వ తరగతి)లు ఫిజికల్ సైన్స్ టీచర్ డాక్టర్ టి.రాంబాబు పర్యవేక్షణలో 'డాక్టర్ రోబో'కాన్సెప్ట్‌ను రూపొందించారు. ఈ ప్రాజెక్టు అటల్ టింకరింగ్ ల్యాబ్స్ (ఏటీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన మారథాన్ 2021–22 టాప్‌టెన్ ప్రాజెక్టుల్లో ఒకటిగా ఎంపిక కావడం విశేషం. ఏటీఎల్–మారథాన్ 2021–22ను ఎంటర్‌ప్రెన్యూర్ ఇంటర్న్‌షిప్ పేరుతో ఈ ఏడాది జనవరి 9 నుంచి 13 వరకు నిర్వహించారు. బెంగళూరు వేదికగా నిర్వహించిన ఈ పోటీల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 16 వేల మంది విద్యార్థులు 7వేల ప్రాజెక్టులను ప్రదర్శించారు.

డాక్టర్ రోబో పనితీరు ఇలా..

డాక్టర్ రోబో కృత్రిమ మేథస్సుతో పని చేస్తుంది. రోగి తన పరిస్థితిని రోబోకు వివరిస్తే అతను వాడాల్సిన మందులను స్క్రీన్‌పై డిస్‌ప్లే చేయడంతోపాటు ఔషధాలను ఇస్తుంది. రోగికి ఇంకా ఏదైన సమస్య ఉంటే రోబో ప్రత్యేక వైద్యులకు వీడియోకాల్ చేసి కనెక్ట్ చేస్తుంది. రోగి వారితో మాట్లాడి వైద్య సహాయం పొందవచ్చు. అలాగే, ఏఏ ప్రాంతాల్లో వైద్య నిపుణులున్నారు? ఏ రోగానికి ఏ వైద్యుడ్ని సంప్రదించాలి? అవసరమైన వైద్యులు బిజీగా ఉంటే ఏ సమయంలో అందుబాటులోకి వస్తారు? వంటి సమాచారాన్ని డాక్టర్ రోబో అందిస్తుంది. ఇక ఈ రోబో రోగి దగ్గరకే వెళ్లి వైద్యసేవలు అందిచేలా ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

డాక్టర్ రోబో వినియోగంలోకి వస్తే మేలు..

పెరుగుతున్న వైద్య అవసరాలకు తగ్గట్లు డాక్టర్ రోబో కాన్సెప్ట్ చాలా ఉపయోగపడుతుంది. ప్రధానంగా గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో ఇది చాలా మేలు చేస్తుంది. కోవిడ్ సమయంలో డాక్టర్‌ను సంప్రదించడం, వైద్యసేవలు అందించడం వంటి అనేక సమస్యలకు మార్గం చూపేలా డాక్టర్ రోబోను ఆవిష్కరించాం. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ డెవలప్‌చేశాం. ఇది డాక్టర్‌లా సేవలు అందించడమే కాదు.. డాక్టర్లకు కూడా సహాయకుడిగా ఉపయోగపడుతుంది. దీన్ని మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం.

– జెస్సికా, కె. వర్షిణి ప్రియాంక, కె. రేష్మా బిందు.. ఎస్సీ గురుకుల విద్యార్థినులు



భద్రాద్రి రామయ్యకు కాసుల పంట

భద్రాచలం: భద్రాచలం రామయ్యకు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా కాసుల వర్షం కురిసింది. శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం ఈవో ఎల్.రమాదేవి ఆధ్వర్యాన లెక్కించారు. ఈ సందర్భంగా 63 రోజులకు రూ.2,08,56,332 ఆదాయం నమోదైంది. 218 గ్రాముల బంగారం, కేజీ 445 గ్రాముల వెండి, వివిధ దేశాల కరెన్సీని భక్తులు హుండీల్లో వేశారు.



రోబో అనుసంధానంతో గుండె ఆపరేషన్

- దేశంలోనే మొదటిసారిగా నిర్వహించిన కాంటినెంటల్ ఆసుపత్రి
- తక్కువ బాధ... త్వరగా రోగి కోలుకోవడం దీని ప్రత్యేకత



రోబో సాయంతో ఆపరేషన్ నిర్వహిస్తున్న వైద్యులు

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో వైద్య రోబో అనుసంధానంతో ఓ రోగికి గుండె ఆపరేషన్ జరిగింది. గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రి వైద్యులు గురువారం విజయవంతంగా ఈ ఆపరేషన్ నిర్వహించి చరిత్ర సృష్టించారు. సాధారణ గుండె ఆపరేషన్లకు భిన్నంగా అత్యాధునిక రోబో అనుసంధానంతో గుండె ఆపరేషన్ చేయడం ఓ ముందడుగు. గతంలో రెండుసార్లు యాంజియోప్లాస్టీ చేయించుకున్న ఓ 36 ఏళ్ల రోగికి కాంటినెంటల్ ఆసుపత్రి కార్డియో థొరాసిక్, వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ ప్రదీప్ రాచకొండ నేతృత్వంలోని శస్త్రచికిత్స బృందం ప్రపంచ ప్రఖ్యాత రొబోటిక్ సీటీవీఎస్ సర్జన్, ఎస్ఎస్ ఇన్నొవేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ సుధీర్ శ్రీవాస్తవ ఆధ్వర్యంలో ఎస్ఎస్ఐ మంత్ర రోబో అనుసంధానంతో విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించింది. ఈ విషయాన్ని కాంటినెంటల్ ఆసుపత్రుల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురు ఎస్.రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శస్త్రచికిత్సను వైద్యశాస్త్రంలో ఒక ముందడుగుగా అభివర్ణించారు. రోగికి అతితక్కువ బాధ, తక్కువ ఇబ్బందితోనే ఆపరేషన్ నిర్వహించగలగడం ఈ విధానం ప్రత్యేకత అని వివరించారు. అతితక్కువ సమయంలోనే రోగి తిరిగి సాధారణ స్థాయికి చేరుకోవడం విశేషమని తెలిపారు. ఈ విజయం దేశ ప్రతిష్టతను పెంపొందించడమేగాక యావత్ దేశానికి స్ఫూర్తిదాయకంగా, తెలంగాణకు గర్వకారణంగా వెలుగొందుతోందన్నారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.